నినాదం
తెలంగాణ ప్రాంతీయం
నిఖార్సైన జర్నలిజం
మంగళవారం
19 మే 2026

# ముత్తారం చెరువు పూడిక పనులు ప్రారంభం







**భీమదేవరపల్లి మే 18 (నినాదం):**
హనుమకొండ జిల్లా భీమదేవరపల్లి మండలం ముత్తారం గ్రామంలోని మంగళవారం ఎం.ఐ. ట్యాంక్ (చెరువు)లో పూడిక తొలగింపు (డీసిల్టింగ్) పనులు ఉపాధి హామీ పనులలో భాగంగా ప్రారంభమయ్యాయి. ఈ పనుల్లో సుమారు రెండు వందల మంది ఉపాధి కూలీలు పాల్గొని పనులు చేస్తున్నారు. ఇంచార్జ్ సర్పంచ్ మాట్ల హరికుమార్ కొబ్బరి కాయ కొట్టి పూడికతీత పనులను అధికారికంగా ప్రారంభించారు. చెరువులో పేరుకుపోయిన మట్టిని తొలగించడం ద్వారా నీటి నిల్వ సామర్థ్యం పెరగడంతో పాటు భూగర్భ జలాల మట్టం కూడా మెరుగుపడనుంది. వర్షాకాలంలో ఎక్కువ నీరు నిల్వ ఉండి రైతులకు సాగునీటి సమస్య తగ్గే అవకాశం ఉందని గ్రామస్థులు భావిస్తున్నారు. ఈ సందర్భంగా ఇంచార్జ్ సర్పంచ్ మాట్లాడుతూ, గ్రామ రైతులకు సాగునీటి సమస్య తగ్గించేందుకు ఈ పనులు ఎంతో ఉపయోగపడతాయని తెలిపారు. చెరువు పూర్తిస్థాయిలో నీటిని నిల్వ చేసుకునేలా చర్యలు తీసుకుంటున్నామని, గ్రామ అభివృద్ధికి అవసరమైన పనులను దశలవారీగా పూర్తి చేస్తామని అన్నారు. భూగర్భ జలాల స్థాయి పెరగడం ద్వారా తాగునీటి సమస్య కూడా తగ్గే అవకాశముందని పేర్కొంటూ, గ్రామ ప్రజలు అభివృద్ధి కార్యక్రమాలకు సహకరించాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో క్షేత్ర సహాయకులు పార్నందుల మహేందర్, వార్డు సభ్యులు పాల్గొన్నారు.

# "సమాన సమాజ సాధన కోసం సుందరయ్య ఆశయాలే మార్గదర్శకం"






**అశ్వాపురం, మే 18 (నినాదం):**
భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అశ్వాపురం మండలం కుమ్మరిగూడెం గ్రామంలో కామ్రేడ్ పుచ్చలపల్లి సుందరయ్య గారి వర్ధంతి సందర్భంగా సీపీఎం పార్టీ సభ్యులు, సానుభూతిపరుల కోసం నిర్వహించిన రాజకీయ శిక్షణా తరగతులు ఘనంగా నిర్వహించబడ్డాయి. ఈ సందర్భంగా సీపీఎం సీనియర్ నాయకులు, మాజీ సర్పంచ్ కామ్రేడ్ పాయం భద్రయ్య పార్టీ జెండాను ఆవిష్కరించారు.ఈ కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు కామ్రేడ్ కొలగాని బ్రహ్మాచారి, కామ్రేడ్ రేపాకుల శ్రీనివాస్, జిల్లా కమిటీ సభ్యులు కామ్రేడ్ గద్దల శ్రీనివాస్, మండల కార్యదర్శి పాయం నర్సింహారావు, మండల కమిటీ సభ్యులు అశోక్ రెడ్డి, ఎన్వీ భద్రయ్య, మోకాళ్ల రమేష్, పాయం విజయ, బొడ్డు రాములు, జానకమ్మ, మోకాళ్ల తిరుపతమ్మ తదితరులు పాల్గొన్నారు. రాజకీయ శిక్షణా తరగతుల్లో భాగంగా "సీపీఎం విశిష్టత" అంశంపై సీపీఎం భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు కామ్రేడ్ కొలగాని బ్రహ్మాచారి బోధించగా, "పార్టీ నిర్మాణం మరియు బలోపేతం" అంశంపై కామ్రేడ్ రేపాకుల శ్రీనివాస్ పార్టీ సభ్యులకు అవగాహన కల్పించారు.ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ, కామ్రేడ్ పుచ్చలపల్లి సుందరయ్య ఆశయాలను ప్రజల్లోకి తీసుకెళ్లి, పార్టీ బలోపేతానికి ప్రతి కార్యకర్త కృషి చేయాలని పిలుపునిచ్చారు.



## రిక్షా కార్మికుడు పెంటయ్యకు ఘన నివాళి

### దశదిన కర్మల్లో పాల్గొన్న కాంగ్రెస్ నాయకులు

**అశ్వాపురం,మే 18(నినాదం):**
మండల కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ వీరాభిమాని, రిక్షా కార్మికుడు మురికిపూడి పెంటయ్య రోడ్డు ప్రమాదంలో మృతి చెందగా, సోమవారం ఆయన స్వగృహంలో నిర్వహించిన దశదిన కర్మల కార్యక్రమంలో మండల కాంగ్రెస్ నాయకులు పాల్గొని ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ, పెంటయ్య కాంగ్రెస్ పార్టీ పట్ల ఎంతో అభిమానం కలిగి ఉండి, ప్రజలతో సత్సంబంధాలు కొనసాగించిన వ్యక్తిగా గుర్తుచేశారు. ఆయన మృతి పార్టీకి, కుటుంబ సభ్యులకు తీరని లోటని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు, జిల్లా కాంగ్రెస్ జనరల్ సెక్రటరీ ఓరుగంటి బిక్ష్మయ్య, సీనియర్ నాయకులు గాదె కేశవరెడ్డి, ఓరుగంటి రమేష్ బాబు, తెల్లం నాగరాజు, గొల్లపల్లి జార్జి, మురికిపూడి వెంకన్న, మురికిపూడి వెంకటేశ్వర్లు, పేర్ల లక్ష్మయ్య, కేశపాక మోతె, మిరియాల వెంకటేశ్వర్లు, అలవాల రమేష్, దొరపల్లి నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

## ప్రమాదంలో ఆన్‌సాన్ పల్లి ప్రధాన వాటర్ ట్యాంక్

**మల్హార్, మే 18 (నినాదం):**
ఆన్ సాన్ పల్లి గ్రామంలోని ప్రధాన వాటర్ ట్యాంక్ ప్రమాదకర పరిస్థితిలో ఉందని గ్రామ ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. సుమారు 25 సంవత్సరాల క్రితం నిర్మించిన ఈ వాటర్ ట్యాంక్ ప్రస్తుతం శిథిలావస్థకు చేరుకుందని తెలిపారు. గత నాలుగు సంవత్సరాలుగా గ్రామపంచాయతీ సిబ్బందికి ట్యాంక్ శుభ్రపరిచే పనులు చేయడం కూడా కష్టంగా మారిందని పేర్కొన్నారు.ఈ సమస్యను నూతన పాలకవర్గం ఏర్పడిన తొలి గ్రామ సభలోనే సర్పంచ్ మరియు సంబంధిత ఏఈ దృష్టికి తీసుకెళ్లినప్పటికీ ఇప్పటివరకు ఎలాంటి చర్యలు తీసుకోలేదని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు.వాటర్ ట్యాంక్ సమీపంలో అంగన్వాడీ కేంద్రం, హనుమాన్ దేవాలయం ఉండటంతో ప్రమాదం మరింత పెరిగిందని తెలిపారు. ముఖ్యంగా అంగన్వాడీ కేంద్రంలో చిన్నారులు ఉండటంతో ఎప్పుడైనా ప్రమాదం జరిగే అవకాశం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. అలాగే ట్యాంక్ ద్వారా సరఫరా అవుతున్న తాగునీటి వల్ల గ్రామ ప్రజలకు చర్మవ్యాధులు వచ్చే ప్రమాదం ఉందని పేర్కొన్నారు. రానున్న వర్షాకాలంలో ఈదురుగాలులు, భారీ వర్షాలతో ట్యాంక్ కూలిపోయే అవకాశం ఉందని హెచ్చరించారు.ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి ప్రమాదకరంగా మారిన వాటర్ ట్యాంక్‌ను తొలగించి, సురక్షిత ప్రాంతంలో కొత్త ట్యాంక్ నిర్మించాలని ఆన్ సాన్ పల్లి బీ ఆర్ఎస్ నాయకులు ఢిల్లీ రాజు డిమాండ్ చేశారు.



# పరుగులతో ఆరోగ్య చైతన్యం.. అశ్వాపురంలో ఫిట్ తెలంగాణ కార్యక్రమం




**అశ్వాపురం, మే 18(నినాదం):**
ప్రజా పాలన – ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా అశ్వాపురం మండల కేంద్రంలో సోమవారం ఎంపీడీవో ముత్యాలరావు ఆధ్వర్యంలో "ఫిట్ అండ్ యాక్టివ్ తెలంగాణ 2కే రన్"★కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమం ఆరోగ్యంపై ప్రజల్లో అవగాహన పెంపొందించడమే లక్ష్యంగా నిర్వహించబడింది.మండల కేంద్రంలో నిర్వహించిన ఈ 2కే రన్‌లో వివిధ శాఖల అధికారులు, సిబ్బంది, యువత, విద్యార్థులు, ప్రజాప్రతినిధులు, క్రీడాభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఆరోగ్యకరమైన జీవనశైలిని అలవర్చుకోవడం, నిత్య జీవితంలో వ్యాయామం, నడక, పరుగులు వంటి అలవాట్లను పెంపొందించుకోవడం ఎంత ముఖ్యమో ఈ కార్యక్రమం ద్వారా ప్రజలకు వివరించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో ముత్యాలరావు మాట్లాడుతూ, నేటి ఆధునిక జీవన విధానంలో శారీరక శ్రమ తగ్గిపోవడం వల్ల అనేక ఆరోగ్య సమస్యలు పెరుగుతున్నాయని తెలిపారు. ఆరోగ్యాన్ని కాపాడుకోవడానికి ప్రతి ఒక్కరూ రోజువారీ జీవితంలో కొంత సమయాన్ని వ్యాయామం, నడక, క్రీడలకు కేటాయించాలని సూచించారు. ప్రజల ఆరోగ్యం బాగుంటేనే సమాజం ఆరోగ్యంగా, రాష్ట్రం అభివృద్ధి దిశగా ముందుకు సాగుతుందని పేర్కొన్నారు. అలాగే ప్రజా పాలన – ప్రగతి ప్రణాళికలో భాగంగా ప్రభుత్వం ప్రజల సంక్షేమం, ఆరోగ్యం, అభివృద్ధికి ప్రాధాన్యత ఇస్తోందని తెలిపారు. యువత చెడు అలవాట్లకు దూరంగా ఉండి క్రీడలు, ఆరోగ్య కార్యక్రమాల పట్ల ఆసక్తి కనబరచాలని పిలుపునిచ్చారు.కార్యక్రమంలో పాల్గొన్న వారు "ఫిట్ తెలంగాణ – హెల్తీ తెలంగాణ", "ఆరోగ్యమే మహాభాగ్యం" వంటి నినాదాలతో ఉత్సాహంగా పరుగులో పాల్గొన్నారు..

## మాణిక్యాపూర్‌లో బోరు ఏర్పాటు చేసిన కేంద్ర మంత్రి బండి సంజయ్‌కు కృతజ్ఞతలు

**భీమదేవరపల్లి మే 18 (నినాదం):**
హనుమకొండ జిల్లా భీమదేవరపల్లి మండలం మాణిక్యాపూర్ గ్రామంలో ప్రజలకు తాగునీటి ఇబ్బందులు లేకుండా బోరు ఏర్పాటు చేయించిన కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి, కరీంనగర్ పార్లమెంట్ సభ్యులు బండి సంజయ్ కు గ్రామ మరియు మండల బీజేపీ నాయకులు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ ముదసాని మమత–సదానందం మాట్లాడుతూ గ్రామ ప్రజల నీటి సమస్యను గుర్తించి వెంటనే స్పందించిన కేంద్ర మంత్రి బండి సంజయ్‌కు గ్రామస్థుల తరఫున కృతజ్ఞతలు తెలియజేశారు. ఉప సర్పంచ్ శ్రీనివాస్, పాలకవర్గ సభ్యులు కూడా ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. కార్యక్రమంలో జిల్లా నాయకులు మాచర్ల కుమారస్వామి, మండల అధ్యక్షులు శ్రీనివాస్, బీజేపీ సీనియర్ నాయకులు తీగల రాజు, రామారాపు భద్రయ్య, ఐలయ్య, అర్జున్, గణేష్, తిరుపతి, అఖిల్, రాకేష్, కార్తీక్, గ్రామ బూత్ అధ్యక్షులు మరియు బీజేపీ కార్యకర్తలు పాల్గొన్నారు.



## 20న మెడికల్ షాపులు దేశ వ్యాప్తంగా బందు పిలుపు



**మల్హార్, మే 18 (నినాదం):**
జయశంకర్ భూపాలపల్లి జిల్లా మల్హార్ మండల డ్రగిస్ట్ అండ్ కెమిస్ట్ కమిటీ ఆధ్వర్యంలో స్థానిక ఎస్సై–2 రాజన్ కి, తహసీల్దార్ కి వినతి పత్రం అందజేశారు."ఆన్‌లైన్ ద్వారా డ్రగ్స్ విక్రయాలు పెరుగుతున్నాయని, ముఖ్యంగా నార్కోటిక్ డ్రగ్స్ సరఫరా జరుగుతోందని పేర్కొంటూ వాటిని తక్షణమే నిషేధించాలని కమిటీ డిమాండ్ చేసింది.జాతీయ స్థాయి బంద్ పిలుపులో భాగంగా ఈ నెల 20వ తేదీ బుధవారం మల్హార్ మండలంలోని అన్ని మెడికల్ షాపులను బంద్ చేయనున్నట్లు కమిటీ ప్రకటించింది. ఈ బంద్‌కు మండల ప్రజలు సహకరించాలని కోరింది.ప్రజలకు ఇబ్బందులు కలగకుండా ఒక రోజు ముందుగానే అత్యవసర మందులు కొనుగోలు చేసుకోవాలని మండల కమిటీ విజ్ఞప్తి చేసింది.

## కష్టపడి చదివితేనే ఉన్నత భవిష్యత్తు సాధ్యం

### విద్యార్థులకు నగదు అందజేసిన కావేరి విత్తన సంస్థ చైర్మన్



**భీమదేవరపల్లి మే 18 (నినాదం):**
హనుమకొండ జిల్లా భీమదేవరపల్లి మండలంలోని గట్ల నర్సింగాపూర్ జీఎస్ఎస్ఆర్ ఉన్నత పాఠశాలలో పదో తరగతిలో ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన గుండవరం వెంకట భాస్కర్ రావు విద్యార్థులకు పూలబొకేలు, శాలువాలు, నగదు బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థి దశలో కష్టపడి చదివితేనే భవిష్యత్తులో ఉన్నత శిఖరాలను అధిరోహించవచ్చని అన్నారు. గ్రామీణ ప్రాంత విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించేందుకు ప్రతి నెల లక్షల రూపాయలు వెచ్చిస్తూ అన్ని సౌకర్యాలు కల్పిస్తున్నామని తెలిపారు. ఈ అవకాశాలను సద్వినియోగం చేసుకుని క్రమశిక్షణతో చదివి ఉన్నత లక్ష్యాలను సాధించాలని విద్యార్థులకు సూచించారు. అలాగే విద్యార్థుల భవిష్యత్ లక్ష్యాలను తెలుసుకుంటూ వారిలో ఆత్మవిశ్వాసం నింపారు.అనంతరం పదో తరగతిలో ఉత్తమ ఫలితాలు సాధించిన బొంతల సృజన, జక్కుల శివకుమార్, మెరుగు సంహిత, గడ్డం తేజశ్రీ, గడిపె ఉత్తేజిత, భూక్య శ్రీలత, జనగం సుధీష్ణ, బైరి అక్షయ, అంజన్నలను సన్మానించి నగదు పురస్కారాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు డోరి రమేష్, సర్పంచ్ బొల్లంపల్లి అజయ్ కుమార్, మండల విద్యాధికారి ఎం. సునీత, ఉపసర్పంచ్ బోడిగె శ్రీనివాస్, కావేరి సూపర్వైజర్ రాంకిషన్ రాజు, ఉపాధ్యాయులు ఎ. శ్రీనివాస్ రెడ్డి, కామరపు శ్రీనివాస్, ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఎన్. వెంకటేశ్వర్లు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## ప్రజా పాలన–ప్రగతి ప్రణాళికలో 2కే రన్ నిర్వహణ

### తాడిచర్లలో ఘనంగా యువజన వారోత్సవాలు.. ప్రజా పాలన - ప్రగతి ప్రణాళిక' వాకథాన్

**మల్హార్, మే 18 (నినాదం):**
తెలంగాణ ప్రభుత్వ ఆదేశాల మేరకు మల్హార్ రావు మండల కేంద్రమైన తాడిచర్లలో ప్రజా పాలన – ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణ ప్రణాళికలో భాగంగా సోమవారం యువజన వారోత్సవాలను ఘనంగా ప్రారంభించారు. మే 18 నుండి మే 23 వరకు జరిగే ఈ వారోత్సవాల మొదటి రోజున మండల ప్రజా పరిషత్ ఆధ్వర్యంలో 2కే రన్ కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయం నుండి తాడిచెర్ల హనుమాన్ సెంటర్ వరకు ఈ పరుగు 2కే రన్ నిర్వహించారు. యువతలో స్ఫూర్తిని నింపేందుకు ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమంలో ఎన్ఆర్ఈజీఎస్ రాష్ట్ర కౌన్సిల్ మెంబర్ దండు రమేష్, ఫాక్స్ చైర్మన్ ఇప్ప మొండయ్య, ఎంపీడీఓ క్రాంతి కుమార్, తాడిచర్ల సర్పంచ్ తో పాటు ఉప సర్పంచ్ , స్థానిక వార్డు సభ్యులు కామ బాపు, మేనం సంగీత రాకేష్, పంచాయతీ కార్యదర్శులు మల్లికార్జున్ రెడ్డి, సతీష్, యువకులు, ప్రజా ప్రతినిధులు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.



## ఉద్యమ నాయకునికి మాజీ ఎమ్మెల్యే పిఎన్ ఆర్ పరామర్శ

**కొడంగల్,మే18(నినాదం) :**
తెలంగాణ ఉద్యమ నాయకుడు, బీఆర్ఎస్ యువ నాయకులు ఎర్రన్ పల్లి శ్రీనివాస్ ను కోడంగల్ మాజీ శాసనసభ్యులు పట్నం నరేందర్ రెడ్డి సోమవారం పరామర్శించారు. గత5 రోజుల క్రితం రోడ్డు ప్రమాదంలో చేతులు విరిగి గాయపడిన ఎర్రన్ పల్లి శ్రీనువాస్ ను పరామర్శించి ఆరోగ్య పరిస్థితి ని అడిగి తెలుసుకున్నారు. ధైర్యంగా ఉండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ యువ నాయకులు మడిగే శ్రీనివాస్, మాజీ సర్పంచ్ సోమనాథ్, ఉప్పరి మహేందర్ తదితరులు.



# పాఠశాల భవన నిర్మాణంలో భద్రతా ప్రమాణాలు తప్పనిసరి

### గ్రామీణ విద్యార్థులకు అంతర్జాతీయ స్థాయి విద్యా సౌకర్యాలు

### నాణ్యమైన విద్యతో పాటు మెరుగైన వసతి కల్పన ప్రభుత్వ లక్ష్యం.... నాగర్ కర్నూల్ జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటీల్

**నాగర్ కర్నూల్ మే 18 (నినాదం)**
నాగర్‌కర్నూల్ నియోజకవర్గ పరిధిలోని తూడుకుర్తి గ్రామంలో ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తున్న ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ పాఠశాల నిర్మాణ పనులను సోమవారం జిల్లా కలెక్టర్ హేమంత్ కేశవ్ పాటీల్ క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ పాఠశాల భవన నిర్మాణంలో తరగతి గదులు, వసతి గృహాలు, ప్రయోగశాలలు, భోజనశాల, పారిశుధ్య సదుపాయాలు తదితర అంశాలను నిశితంగా కలెక్టర్ పరిశీలించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటీల్ మాట్లాడుతూ...., గ్రామీణ ప్రాంత విద్యార్థులకు అంతర్జాతీయ స్థాయి విద్యా సౌకర్యాలను అందించాలనే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ పాఠశాలలను నిర్మిస్తున్నట్లు తెలిపారు. గ్రామీణ విద్యార్థులు కూడా నగర స్థాయి విద్యా అవకాశాలను పొందేలా ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారిస్తోందన్నారు.విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకొని పాఠశాల నిర్మాణ పనులను అత్యుత్తమ నాణ్యత ప్రమాణాలతో చేపట్టాలని సంబంధిత అధికారులకు, కాంట్రాక్టర్లకు కలెక్టర్ ఆదేశాలు జారీ చేశారు.





పనుల్లో ఎటువంటి నిర్లక్ష్యం, ఆలస్యం చోటుచేసుకోకుండా నిరంతరం పర్యవేక్షణ కొనసాగించాలని సూచించారు. నిర్మాణ పనుల పారదర్శకత కోసం పనుల ప్రాంగణాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసి పనులను వేగవంతంగా పూర్తి చేయాలని పేర్కొన్నారు.పాఠశాల భవన నిర్మాణంలో భద్రతా ప్రమాణాలను తప్పనిసరిగా పాటించాలని, ప్రతి గది విద్యార్థులకు అనుకూలంగా, సౌకర్యవంతంగా ఉండేలా నిర్మించాలని, ముఖ్యంగా హాస్టల్ గదులు, తాగునీటి వసతి, పరిశుభ్రమైన మరుగుదొడ్లు, విద్యుత్ సదుపాయాలు, క్రీడా మైదానాలు వంటి మౌలిక సదుపాయాలపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని అధికారులకు సూచించారు. రాష్ట్ర ప్రభుత్వం నిర్దేశించిన గడువులోగా నిర్మాణ పనులను పూర్తి చేసి విద్యార్థుల తరగతుల నిర్వహణకు అందుబాటులోకి తీసుకురావాలని కలెక్టర్ ఆదేశించారు. విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు మెరుగైన వసతి, భద్రతా, ప్రశాంతమైన వాతావరణం కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమని తెలిపారు.
ఈ కార్యక్రమంలో ఇంజినీరింగ్ అధికారులు, కాంట్రాక్టర్ ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

నినాదం
తెలంగాణ ప్రాంతీయం
నిఖార్సైన జర్నలిజం
మంగళవారం
19 మే 2026

# యువత క్రమశిక్షణతో చదివితే ప్రభుత్వ ఉద్యోగాలు సాధించగలరు: జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష

**పోలీస్ యువశక్తి ప్రోగ్రామ్ ఆధ్వర్యంలో మెగా మాక్ టెస్ట్...**
**విజేతలకు బహుమతుల ప్రదానం....**
**పోలీస్,ఎస్సై,ఫారెస్ట్ బీట్ ఆఫీసర్ ఉద్యోగాల కోసం సిద్ధమవుతున్న యువతకు మెగా మాక్ టెస్ట్ నిర్వహణ....**
**ప్రతిభ కనబరిచిన అభ్యర్థులకు ప్రథమ బహుమతి రూ.10,000, ద్వితీయ బహుమతి రూ.5,000 చెక్కుల అందజేత...**




**పెద్దపల్లి రూరల్,మే-18(నినాదం):**
యువత క్రమశిక్షణతో నిరంతర సాధన చేస్తే ప్రభుత్వ ఉద్యోగాలు సాధించగలరని,జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష తెలిపారు.సోమవారం కలెక్టరేట్ కార్యాలయంలోని జిల్లా కలెక్టర్ చాంబర్‌లో నిర్వహించిన కార్యక్రమంలో మెగా మాక్ టెస్ట్‌లో ప్రతిభ కనబరిచిన అభ్యర్థులకు జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష చేతుల మీదుగా నగదు బహుమతుల చెక్కులను అందజేశారు.ప్రథమ బహుమతిగా రూ.10,000,ద్వితీయ బహుమతిగా రూ.5,000 చెక్కులను ప్రదానం చేశారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష మాట్లాడుతూ,పోలీస్ యువశక్తి ప్రోగ్రామ్ ఆధ్వర్యంలో పెద్దపల్లి జిల్లా యువతకు పోలీస్ కానిస్టేబుల్,ఎస్సై,ఫారెస్ట్ బీట్ ఆఫీసర్ ఉద్యోగాల కోసం సిద్ధమవుతున్న అభ్యర్థుల కొరకు మెగా మాక్ టెస్ట్ మరియు ఈవెంట్స్ నిర్వహించినట్లు తెలిపారు.యువత పోలీస్ ఉద్యోగాల పట్ల పూర్తి అవగాహన కలిగి ఉండాలని,రాబోయే నోటిఫికేషన్లకు సమర్థంగా సిద్ధమై ఉద్యోగాలు సాధించాలని సూచించారు.లక్ష్య సాధనకు వ్యక్తిగత శిక్షణ,క్రమశిక్షణతో కూడిన నిరంతర సాధన ఎంతో అవసరమని తెలిపారు.పట్టుదలతో కృషి చేస్తే తప్పకుండా ప్రభుత్వ ఉద్యోగాలు సాధించగలరని పేర్కొన్నారు. రాబోయే రోజుల్లో కూడా యువతకు ఉపయోగపడే విధంగా మరిన్ని శిక్షణా కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు కలెక్టర్ వెల్లడించారు.ఈ కార్యక్రమంలో జిల్లా మార్కెటింగ్ అధికారి ప్రవీణ్ రెడ్డి, పోలీస్ యువశక్తి కార్యక్రమం కోఆర్డినేటర్ లెంకల మహిపాల్ రెడ్డి (ఎక్స్ ఆర్మీ) తదితరులు పాల్గొన్నారు.

# ఇల్లు కట్టమంటారు.. బిల్లు మాత్రం ఇవ్వరు

**నిరుపేదలను అప్పుల్లో నెట్టుతున్న ప్రభుత్వం**
**ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షులు కొమ్ము చెన్నకేశవులు మాదిగ**

**వనపర్తి ప్రతినిధి, మే 18 (నినాదం)**



ఇల్లు కట్టమంటారు.. బిల్లులు మాత్రం ఇవ్వరని, ప్రభుత్వం నిరుపేదలను అప్పుల ఊబిల్లోకి నెట్టుతున్నదని ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షులు కొమ్ము చెన్న కేశవులు మాదిగ ఆరోపించారు. వనపర్తి మండలం అచ్యుతాపురం గ్రామానికి చెందిన మచ్చ చంద్రయ్య కు ఇందిరమ్మ ఇండ్ల పథకంలో మొదటి దఫాలో ఇల్లు మంజూరు చేశారని, నేటి వరకు మొదటి బిల్లు విడుదల కాకపోవడం ప్రభుత్వ నిర్లక్ష్యానికి నిదర్శనమని ఎమ్మార్పీఎస్ వనపర్తి జిల్లా అధ్యక్షులు కొమ్ము చెన్నకేశవులు మాదిగ తీవ్రంగా విమర్శించారు. సోమవారం మచ్చ చంద్రయ్య కు ఇందిరమ్మ ఇంటి బిల్లు రాలేదని ప్రజావాణిలో జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి, హౌసింగ్ పీడీ విఠోబా లకు వినతి పత్రాలను అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేదలకు ఇళ్లు ఇస్తామని చెప్పి బిల్లులు మాత్రం నెలల తరబడి ఆపివేయడం వల్ల లబ్ధిదారులు తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు. మచ్చ చంద్రయ్య అప్పులు చేసి ఇంటి నిర్మాణ పనులు ప్రారంభించినప్పటికీ ప్రభుత్వం నుండి రావలసిన ఆర్థిక సాయం అందక అప్పుల భారంతో ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. సంబంధిత అధికారులను ఎన్నిసార్లు కలిసినా త్వరలో వస్తుంది అనే మాట తప్ప ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. పేదల ఇళ్ల విషయంలో ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరించడం బాధాకరమని అన్నారు. కలెక్టర్ స్పందించి మచ్చ చంద్రయ్య కు రావలసిన మొదటి బిల్లును వెంటనే విడుదల చేయించి న్యాయం చేయాలని ఆయన కోరారు.ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ జిల్లా అనుబంధ సంఘాల సమన్వయకర్త గంధం గట్టయ్య మాదిగ, ఎమ్మార్పీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి మీసాల నాగరాజు మాదిగ, లబ్ధిదారుడు మచ్చ చంద్రయ్య తదితరులు పాల్గొన్నారు



# టీజీఈఏపీసెట్ ఫలితాల్లో గడ్డిఅన్నారం నారాయణ విద్యార్థుల ప్రభంజనం

**ఎల్ బినగర్, నినాదం:**
టీజీ ఈఏపీసెట్–2026 ఫలితాల్లో గడ్డిఅన్నారం బెంచ్ నారాయణ విద్యార్థులు ప్రభంజనం సృష్టించారు. ఇంజినీరింగ్ విభాగాలలో అత్యుత్తమ ర్యాంకులు సాధించి సంస్థ తన నంబర్ వన్ స్థానాన్ని మరోసారి నిలబెట్టినట్లు దిల్ షుఖ్ నగర్ బ్రాంచ్ కోర్ డిన్ రాధా కృష్ణ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ టీజీ ఈఏపీసెట్–2026 ఫలితాల్లో నిశాంత్ 670 ర్యాంకు సాధించినట్లు తెలిపారు. 10 వేల లోపు వారికి 16 ర్యాంకులు సాధించారని వెల్లడించారు. గత సంవత్సరం కంటే ఈ ఏడాది మెరుగైన ఫలితాలు సాధించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో డీజియం రాజు, డీన్ కొండల్ రెడ్డి, ప్రిన్సిపాల్ బుచ్చి రెడ్డి, అడ్మినిస్ట్రేషన్ ఆఫీసర్ పుట్టం విజేందర్ తదితరులు పాల్గొన్నారు.

# అక్రమంగా తరలిస్తున్న పశువుల పట్టివేత

**డ్రైవర్‌పై కేసు నమోదు చేసిన నారాయణపేట పోలీసులు**

**నారాయణపేట ప్రతినిధి, మే 18, (నినాదం):**



నారాయణపేట జిల్లా కేంద్రంలోని ఎర్రగుట్ట చెక్‌పోస్టు వద్ద సోమవారం నాడు మధ్యాహ్నం యాద్గిరి నుండి నారాయణపేట వైపు వస్తున్న అశోక్ లేలాండ్ వాహనాన్ని పోలీసులు ఆపి తనిఖీ నిర్వహించారు. KA-33-36162 వ్యాన్ లో పరిమితికి మించి ప్రమాదకర పరిస్థితుల్లో 3 ఎద్దులు, 1 గేదె, 1 బర్రెపోతును తరలిస్తున్నట్లు గుర్తించారు. పశువుల రవాణాకు సంబంధించిన ఎటువంటి అనుమతి పత్రాలు లేకుండా వాహనాన్ని అజాగ్రత్తగా నడుపుతూ తరలిస్తున్నట్లు పోలీసులు తెలిపారు.వాహన డ్రైవర్‌ను విచారించగా అతను అబ్దుల్ వహీద్ గుర్మిత్కల్, కర్ణాటక కు చెందిన వ్యక్తిగా తెలిపాడని పోలీసులు తెలిపారు. పట్టుబడిన పశువులను తాత్కాలిక గోశాలకు తరలించి, డ్రైవర్‌పై కేసు నమోదు చేసినట్లు టౌన్ ఎస్ఐ వెంకటేశ్వర్లు తెలిపారు.




# దొంగతనాలకు పాల్పడుతున్న వ్యక్తులపై కేసు నమోదు

**కల్వకుర్తి మే 18 (నినాదం)**
తలకొండపల్లి మండలం లోని వ్యవసాయ పొలాల వద్ద రాత్రి సమయంలో బోరు మోటార్లు, స్టార్టర్ దొంగతనాలకు పాల్పడుతున్న నిందితులను తలకొండపల్లి పోలీసులు సోమవారం అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. సర్కిల్ ఇన్స్పెక్టర్ జానకిరామ్ రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం పడకల్ గ్రామానికి చెందిన ఉదరీ మల్లేష్, గోల్సాం శ్రీనివాసులు జల్సాలకు, మద్యానికి అలవాటు పడి డబ్బులు సులభంగా సంపాదించాలని నిర్ణయించుకున్నారు. వీరిద్దరూ కలసి పడకల్ గ్రామం శివారులో గత కొన్ని రోజుల క్రితం బోరు మోటర్ మరియు స్టార్టర్ ని దొంగతనం చేసినట్లు పోలీసులు గుర్తించారు. రెండు కేసుల్లో వీరిద్దరు ఉండగా మరొక కేసులో వీరిద్దరు అదే గ్రామానికి చెందిన మొకిరాళ్ల మల్లయ్య ఉన్నట్లు పోలీసులు తెలిపారు. నిందితుల నుంచి ఒక ట్రాక్టర్, టీవీఎస్ మోటర్ సైకిల్, రెండు బోరు మోటర్లు, ఒక స్టార్టర్ ని రికవరీ చేశారు. వెంటనే కేసును పరిష్కరించిన ఎస్సై శేఖర్ మరియు కానిస్టేబుల్ నాగని శ్రీనివాస్, నిరంజన్, రమేష్, జాషువాను ఈ సందర్భంగా ఇన్‌స్పెక్టర్ జానకిరామ్ రెడ్డి అభినందించారు.

# వడదెబ్బ ముప్పు.. ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

**కాటారం, మే 18 (నినాదం):**
రాష్ట్రంలో ఎండల తీవ్రత పెరుగుతున్న నేపథ్యంలో వడదెబ్బ కేసులు అధికమయ్యే ప్రమాదం ఉందని వైద్య ఆరోగ్య శాఖ హెచ్చరించింది. మే 19 నుంచి 24వ తేదీ వరకు పలుచోట్ల ఉష్ణోగ్రతలు 45 డిగ్రీల వరకు నమోదయ్యే అవకాశం ఉండటంతో ప్రజలు జాగ్రత్తలు పాటించాలని సూచించింది. ముఖ్యంగా ఉదయం 11.30 గంటల నుంచి మధ్యాహ్నం 4 గంటల వరకు బయట తిరగకుండా ఉండాలని అధికారులు తెలిపారు. ఎండలో ఎక్కువసేపు పనిచేయడం వల్ల తలనొప్పి, వాంతులు, నీరసం, అధిక దాహం, శరీర ఉష్ణోగ్రత పెరగడం వంటి వడదెబ్బ లక్షణాలు కనిపించే అవకాశం ఉందన్నారు.చిన్నపిల్లలు, వృద్ధులు, కూలీలు, రైతులు ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. రోజుకు ఎక్కువగా నీరు తాగడం, మజ్జిగ, కొబ్బరి నీళ్లు వంటి ద్రవపదార్థాలు తీసుకోవడం, తలకు గుడ్డ లేదా టోపీ ధరించడం మంచిదని వైద్యులు పేర్కొన్నారు. వడదెబ్బ లక్షణాలు కనిపించిన వెంటనే సమీప వైద్యశాలకు వెళ్లి చికిత్స పొందాలని అధికారులు సూచించారు.

# విద్యతోనే సర్వతోముఖాభివృద్ధి సాధ్యం

**వైరా ఎంఈఓ చావా శ్రీనివాసరావు**

**వైరా మే 18( నినాదం):**
విద్యతోనే సర్వతోముఖాభివృద్ధి సాధ్యమవుతుందని వైరా మండల విద్యాశాఖ అధికారి చావా శ్రీనివాసరావు, వైరా మున్సిపాలిటీ వైస్ చైర్మన్ కట్ల సంతోష్, కాంగ్రెస్ పార్టీ డాక్టర్ సెల్ జిల్లా అధ్యక్షులు డాక్టర్ కాపా మురళీకృష్ణ పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్న ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక లో భాగంగా సోమవారం వైరా మండల పరిషత్ కార్యాలయంలో ప్రభుత్వ, గురుకుల, ప్రైవేట్ విద్యాసంస్థలకు చెందిన మొత్తం 17 పాఠశాలలను ఎంపిక చేసి ఆయా పాఠశాలల్లో గత మార్చిలో జరిగిన పదో తరగతి పరీక్ష ఫలితాల్లో ప్రథమ, ద్వితీయ స్థానాలను సాధించిన విద్యార్థినీ విద్యార్థులకు ఘనంగా పౌర సన్మానం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థిని విద్యార్థులు మరింత ఉన్నత శిఖరాలను అధిరోహించాలని వారి తల్లిదండ్రుల ఆశలను నెరవేర్చాలని ఆకాంక్షించారు. విద్యార్థినీ విద్యార్థులకు ప్రశంసా పత్రాలను అందించారు.ఈ కార్యక్రమంలో వైరా ఎంపీడీవో సక్రియ నాయక్, 13వ వార్డు కౌన్సిలర్ ముళ్లపాటి విజయలక్ష్మి , విద్యాభిలాషి మందడపు రామారావు, వివిధ కాంప్లెక్స్ ల ప్రధానోపాధ్యాయులు, పలు ఉపాధ్యాయ సంఘాల బాధ్యులు పాల్గొన్నారు.



ఫోటో: పౌర సన్మానాన్ని అందుకుని ప్రశంసా పత్రాలను ప్రదర్శిస్తున్న విద్యార్థిని విద్యార్థులు.

# గంజాయి తరలింపుకు వేదికగా మారిన వికారాబాద్



**వికారాబాద్, మే 18(నినాదం ):**
యువతను మత్తులో ముంచేత్తి జీవితాలను ఛిద్రం చేస్తున్న గంజాయిని తరలించేందుకు వికారాబాద్ జిల్లాను వేదికగా చేసుకున్న వైనాన్ని అబ్కారి శాఖ ఎప్పటికప్పుడు అప్రమత్తమై పట్టుకుంటోంది. ఈ నేపథ్యంలో లోనే వికారాబాద్ మీదుగా తరలిస్తున్న 17 కిలోల గంజాయిని సోమవారం అబ్కారి పోలీసులు పట్టుకున్నారు. సొత్తును స్వాదినం చేసుకున్నారు. రాష్ట్ర సరిహద్దు జిల్లా కావడంతో గంజాయి తరలింపు సులభతరమని అనుకుని గంజాయి తరలింపు చేస్తున్న వారిపై నిఘా ఏర్పాటు చేసిన పోలీసులు చాకచక్యంగా వ్యవహరించి ఎప్పటికప్పుడు పట్టుకుంటున్నారు.

# జనగణన–2027 ఏర్పాట్లపై తహసీల్దార్ పరిశీలన

**వంగర, మల్లారం, గట్లనర్సింగాపూర్ గ్రామాల్లో హౌస్ లిస్టింగ్ పనుల తనిఖీ**

**భీమదేవరపల్లి మే 18 (నినాదం);**
హనుమకొండ జిల్లా భీమదేవరపల్లి మండలంలో జనగణన–2027 కార్యక్రమానికి సంబంధించిన ఏర్పాట్లను అధికారులు వేగవంతం చేస్తున్నారు. ఇందులో భాగంగా తహసీల్దార్ బి. రాజేష్ హౌస్ లిస్టింగ్ బ్లాక్స్ నమోదుపై వంగర, మల్లారం, గట్లనర్సింగాపూర్ గ్రామాలను సందర్శించి పరిశీలించారు. ఈ సందర్భంగా జనగణన నమోదు అధికారుల పనితీరును సమీక్షించిన తహసీల్దార్, నమోదు ప్రక్రియను ఖచ్చితత్వంతో పూర్తి చేయాలని సూచించారు. ప్రతి ఇంటి వివరాలను సమగ్రంగా నమోదు చేసి ప్రభుత్వ మార్గదర్శకాలకు అనుగుణంగా విధులు నిర్వహించాలని అధికారులకు తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల ప్రణాళిక గణాంక అధికారి (ఎంపీఎస్ఓ) ఎం. రాజ్‌కుమార్, మండల అదనపు గిర్దావర్ ఎన్. రాజు తదితరులు పాల్గొన్నారు.



# ఎలాంటి విపత్తులనైనా ఎదుర్కొనేందుకు సిద్ధం




**జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ**

**మహాదేవపూర్ మే 18, (నినాదం);**
భవిష్యత్తులో సంభవించే ఎలాంటి విపత్తులోనైనా సమర్థవంతంగా ఎదుర్కొనేందుకు జిల్లా యంత్రాంగా పూర్తి సంసిద్ధతతో ఉందని జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ వెల్లడించారు. సోమవారం జాతీయ విపత్తు నిర్వహణ సంస్థ ,రాష్ట్ర విపత్తు స్పందన దళం సూచనల మేరకు కాళేశ్వరం నది పరివాహక ప్రాంతంలో మాక్ డ్రిల్ నిర్వహించారు. భారీ వరదలు సంభవించిన సందర్భంలో, ప్రజలను ఎలా రక్షించాలి, అత్యవసర పరిస్థితుల్లో స్పందన బృందాలు ఎలా పనిచేయాలని అంశాలపై ప్రజలకు అవగాహన కల్పించారు . వరదల కారణంగా నింపుకు గురై చిక్కుకున్న ప్రజలను ఎస్డీఆర్ఎఫ్ బృందాలు, అగ్నిమాపక, పోలీసు శాఖలు సమన్వయంతో సురక్షితంగా రక్షించే చర్యలను ప్రదర్శించినట్లు ఆయన తెలిపారు. బోట్లు, లైఫ్ జాకెట్లు, ప్రథమ చికిత్స అందజేసే అంబులెన్స్ల ద్వారా సురక్షిత ప్రాంతాలకు తరలించే విధానాన్ని ప్రత్యక్షంగా చూపించారు. ఈ కార్యక్రమాన్ని కలెక్టర్ పరిశీలించి సహాయక చర్యల నిర్వహణ తీరును దగ్గరుండి పర్యవేక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విపత్తుల సమయంలో ప్రాణ, ఆస్తి నష్టం జరగకుండా ప్రజలను ఎలా రక్షించాలని నిర్వహించడం జరిగిందని ఆయన తెలిపారు. ప్రభుత్వ శాఖలు సంసిద్ధత సాధించడానికి మాకు డ్రిల్ ఎంతో కీలకమని ఆయన వివరించారు. జిల్లాలో వరదలు సంభవించే అవకాశం ఉన్న ప్రాంతాలను గుర్తించి అవగాహన కల్పిస్తున్నట్లు అత్యధిక వర్షపాతం నమోదయి అత్యవసర పరిస్థితులు ఏర్పడే అవకాశం ఉన్నందున కాళేశ్వరం లో మాక్రిల్ నిర్వహించినట్లు ఆయన తెలిపారు. అగ్నిమాపక, పోలీసు, రెవెన్యూ, వైద్య ఆరోగ్య, నీటిపారుదల తదితర శాఖలు సమన్వయంతో పనిచేసే ప్రజల ప్రాణాలను కాపాడేందుకు సిద్ధంగా ఉన్నాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ విజయ లక్ష్మి , ఆరోగ్యశాఖ జిల్లా వైద్యాధికారి డాక్టర్ మధుసూదన్, ఆర్డీవోలు హరికృష్ణ, రవీందర్ తో పాటు పలు శాఖల అధికారులు పాల్గొన్నారు.

# బీఆర్ఎస్ మైనారిటీ నేత జన్మదిన వేడుకల్లో మాజీ మంత్రి

**వనపర్తి ప్రతినిధి, మే 18 (నినాదం)**
బీఆర్ఎస్ మైనార్టీ నాయకులు, గ్రీన్ యాడ్స్ అధినేత మహ్మద్ యూసుఫ్ జన్మదిన వేడుకలు సోమవారం వనపర్తి జిల్లా కేంద్రంలోని మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి నివాసంలో ఘనంగా జరిగాయి. ఈ కార్యక్రమంలో మాజీ మంత్రి నిరంజన్ రెడ్డి పాల్గొని కేక్ కట్ చేసి యూసుఫ్ కు జన్మదిన శుభాకాంక్షలు తెలిపి ఆశీర్వదించారు. అనంతరం బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు మెట్టు శ్రీనివాస్, జిల్లా మీడియా కన్వీనర్నం దిమల్ల అశోక్, జోహెబ్ హుస్సేన్, సూర్యవంశం గిరి, నీలస్వామి, వెంకట్సా గర్, చంద్రశేఖర్, పోతులపల్లి రాజు, మంద రాము, అలీమ్ తదితరులు యూసుఫ్ కు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు





# ఓటర్ మ్యాపింగ్ వేగవంతం చేయండి: తహశీల్దార్

**అమనగల్లు, మే 18(నినాదం ) :**
అమనగల్లు మండలంలోని మేడిగడ్డ తండాలో తహశీల్దార్ ఫహీమ్ ఖాద్రి పర్యటించారు. ఓటర్ మ్యాపింగ్ ప్రక్రియను వేగవంతం చేయాలని ఆయన బీఎల్ఓలను ఆదేశించారు. సర్పంచ్, ఉపసర్పంచ్‌లు సమన్వయం చేసుకుంటూ ఈ పనులు పూర్తి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్ఐ సంపత్, ఉపసర్పంచ్ విజయ్ రాథోడ్, నాయకులు మల్లేష్, సరోజ తదితరులు పాల్గొని ఓటర్ల జాబితా సవరణపై చర్చించారు.

# మంత్రి దామోదర్ రాజనర్సింహ సంతాపం

**ఈతకు వెళ్లిన చిన్నారులు మృతి చెందటం బాధాకరం**
**ఈ ఘటన జరగటం దురదృష్టకరమన్నారు**
**చిన్నారుల తల్లిదండ్రులకు తన ప్రగాఢ సానుభూతిని తెలిపిన మంత్రి దామోదర్ రాజనర్సింహ**

**సంగారెడ్డి బ్యూరో, మే 18 ( నినాదం )**
ఆందోల్ నియోజకవర్గ పరిధిలోని రాయికోడ్ (మం) పిపడ్ పల్లి పరిధిలోని రామోజీపల్లిలో ఈతకు వెళ్లి ముగ్గురు చిన్నారులు దురదృష్టవశాత్తు వాగులో ఉన్న లోతైన నీటి గుంటలో పడి మృతిచెందిన విషాదం పై రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ దిగ్భ్రాంతి వ్యక్తంచేశారు. ఈ ఘటన జరగటం దురదృష్టకరమన్నారు. చిన్నారుల కుటుంబాలకు తన ప్రగాఢ సానుభూతి తెలిపారు. బాధిత కుటుంబాలకు తన ప్రగాఢ సానుభూతిని తెలిపారు మంత్రి దామోదర్ రాజనర్సింహ.



# మేడిగడ్డ బ్యారేజీలో కార్మికుడి గల్లంతు

**మహాదేవపూర్ మే 18, (నినాదం)**
జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహాదేవపూర్ మండలంలోని మేడిగడ్డ బ్యారేజీ లో పనిచేస్తున్న ఒక కార్మికుడు గల్లంతయినట్లు సమాచారం. బ్యారేజీ దిగువన గోదావరి నదిలో స్నానానికి వెళ్లిన ప్రమోద్ గుప్తా అనే కార్మికుడు సాయంత్రం లేబర్ క్యాంపు నుండి తన సహచరులతో కలిసి స్నానానికి వెళ్ళాగా ఈ దుర్ఘటన చోటు చేసుకున్నట్లు తెలిసింది. మధ్యప్రదేశ్ కు చెందిన యువకుడు ఎస్ అండ్ ఆర్ జియో టెక్నికల్ సంస్థలో పనిచేస్తున్నట్లు సమాచారం. అతని కోసం గాలింపు చర్యలు కొనసాగుతున్నాయి.

# ఆలస్యంగా వెలుగులోకి వచ్చిన లైంగిక దాడి

**వెల్దుర్తి, మే18 (నినాదం):**
యెల్దుర్తి మండలంలోని ఒక గ్రామానికి చెందిన బాధితురాలు మహిళ ఇచ్చిన ఫిర్యాదు మేరకు యెల్దుర్తి పోలీస్ స్టేషన్ పరిధిలో ఒక అనుమానాస్పద లైంగిక దాడి ప్రయత్న ఘటన వెలుగులోకి వచ్చింది. ఫిర్యాదు ప్రకారం, బాధితురాలు తన కుమారుడుతో కలిసి గ్రామానికి చెందిన రజక పోచయ్య ఇంట్లో నివసిస్తోంది. తేది 17.05.2026 న మధ్యాహ్నం సమయంలో రజక, పోచయ్య తన ఐదుగురు స్నేహితులతో కలిసి ఇంటికి వచ్చి కోడి మాంసం వండించుకొని, మద్యం సేవించినట్లు, తెలిపింది. అనంతరం తాను మత్తులో, స్పృహ కోల్పోయినట్లు, పేర్కొంది. సాయంత్రం సమయంలో తన కుమారుడు ఇంటికి వచ్చి నిద్ర లేపగా, తన దుస్తులు సరిగా లేకుండా ఉండటాన్ని గమనించినట్లు, తెలిపింది. తాను స్పృహలో లేని సమయంలో, రజక పోచయ్య మరియు అతని స్నేహితులు లేదా మరెవరైనా తనపై లైంగిక దాడి చేయడానికి ప్రయత్నించి ఉండవచ్చని బాధితురాలు, అనుమానం వ్యక్తం చేసింది. ఈ మేరకు ఫిర్యాదు స్వీకరించిన, పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు. ఘటనకు సంబంధించిన పూర్తి వివరాలు సేకరించ బడుతున్నాయి. వెల్దుర్తి ఎస్సై తెలిపారు.

# నినాదం

తెలంగాణ ప్రాంతీయం

నిఖార్సైన జర్నలిజం

మంగళవారం
19 మే 2026


# ఎస్‌బిఐ ఎదుట కొనసాగుతున్న ఉద్యోగుల నిరసన

## ఎంపి అర్వింద్ ను కలిసిన ఆల్ ఇండియా బ్యాంక్ ఎంప్లాయీస్ ఫోరం






**నిజామాబాద్ ప్రతినిధి, మే 18 (నినాదం)**

ఆల్ ఇండియా బ్యాంక్ ఎంప్లాయీస్ ఫోరం ఆధ్వర్యంలో బ్యాంక్ ఉద్యోగుల నిరసన కార్యక్రమాలు కొనసాగుతున్నాయి. సోమవారం ప్రగతి భవన్ ఎస్ బి ఐ ఎదుట మధ్యాహ్న భోజన విరామ సమయంలో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా నిజామాబాద్ పార్లమెంట్ సభ్యులు ధర్మపురి అరవింద్ ను బ్యాంకు ఉద్యోగ సంఘాల ప్రతినిధులు సోమవారం కలిశారు. జిల్లా కేంద్రంలో ఎంపీ క్యాంప్ కార్యాలయంలో ఎంపీ ని కలిసి, తమ సమస్యలు, డిమాండ్లపై మెమోరాండం అందజేశారు. బ్యాంకు ఉద్యోగులు ఉద్యోగ భద్రత, పెన్షన్ హక్కులు, బ్యాంకుల ప్రైవేటీకరణ, సిబ్బంది కొరత, పెరుగుతున్న పనిభారం వంటి అంశాలపై ఎంపీతో సుదీర్ఘంగా చర్చించారు. నూతన పెన్షన్ విధానం (ఎన్‌పీఎస్) ఉద్యోగుల భవిష్యత్తును అనిశ్చితిలోకి నెడుతోందని పేర్కొంటూ పాత పెన్షన్ విధానం (ఓపీఎస్)ను పునరుద్ధరించాలి అని కోరారు. అలాగే ప్రభుత్వ రంగ బ్యాంకుల ప్రైవేటీకరణ నిర్ణయాలు ఉపసంహరించుకుని ప్రజా రంగ బ్యాంకులను బలోపేతం చేయాలని విజ్ఞప్తి చేశారు. రిటైర్డ్ ఉద్యోగులకు మెరుగైన వైద్య సదుపాయాలు, ఆరోగ్య భద్రత పథకాలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో రమేష్, గురునాథ్, శ్రీనివాస్, సునంద, ప్రమోద్, సుధాకర్, సుప్రీం, సతీష్, నవీన్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రధాని పిలుపు పొదుపు మంత్రంతో ముందడుగు

## బస్సులో వెళ్ళి కలెక్టర్‌కు విజ్ఞప్తి పత్రం అందజేత

### ప్రభుత్వ పాఠశాల సమస్యలపై కందుల విజ్ఞప్తి

### ప్రజలతో మమేకమై ఇంధన పొదుపు సందేశం... దేశ దేశ అభివృద్ధికి అందరం సహకరిద్దాం





**గోదావరిఖని మే 18 (నినాదం):**

దేశ ప్రధాని మోడీ దేశానికి పెద్దన్నగా మారి మితవ్యయ సూచనలు చేస్తూ, ఇంధనాన్ని పొదుపుగా వాడాలని పౌరులను ప్రేరేపించారు. ఆయన సూచనలను ఒక దీక్షలాగా పాటించాలని రామగుండం బిజెపి నేత, తెలంగాణ రాష్ట్ర ఓబిసి మహిళా మోర్చా ఉపాధ్యక్షురాలు కందుల సంధ్యారాణి పిలుపునిచ్చారు. ఈ మేరకు సోమవారం బస్సులో ప్రయాణించి జిల్లా కలెక్టర్కు ప్రభుత్వ పాఠశాలల్లో ఉన్న సమస్యలపై విజ్ఞప్తి పత్రాన్ని అందజేసిన ఆమె, ప్రజలతో కలిసిపోతూ, మోడీ సూచనలను మనవాళ్లందరూ పాటించేలా కృషి చేయాలని సంకల్పించారు. దేశం అభివృద్ధి పథంలో ముందుకు సాగాలంటే ప్రతి పౌరుడు ఇంధనాన్ని పొదుపుగా వాడాలని, ఖర్చులను తగ్గించాలని ఆమె స్పష్టం చేశారు. మోడీ సూచనలు కేవలం మాటలు కాకుండా, జీవన విధానంలో మార్పు తీసుకురావాలని, ప్రతి కుటుంబం ఇంధన వినియోగాన్ని తగ్గించేందుకు ప్రయత్నించాలని ఆమె అన్నారు. గోదావరిఖని నుంచి పెద్దపల్లి వరకు బస్సులో ప్రయాణం చేస్తూ, ప్రజలతో మమేకమై, పాఠశాలల్లోని సమస్యలను కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లిన సంధ్యారాణి, ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తూనే, దేశ ప్రధాని సూచనలను పాటించడం ద్వారా సమాజానికి ఆదర్శంగా నిలవాలని పిలుపునిచ్చారు. ఆమె మాటల్లో మోడీ సూచనలు ఒక దీక్షగా మారి, ప్రతి పౌరుడు తన జీవితంలో పొదుపు ఆచరణలో పెట్టాలని, ఇంధన వినియోగాన్ని తగ్గించి దేశానికి తోడ్పడాలని స్పష్టం చేశారు. ఈ సందేశం ప్రజల్లో చైతన్యం కలిగించి, దేశ అభివృద్ధి పథంలో ఒక కొత్త దిశగా మారుతుందని ఆమె విశ్వాసం వ్యక్తం చేశారు. ఈ విధంగా, ప్రజా సమస్యలపై విజ్ఞప్తి పత్రం అందజేయడం, మితవ్యయ సూచనలను పాటించమని పిలుపునివ్వడం, ఇంధన పొదుపు దీక్షగా మారాలని ఆకాంక్షించడం ఒకే శక్తివంతమైన సందేశంగా నిలిచాయి. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు సులువ లక్ష్మీనారాయణ మరియు మండల అధ్యక్షులు మెరుగు నరేష్ గౌడ్, ఊరగొండ అపర్ణ , బోడకుంట సుభాష్, పాకాల నరసింహా రెడ్డి,కోడూరి రమేష్, ఏరుకొండ తిరుపతి,కామిరే లక్ష్మణ్, గన్న శ్రీనివాస్, కొట్టే నరేష్ తదితరులు పాల్గొన్నారు...



# మార్కెట్ అభివృద్ధికి తీర్మానాలు

**కాటారం, మే 18(నినాదం ):**

కాటారం వ్యవసాయ మార్కెట్ అభివృద్ధికి పాలక వర్గం పలు తీర్మానాలు చేసింది. ఈమేరకు సోమవారం ఏఎంసీ చైర్పర్సన్ పంతకాని తిరుమల అధ్యక్షతన జరిగిన సమావేశంలో వైస్ చైర్మన్, డైరెక్టర్లు పాల్గొని అభివృద్ధి, రైతుల మౌలిక సదుపాయాలపై చర్చించారు. ప్రహరీ నిర్మాణంకు రూ.కోటి మంజూరు చేసిన మంత్రి శ్రీధరాబాబుకు కృతజ్ఞతలు తెలుపుతూ తీర్మానం చేశారు. అనంతరం తాసీల్దార్ కార్యాలయంకు వెళ్లి 12.9 ఎకరాలు మార్కెట్ యార్డు స్థలంను సరిహద్దులు సర్వే చేసి చూపిస్తే ప్రహరీ నిర్మాణం చేపడుతామని తెలిపారు. కోల్ట్ స్టోరేజీ గోడౌన్ మార్కెట్ ప్రాంగణంలో సీసీ ప్లాట్ ఫామ్ నిర్మాణంతోపాటు ఇంకా పలు అభివృద్ధి పనులు చేపట్టాలని తీర్మానం చేసినట్లు తెలిపారు. వైస్ చైర్మన్ బ్రహ్మారెడ్డి, డైరెక్టర్లు తిరుపతి రావు, శ్రీనివాస్, రమేష్, రాజయ్య, రాజారాం, రామకృష్ణ, శ్రీనివాస్ రెడ్డి, ఇర్షాద్, సెక్రెటరీ షరీఫ్ తదితరులు పాల్గొన్నారు.

# నూతన తాసిల్దారుగా కమలాకర్

**కోదాడ,మే 18(నినాదం):**



.కోదాడలో నాయబ్ తాసిల్దారిగా విధులు నిర్వహించిన పోలే కమలాకర్ అనంతగిరి మండల తహశీల్దారుగా బదిలీపై వచ్చి సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. రెవెన్యూ సేవలను ప్రజలకు వేగవంతంగా, పారదర్శకంగా అందుబాటులోకి తీసుకువస్తామని తెలిపారు. కార్యాలయానికి వచ్చే అర్జీదారుల సమస్యలను ప్రాధాన్యతా క్రమంలో పరిష్కరిస్తామని పేర్కొన్నారు.

**ఎమ్మార్వో హిమబిందు కలెక్టరేట్‌కు బదిలీ**

అనంతగిరి మండల తహశీల్దార్ హిమబిందు జిల్లా కలెక్టరేట్‌కు బదిలీ అయ్యారు. పరిపాలనా కారణాల దృష్ట్యా ఆమెను బదిలీ చేస్తూ అధికార వర్గాలు నిర్ణయం తీసుకున్నాయి. బదిలీ ఉత్తర్వుల అనంతరం ఆమె త్వరలోనే కలెక్టరేట్‌లో కొత్త బాధ్యతలు స్వీకరించే అవకాశం ఉంది. హిమబిందు . ఆకస్మాత్తుగా ఈ బదిలీ స్థానిక రెవెన్యూ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది.

## మాజీ కౌన్సిలర్ అలేఖ్యను

# పరామర్శించిన మాజీ మంత్రి

**వనపర్తి ప్రతినిధి, మే18 (నినాదం)**



వనపర్తి పట్టణంలోని 33 వ వార్డుకు చెందిన మాజీ కౌన్సిలర్ అలేఖ్య తిరుమల్ అనారోగ్యంతో బాధపడుతున్నది.ఈ విషయం తెలుసుకున్న మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి, బిఆర్ఎస్ సభ్యత్వ నమోదు నియోజకవర్గ ఇన్చార్జ్ మెట్టు శ్రీనివాస్ సోమవారం వారి నివాసానికి వెళ్లి పరామర్శించారు.ఈ సందర్భంగా వారి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకుని మెరుగైన వైద్య చికిత్స తీసుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పారు. వారు త్వరగా కోలుకొని సంపూర్ణ ఆరోగ్యంతో ఉండాలని ఆకాంక్షించారు. మాజీ మంత్రి వెంట బీఆర్ఎస్ నాయకులు గట్టు యాదవ్, నందిమల్ల అశోక్, గంధం బాలపీరు, నీలస్వామి, వెంకట్ సాగర్, ప్రేమ్ నాథ్ రెడ్డి, ఇమ్రాన్, శేఖర్, చిట్యాల రాము, మంద రాము, హలీం, కుమార్, తోట శీను, సిరివాటి శంకర్, ముని కుమార్, కుటుంబ సభ్యులు తదితరులు పాల్గొన్నారు

# ముసుగు దొంగ అరెస్ట్

**నారాయణపేట ప్రతినిధి, మే 18 (నినాదం):**




వరుస దొంగతనాలు చేస్తూ, ప్రజలకు కంటిమీద కునుకు లేకుండా చేసిన ముసుగు దొంగను ఎట్టకేలకు పోలీసులు అరెస్ట్ చేశారు. ఇట్టి కేసుకు సంబంధించి పూర్వాపరాలను నారాయణపేట జిల్లా ఎస్పీ వినీత్ సోమవారం నాడు జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వివరిస్తూ...గత కొంత కాలంగా మక్తల్,మరికల్ ప్రాంతాల్లో వరుసగా చోరీలకు పాల్పడుచున్న మక్తల్ కు చెందిన కర్రెం సూర్యనారాయణ,(అలియాస్ తిమ్మప్ప, తిప్పి,సూర్య), ఇన్ని పేర్లతో చెలామణి అవుతున్న ముసుగు దొంగను మక్తల్ ఎస్సై వై. భాగ్యలక్ష్మి రెడ్డి ఆధ్వర్యంలో సోమవారం నాడు అరెస్ట్ చేసి జిల్లా పోలీసు కార్యాలయంలో ఎస్పీ ఆధ్వర్యంలో పత్రికా సమావేశం నిర్వహించి రిమాండ్ కు తరలించారు. ఇట్టి దొంగ 10 దొంగతనాలకు పాల్పడినట్లు వాటి విలువ 12 లక్షల 12 వేల రూపాయలుగా ఎస్పీ వివరించారు. ఇందులో నగదు 9 లక్షల 28 వేలు,బంగారం రెండు తులాలు, మూడు కిలోల వెండి, రెండు విలువైన మద్యం సీసాలు వాటి విలువ 7200, సిగరెట్లు 35వేల విలువైనవి చోరీకి గురైన వాటిల్లో ఉన్నట్లు తెలిపారు. దొంగను అరెస్టు చేసిన అనంతరం రికవరీ అయిన వస్తువుల్లో ఐదు లక్షల నాలుగు వేల నగదు, 13 గ్రాముల బంగారం, 60 తులాల వెండి, మూడు మొబైల్ ఫోన్లు, 35 వేలు సిగరెట్లకు సంబంధించిన నగదు, ఇలా మొత్తం 9,19,500 రికవరీ చేసినట్లు తెలిపారు. కేసును చేదించిన పోలీసు అధికారులకు ప్రశంసా పత్రాలు రివార్డులు జిల్లా ఎస్పీ డాక్టర్ వినీత్ అందించారు. ఇట్టి కార్యక్రమంలో డిఎస్పి మహేష్, మక్తల్ సీఐ కె. రామ్లాల్, ఎస్సైలు భాగ్యలక్ష్మి రెడ్డి, పురుషోత్తం, విజయభాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

# జిల్లా ప్రభుత్వ ఆసుపత్రిలో వరదల్లో వైద్య సేవలపై మాక్ డ్రిల్



**నిజామాబాద్ ప్రతినిధి, మే 18 (నినాదం) :**



నిజామాబాద్ ప్రభుత్వ జనరల్ హాస్పిటల్ వర్షాకాలంలో వచ్చే వరదల వల్ల ఏర్పడే అత్యవసర పరిస్థితులు సమర్థవంతంగా ఎదుర్కొనే వైద్య సేవలు అందించడం కోసం ఫ్లడ్ మాక్ డ్రిల్ నిర్వహించారు. ఐసీఎస్ ఇన్‌చార్జ్, ఆర్‌డీఓ నిజామాబాద్ కె. రాజేంద్ర కుమార్ ఆధ్వర్యంలో సోమవారం ఉదయం జీజీహెచ్ లో బ్లడ్ మాక్ డ్రిల్ నిర్వహించారు. రాష్ట్ర విపత్తు నిర్వహణ కమిటీ పిలుపు మేరకు, జాతీయ విపత్తు నిర్వహణ కమిటీ సహకారంతో ఈ మాక్ డ్రిల్ చేపట్టారు.. కార్యక్రమంలో ఎస్ డీఆర్ ఎఫ్, ఫైర్ సేఫ్టీ, విద్యుత్ శాఖ, ఎన్ సి సి, ఆపద మిత్ర, పోలీస్, రెవెన్యూ, ఇరిగేషన్, ఆర్ అండ్ బి, వైద్య ఆరోగ్య శాఖ అధికారులు,108 అంబులెన్స్ సిబ్బంది పాల్గొన్నారు. ఆసుపత్రిలో వరదల కారణంగా తలెత్తే అత్యవసర పరిస్థితులను ఎదుర్కోవడం, రోగుల సురక్షిత తరలింపు, అత్యవసర సేవల సమన్వయ, విభాగాల మధ్య సమర్థవంతమైన కమ్యూనికేషన్, విపత్తు నిర్వహణ విధానాలపై ప్రాక్టికల్ శిక్షణ ఈ మాక్ డ్రిల్‌లో నిర్వహించబడింది. ఈ కార్యక్రమానికి ప్రభుత్వ జనరల్ హాస్పిటల్ సూపరింటెండెంట్ డా. నాగ మోహన్ పర్యవేక్షణలో డా. రాజశేఖర్, డా. సరస్వతి, నర్సింగ్ సూపరింటెండెంట్ లలిత, ఆసుపత్రి సిబ్బంది, 108 బృందం సమన్వయంతో విజయవంతంగా నిర్వహించారు. ఈ మాక్ డ్రిల్ ద్వారా అన్ని శాఖల మధ్య సమన్వయం మరింత బలోపేతం కావడంతో పాటు, వరద అత్యవసర పరిస్థితులు సమర్థవంతంగా ఎదుర్కొనేందుకు ఆసుపత్రి సిబ్బంది తమ సిద్ధతను ప్రదర్శించారు.




# పాలమూరు ప్రాజెక్ట్‌పై పాదయాత్రలు కాదు సమాధానాలు చెప్పాలి

**నారాయణపేట ప్రతినిధి, మే 18, (నినాదం):**

పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్ట్ పూర్తి చేయాలని డిమాండ్ చేస్తూ మాజీ మంత్రులు శ్రీనివాస్ గౌడ్, నిరంజన్ రెడ్డి లక్ష్మారెడ్డి గార్లుపాదయాత్ర చేపట్టి ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకొస్తామని ప్రకటించడం హాస్యాస్పదంగా ఉందని టీఆర్ఎస్ నేతలు కృష్ణ ముదిరాజ్. మెట్టుకాడి ప్రభాకర్ ముదిరాజ్, గొంగళ్ళ రంజిత్, గవినోళ్ల శ్రీనివాస్ విమర్శించారు. సోమవారం హైదరాబాద్‌లోని టీఆర్ఎస్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు.మహబూబ్‌నగర్ జిల్లా అత్యధిక వలసలు వెళ్లిన జిల్లాగా పేరొందిందని, సాగునీరు అందిస్తే వలసలు తగ్గుతాయనే ఉద్దేశంతో పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల పథకాన్ని ప్రారంభించి 80 శాతం పనులు పూర్తి చేశామని మాజీ మంత్రులు చెబుతున్నారని, అయితే మిగిలిన 20 శాతం పనులు ఎందుకు పూర్తి చేయలేదో ప్రజలకు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. ఆ పనులు పూర్తయి ఉంటే ఇప్పటికే రైతులకు 12 లక్షల ఎకరాలకు సాగునీరు అందేదని పేర్కొన్నారు.పాలమూరు ప్రాజెక్ట్ పూర్తి చేయాలని డిమాండ్ చేస్తూ నర్లాపూర్ నుంచి ఉదండాపూర్ వరకు పాదయాత్ర చేపడతామని ప్రకటించే ముందు, బీఆర్ఎస్ ప్రభుత్వం అధికారంలో ఉన్న సమయంలో ప్రాజెక్టును ఎందుకు పూర్తి చేయలేకపోయిందో చెప్పాలని ప్రశ్నించారు. జిల్లా అభివృద్ధి కోసం ప్రజలు 13 మంది ఎమ్మెల్యేలను గెలిపిస్తే, పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టు పనుల్లో అవినీతి, ప్యాకేజీల రాజకీయాలు చేసి ప్రజలను మోసం చేశారని ఆరోపించారు. అందుకే ప్రజలు ఎన్నికల్లో తగిన గుణపాఠం చెప్పారని వ్యాఖ్యానించారు.పాలమూరు ప్రాజెక్ట్ ద్వారా ఉమ్మడి జిల్లాలో సుమారు 12 లక్షల ఎకరాలకు సాగునీరు అందించే అవకాశం ఉన్నప్పటికీ, పనుల్లో నాణ్యత కంటే ప్యాకేజీలకే ప్రాధాన్యత ఇచ్చారని విమర్శించారు. మట్టి తవ్వకాలు, తరలింపుల పేరుతో అవినీతి జరిగిందని ఆరోపించారు.ప్రాజెక్టును ప్రభుత్వం ప్రత్యేక దృష్టితో పరిశీలించి పెండింగ్ పనులు త్వరగా పూర్తి చేయాలని డిమాండ్ చేశారు. కాళేశ్వరం అంశంపై తప్పుడు ప్రచారం జరుగుతోందని ఆరోపిస్తూ, అధికారంలోకి వచ్చిన వెంటనే పాలమూరు ప్రాజెక్ట్ పూర్తి చేసి ఉంటే రైతులకు ప్రయోజనం కలిగేదన్నారు. వట్టెం నుంచి డిండి వరకు నీళ్లు తరలించే ప్రణాళిక కూడా ఉందన్నారు ప్రభుత్వంలో ఉన్నప్పుడు చేసిన తప్పులను కప్పుపుచ్చుకునేందుకే ఇప్పుడు ప్రయత్నాలు మొదలు పెట్టారని ఆగ్రహం వ్యక్తం చేశారు మాజీ మంత్రులకు ప్రాజెక్టులపై పూర్తి అవగాహన లేదని సంపద పోగు చేసుకునేందుకు అవగాహన మాత్రం అద్భుతంగా ఉందని ఎద్దేవ చేశారు, గత ప్రభుత్వాలను తప్పుబడుతున్న నాయకులు తామే అప్పట్లో మంత్రులుగా ఉన్న విషయాన్ని మరిచిపోతున్నారని అన్నారు. పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టు సాధన సభలో కల్వకుంట్ల కవిత ఇచ్చిన అల్టిమేటం తర్వాతే మాజీ మంత్రులు, ఎమ్మెల్యేలు అకస్మాత్తుగా మేల్కొని పాదయాత్రలు ప్రకటించడం రాజకీయ నాటకంగా కనిపిస్తోందని విమర్శించారు. ఈ విలేకరుల సమావేశంలో డాక్టర్ వెంకట రామమూర్తి ప్రభాకర్ దామోదర్ సురేష్ శ్యాం ప్రసాద్ మనోహర్గౌడ్ సౌమ్య రెడ్డి శ్రావణి ఎల్ల స్వామి శ్రీపతిరావు యువత అధ్యక్షుడు మనోజ్ కుమార్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు

# రిటైర్డ్ ఉద్యోగుల సంఘం అధ్యక్షునిగా ఎస్ శ్రీధర్

**నాగర్ కర్నూల్ మే 18 (నినాదం)**



నాగర్ కర్నూల్ జిల్లా కేంద్రంలోని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ రిటైర్ ఉద్యోగుల సంఘం సర్వేపల్లి రాధాకృష్ణ భవన్లో జిల్లా కౌన్సిల్ సమావేశం సోమవారం నిర్వహించారు. దివంగత అధ్యక్షులు రామచంద్ర రెడ్డి కి నివాళులర్పించి గత ఆరు నెలలుగా సంస్థ గత విషయాలను జిల్లా అనుబంధ కార్యక్రమాలను సమీక్షించారు. ఖాళీ అయిన అధ్యక్ష పదవితో పాటు మిగతా ఖాళీలను పూర్తి చేయుటకు ఎంపిక ప్రక్రియను చేపట్టారు జిల్లా నూతన కార్యవర్గంలో అధ్యక్షునిగా ఎస్ శ్రీధర్ ప్రధాన కార్యదర్శిగా వెంకటశెట్టి కోశాధికారిగా శ్రీనివాసులు ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు ఈ సందర్భంగా నూతన అధ్యక్షుడు ఎస్ శ్రీధర్ మాట్లాడుతూ. విశ్రాంత ఉద్యోగస్తుల సంఘం నిరంతరం వేలాది మంది విశ్రాంత ఉద్యోగులకు తమ సేవలు అందిస్తుందని ఇకముందు కూడా ఇదే విధంగా సంఘం ద్వారా సేవలందితాయని తమను అధ్యక్షనిగా ఎంపిక చేసినందుకు ఈ సందర్భంగా ధన్యవాదాలు తెలిపారు ఎన్నిక ప్రక్రియలో కొల్లాపూర్ అధ్యక్ష కార్యదర్శులు పాపాలరావు నీలం రెడ్డి నాగర్ కర్నూల్ మండల శాఖ అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు సుధాకర్ రెడ్డి యుగంధర్ రెడ్డి అచ్చంపేట ప్రధాన కార్యదర్శి అశోక్ కుమార్ కల్వకుర్తి మండల శాఖ ప్రధాన కార్యదర్శి కృష్ణయ్య అసోసియేట్ అధ్యక్షులు అబ్దుల్ కరీం బిజినపల్లి అధ్యక్షులు మల్లయ్య గౌడ్ బాలయ్య కృష్ణ గౌడ్ సురేందర్ జిల్లా కార్యవర్గ సభ్యులు విశ్రాంత ఉద్యోగస్తులు పాల్గొన్నారు.

# అక్రమంగా చెరువు మట్టి తరలింపు.. రెండు ట్రాక్టర్లు సీజ్

**దుబ్బాక మే 18 (నినాదం)**

దుబ్బాక మండలం పెద్దగుండవెల్లి గ్రామంలో చెరువులోని మట్టిని ఎలాంటి అనుమతులు లేకుండా అక్రమంగా ఇటుక బట్టీలకు తరలిస్తున్న రెండు ట్రాక్టర్లను పోలీసులు పట్టుకుని సీజ్ చేసిన ఘటన సోమవారం చోటుచేసుకుంది. దుబ్బాక ఎస్సై కీర్తి రాజు తెలిపిన వివరాల ప్రకారం.. పెద్దగుండవెల్లి గ్రామ శివారులోని పెద్ద చెరువులో నుంచి ఉదయం సమయంలో రెండు ట్రాక్టర్లు ట్రాలీలలో చెరువు మట్టిని నింపుకుని తరలిస్తుండగా పోలీసులకు సమాచారం అందింది. వెంటనే అక్కడికి చేరుకున్న దుబ్బాక పోలీసులు ట్రాక్టర్లను అడ్డుకుని తనిఖీ నిర్వహించారు. పోలీసులు గట్టిగా విచారించగా, నిజామాబాద్‌కు చెందిన శ్రీనివాస్ అనే వ్యక్తి నిర్వహిస్తున్న సమీపంలోని ఇటుక బట్టీలకు చెరువు మట్టిని తరలిస్తున్నట్లు డ్రైవర్లు వెల్లడించారు. దీంతో అక్రమంగా చెరువు మట్టిని తరలిస్తున్న రెండు ట్రాక్టర్లు, ట్రాలీలను పోలీసులు స్వాధీనం చేసుకుని దుబ్బాక పోలీస్ స్టేషన్‌కు తరలించారు. హెడ్ కానిస్టేబుల్ హరి సింగ్ ఇచ్చిన



ఫిర్యాదు మేరకు పెద్దగుండవెల్లి గ్రామానికి చెందిన ట్రాక్టర్ డ్రైవర్లు దండు లక్ష్మణ్, దండు వినిల్‌లపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై కీర్తి రాజు తెలిపారు.

# పెట్రోల్, డీజిల్ ధరలను తగ్గించాలని సిపిఎం ఆధ్వర్యంలో నిరసన




**కల్వకుర్తి మే 18 (నినాదం)**

కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం పెంచిన పెట్రోల్, డీజిల్, సిఎన్జి ధరలను వెంటనే తగ్గించాలని సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు బి. ఆంజనేయులు కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం కల్వకుర్తి పట్టణంలోని ఆర్టీసీ బస్టాండ్ చౌరస్తా వద్ద సిపిఎం పార్టీ ఆధ్వర్యంలో నిర్వహించిన నిరసన కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు.

ఈ సందర్భంగా ఆంజనేయులు మాట్లాడుతూ ఐదు రాష్ట్రాల ఎన్నికల అనంతరం కేంద్ర ప్రభుత్వం పెట్రోల్, డీజిల్, గ్యాస్ ధరలను పెంచి సామాన్య ప్రజలపై భారాన్ని మోపిందని విమర్శించారు. ఒకవైపు ప్రజలు పొదుపు చర్యలు పాటించాలని సూచిస్తూనే ప్రధానమంత్రి నరేంద్ర మోదీ విదేశీ పర్యటనలపై కోట్ల రూపాయలు ఖర్చు చేస్తున్నారని ఆయన ఆరోపించారు. కార్పొరేట్ సంస్థలు, పెద్ద పెట్టుబడిదారులకు అనుకూలంగా కేంద్ర ప్రభుత్వం విధానాలు అమలు చేస్తూ దేశ ప్రజలను అప్పుల్లోకి నెట్టుతోందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. రైతులు, కార్మికులు, కూలీలు, ఉద్యోగులకు వ్యతిరేకంగా చట్టాలు తీసుకొస్తూ యజమానులకు అనుకూల విధానాలు అమలు చేస్తున్నారని విమర్శించారు.పెట్రోల్, డీజిల్ ధరల పెరుగుదల కారణంగా నిత్యావసర వస్తువుల ధరలు ఆకాశాన్నంటుతున్నాయని పేర్కొన్నారు. ఇప్పటికైనా కేంద్ర ప్రభుత్వం ప్రజావ్యతిరేక విధానాలను విరమించి పెంచిన ఇంధన ధరలను తగ్గించకపోతే ప్రజలను సమీకరించి పెద్ద ఎత్తున ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు ఏపీ మల్లయ్య, పరశురాములు, ఎంప్లాయిస్ పత్రిక ఎడిటర్ వెంకటేశ్వర్లు, సిపిఎం నాయకులు శివరాములు, చెన్నయ్య, భవన నిర్మాణ కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు శ్రీనివాసులు, సివిల్ సప్లై గోదాం అమాలి సంఘం రాష్ట్ర అధ్యక్షులు బాలయ్య, యాదయ్య, నరేష్, కృష్ణ తదితరులు పాల్గొన్నారు

నినాదం
తెలంగాణ ప్రాంతీయం
నిఖార్సైన జర్నలిజం
మంగళవారం 19 మే 2026

## ప్రకృతి వ్యవసాయంతోనే భవిష్యత్‌కు భరోసా

-వ్యవసాయ అధికారి ప్రేమలత



**కొమురం భీం ఆసిఫాబాద్ (ప్రతినిధి, మే 18(నినాదం):** ప్రకృతి వ్యవసాయం ద్వారా తక్కువ పెట్టుబడితో అధిక ప్రయోజనాలు పొందవచ్చని కౌటాల మండల వ్యవసాయ అధికారి ప్రేమలత రైతులకు సూచించారు. సోమవారం కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లా కౌటాల మండలం నాగేపల్లి గ్రామంలో సర్పంచ్ కపుడే వికాస్ అధ్యక్షతన రైతులకు ప్రకృతి వ్యవసాయం (నాచురల్ ఫార్మింగ్) పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మండల వ్యవసాయ అధికారి ప్రేమలత మాట్లాడుతూ, సహజ సిద్ధంగా ప్రకృతి ద్వారా లభించే వనరులను ఉపయోగించి వ్యవసాయం చేయడం వల్ల నేల ఆరోగ్యం మెరుగుపడుతుందని తెలిపారు. భవిష్యత్ తరాలకు సారవంతమైన సాగు భూములను అందించాలంటే రైతులు ప్రకృతి వ్యవసాయం దిశగా అడుగులు వేయాలని సూచించారు. ఆహార ధాన్య పంటలు, కూరగాయల సాగులో ప్రకృతి వ్యవసాయ పద్ధతులను సులభంగా అమలు చేయవచ్చని పేర్కొన్నారు. ఈ విధానం ద్వారా వ్యవసాయ పెట్టుబడులు తగ్గడంతో పాటు నేల సారం పెరుగుతుందని, పర్యావరణ కాలుష్యం తగ్గుతుందని తెలిపారు. రసాయన అవశేషాలు లేని ఆరోగ్యకరమైన ఆహారం ప్రజలకు అందుతుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారులు కార్తీక్, వ్యవసాయ విస్తరణ అధికారి సిహెచ్ అంజన్న, గ్రామ రైతులు పాల్గొన్నారు.

## సింగరేణి సంస్థ అభివృద్ధికి సమిష్టి కృషి అవసరం

-జీఎం శ్రీనివాస్



**మంచిర్యాల, మే 18(నినాదం):** సింగరేణి సంస్థ అభివృద్ధికి అధికారులు కార్మికులు సమిష్టిగా కృషి చేయాలని శ్రీరాంపూర్ ఏరియా జీఎం శ్రీనివాస్ పేర్కొన్నారు. ఆర్కే 7 గనిలో మల్టీ డిపార్ట్మెంటల్ సమావేశంలో ఉద్యోగులకు అవగాహన కల్పించారు.క్షేత్రస్థాయిలో ఉద్యోగులకు అవగాహన కల్పిస్తూ సంస్థ అభ్యున్నతే లక్ష్యంగా ఉద్యోగులు విధులు నిర్వహించాలని పేర్కొన్నారు. రక్షణతో కూడిన బొగ్గు ఉత్పత్తికి ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు. ఈ ఆర్థిక సంవత్సరం నిర్దేశించిన బొగ్గు ఉత్పత్తి లక్ష్యాన్ని అధిగమించడానికి ప్రతి ఒక్కరు కృషి చేయాలని పేర్కొన్నారు.

## పోలీసులపై ప్రజల్లో నమ్మకం పెంచాలి

సీపీ అంబర్ కిషోర్ ఝా



**మంచిర్యాల, మే 18(నినాదం):** బాధితులు ఇచ్చే ఫిర్యాదులపై తక్షణమే స్పందించి,సత్వర న్యాయం జరుగుతుందనే నమ్మకం కల్పించాలని రామగుండం పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా పేర్కొన్నారు.సోమవారం రామగుండం పోలీస్ కమిషనరేట్ మంచిర్యాల జోన్ పరిధిలోని బెల్లంపల్లి వన్ టౌన్ పోలీస్ స్టేషన్‌ను సందర్శించారు. పోలీస్ స్టేషన్‌కు చేరుకున్న సీపీ గారికి అధికారులు మొక్కలు అందజేసి స్వాగతం పలికారు.అనంతరం ఆర్మ్డ్ రిజర్వ్ సిబ్బంది నుండి పోలీస్ గౌరవ వందనం స్వీకరించారు.తదుపరి స్టేషన్ పరిసరాలను పరిశీలించి,స్టేషన్ రిసెప్షన్, సీసీటీఎన్ఎస్ సిబ్బంది మరియు ఇతర పోలీస్ సిబ్బంది పనితీరును అడిగి తెలుసుకున్నారు. అలాగే స్టేషన్ నిర్వహణకు సంబంధించిన రికార్డులు, రౌడీషీటర్లు, అనుమానితుల వివరాలు మరియు ప్రస్తుతం పెండింగ్‌లో ఉన్న కేసుల రికార్డులను పరిశీలించారు.ఈ సందర్భంగా పోలీస్ స్టేషన్ సిబ్బంది సమస్యలను కూడా సీపీ అడిగి తెలుసుకున్నారు.ఈ సందర్భంగా సీపీ మాట్లాడుతూ,పోలీస్ స్టేషన్ పరిధిలో పెట్రోలింగ్,వాహనాల తనిఖీలు నిర్వహిస్తూ విజిబుల్ పోలీసింగ్ చేపట్టాలని సూచించారు.ప్రతి కానిస్టేబుల్‌కు కేటాయించిన కాలనీలు,గ్రామాలను సందర్శించి ప్రజలు, యువతతో మాట్లాడి శాంతిభద్రతలకు సంబంధించిన సమస్యలను తెలుసుకోవాలని తెలిపారు.ప్రతి ఒక్కరు సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకునేలా అవగాహన కల్పించాలని,సైబర్ నేరాల పట్ల ప్రజలను అప్రమత్తం చేయాలని సూచించారు.ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన పెంచి ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా ట్రాఫిక్ రూల్స్ పాటించేలా చూడాలని తెలిపారు. రోడ్డు ప్రమాదాల నివారణకు ముందస్తు చర్యలు తీసుకోవాలని, చట్టవ్యతిరేక కార్యకలాపాలపై నిరంతరం నిఘా ఉంచాలని ఆదేశించారు.కళాశాలలు,పాఠశాలల పరిసరాల్లో పొగాకు ఉత్పత్తుల విక్రయాలకు పాల్పడే వారిపై కఠినంగా వ్యవహరించాలని సీపీ అధికారులు, సిబ్బందికి సూచించారు.ఈ తనిఖీల్లో మంచిర్యాల డీసీపీ ఎ. భాస్కర్,బెల్లంపల్లి ఏసీపీ కిరణ్ కుమార్, బెల్లంపల్లి ఇన్స్పెక్టర్ శ్రీనివాస్ రావు తదితరులు పాల్గొన్నారు.

### ఫిట్ అండ్ యాక్టివ్

## తెలంగాణ మారతాన్‌కు భారీ స్పందన

### ప్రతి ఒక్కరూ శారీరకంగా ఫిట్‌గా ఉండాలి

### కలెక్టర్ భవేశ్ మిశ్రా

### ఉత్సాహంగా సాగిన మారథాన్..ఆకట్టుకున్న యోగా



**నిర్మల్ ప్రతినిధి, మే 18 (నినాదం):** "ప్రజాపాలన - ప్రగతి ప్రణాళిక" యువజన, క్రీడా వారోత్సవాల్లో భాగంగా సోమవారం ఉదయం నిర్వహించిన "ఫిట్ అండ్ ఆక్టివ్ తెలంగాణ, మారథాన్ అండ్ ఫిజికల్ లిటరసీ" కార్యక్రమాన్ని కలెక్టర్ జెండా ఊపి ప్రారంభించారు. పట్టణంలోని శివాజీ చౌక్ (మంచిర్యాల చౌరస్తా) నుంచి ప్రారంభమైన మారథాన్ ఎన్టీఆర్ మినీ స్టేడియం వరకు ఉత్సాహభరిత వాతావరణంలో కొనసాగింది. యువత, విద్యార్థులు, ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.అనంతరం ఎన్టీఆర్ మినీ స్టేడియంలో నిర్వహించిన సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ, యోగా, శారీరక వ్యాయామం ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తాయని పేర్కొన్నారు. నిరంతర శారీరక శ్రమ వల్ల అనేక దీర్ఘకాలిక వ్యాధులను దూరం చేసుకోవచ్చని, భవిష్యత్తులో అనారోగ్య సమస్యలు రాకుండా ఉండేందుకు ప్రతిరోజూ వ్యాయామం చేయాలని సూచించారు. యోగా, ఎక్సర్‌సైజ్‌ల ద్వారా శారీరక దృఢత్వంతో పాటు మానసిక ప్రశాంతత కూడా లభిస్తుందని తెలిపారు.ఈ సందర్భంగా విద్యార్థులు ప్రదర్శించిన యోగాసనాలు ప్రేక్షకులను విశేషంగా ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు వెంకటేశ్వర్లు, కిషోర్ కుమార్, మున్సిపల్ వైస్ చైర్మన్ అప్పాల గణేష్ చక్రవర్తి, డివైఎస్ఓ శ్రీకాంత్ రెడ్డి, డిఈఓ భోజన్న, సిపిఓ జీవరత్నం, మునిసిపల్ కమిషనర్ రవి బాబు, అధికారులు, ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

# అర్జీలను వేగంగా పరిష్కరించాలి : కలెక్టర్



**మంచిర్యాల, మే 18, (నినాదం):** ప్రజావాణి కార్యక్రమంలో అందిన దరఖాస్తుల పరిష్కారంపై అధికారులు సమన్వయంతో కృషి చేయాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. సోమవారం జిల్లాలోని నస్పూర్ లో గల సమీకృత జిల్లా కార్యాలయాల భవన సమావేశ మందిరంలో జిల్లా అదనపు కలెక్టర్లు పి. చంద్రయ్య, వి. రాములు లతో కలిసి అర్జీదారుల నుండి దరఖాస్తులు స్వీకరించారు. మంచిర్యాల పట్టణం జాఫర్ నగర్ ప్రాంతానికి చెందిన పర్వీన్ సుల్తానా, ఫర్జానా నిరుపేద అయిన తమకు రెండు పడక గదుల ఇల్లు మంజూరు చేయాలని కోరుతూ వేరువేరుగా అర్జీలు సమర్పించారు. మంచిర్యాల పట్టణానికి చెందిన కమ్మరి రాజేశ్వరి నిరుపేద అయిన తనకు ఒంటరి మహిళ పింఛన్ ఇప్పించాలని కోరుతూ దరఖాస్తు అందజేశారు. మంచిర్యాల పట్టణం ఎన్ టి ఆర్ నగర్ కు చెందిన ముజ్జిగ స్వప్న కూలి పని చేసుకుంటూ జీవిస్తున్న నిరుపేద అయిన తనకు ఇందిరమ్మ ఇల్లు ఇప్పించాలని కోరుతూ దరఖాస్తు అందజేశారు. బెల్లంపల్లి మండలం చాకేపల్లి గ్రామస్తులు తమ గ్రామంలో ఎస్ సి నేతకాని గూడెంలో మంజూరు అయిన బోర్ వెల్ ఏర్పాటు చేయాలని కోరుతూ అర్జీ సమర్పించారు. జన్నారం మండలం వినాయక నగర్ కాలనీవాసులు తమ కాలనీలో ఇండ్ల మధ్యలో నిర్వహిస్తున్న బీడీ ఫ్యాక్టరీని తొలగించాలని కోరుతూ అర్జీ సమర్పించారు. దండేపల్లి మండలం మాకులపేట గ్రామానికి చెందిన ముత్తినేని రాజమణి తన పొలంలో సాగు చసిన మొక్కజొన్న పంట చేతికి వచ్చే సమయంలో అడవి పందులు పూర్తిగా నాశనం చేశాయని, నష్టపరిహారం ఇప్పించాలని కోరుతూ దరఖాస్తు అందజేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజావాణి కార్యక్రమంలో 64 దరఖాస్తులు అందాయని, ప్రతి దరఖాస్తులు క్షేత్రస్థాయిలో పరిశీలించి పరిష్కరించే విధంగా అధికారుల సమన్వయంతో చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు.

**20న మెడికల్ షాపులు బందుకు సహకరించాలి జిల్లా కెమిస్ట్ అండ్ డ్రగ్గిస్ట్ నాయకులు..**

ఈ నెల 20న దేశవ్యాప్తంగా మెడికల్ షాపుల బంద్ నిర్వహిస్తున్నామని బందుకు సహకరించాలి జిల్లా కెమిస్ట్, డ్రగ్గిస్ట్ అసోసియేషన్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శ, కోశాధికారి మోటూరి చంద్రశేఖర్రావు, తొగరు సుధాకర్, రాజేంద్రప్రసాద్ జిల్లా కలెక్టర్ కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆన్లైన్లో మందుల విక్రయా లు ఆపాలని, కార్పొరేట్ సంస్థలకు భారీ డిస్కౌంట్లు రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఆన్లైన్ ఫార్మసీ వల్ల మందుల అమ్మకాలపై నియంత్రణ ఉండదని, నకిలీ, మత్తు కలిగించే మందులు ప్రిస్క్రిప్షన్ లేకుండా విచ్చలవిడిగా దొరికే అవకాశం ఉంటుందని తెలిపారు. జిల్లా లోనూ మెడికల్ షాపులను ఒకరోజు బంద్ చేయనున్నట్లు తెలిపారు.

# ఈ ఫార్మసీ విధానాన్ని రద్దు చేయాలి



**మంచిర్యాల, మే 18(నినాదం):** ఈ నెల 20న దేశ వ్యాప్తంగా మెడికల్ షాపులు బందు చేపడుతున్నామని జిల్లా కెమిస్ట్ అండ్ డ్రగ్గిస్ట్ అసోసియేషన్ అధ్యక్షుడు, కార్యదర్శి, కోశాధికారులు చంద్రశేఖర్ , సుధాకర్, రాజేంద్రప్రసాద్ లు పేర్కొన్నారు. బందు కు సహకరించాలని కోరుతూ సోమవారం జిల్లా డ్రగ్ ఇన్స్పెక్టర్ చందనకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ ఫార్మ సీలు, ఆన్ లైన్ మందుల విక్రయాలకు నిరసనగా ఈనెల 20న దేశవ్యాప్తంగా మెడికల్ షాపుల బంద్ కు ఆలిండియా ఆర్గనైజేషన్ ఆఫ్ కెమిస్ట్స్ అండ్ డ్ర గ్గిస్ట్స్ (ఏఐఓసీడీ) పిలుపునిచ్చిందని బంద్ కు తెలంగాణ కెమిస్ట్స్ అండ్ డ్రగ్గిస్ట్స్ అసోసియేషన్ సంపూర్ణ మద్దతు తెలుపుతుందని పేర్కొన్నారు. ఆన్ లైన్ ద్వారా ఎలాంటి భౌతిక తనిఖీలు లేకుండా మందులు విక్రయించడం వల్ల ప్రజా రోగ్యానికి తీవ్ర ముప్పు వాటిల్లుతోందని ఆందోళన వ్యక్తం చేసింది. ఒకే ప్రిస్క్రిప్షన్ ను పలుమార్లు ఉపయోగించి మందులు పొందే అవకాశం ఉండటంతో సమస్యలు తలెత్తుతాయని పేర్కొన్నారు. ఆన్లైన్లో నియంత్రణ లేకుండా మందులు కొనుగోలు చేయడం ద్వారా ప్రజలు, యువత తీవ్ర అనారోగ్య సమస్యలు ఎదుర్కొంటారని పేర్కొన్నారు. దీనివల్ల మత్తు పదార్థాల వినియోగం పెరుగుతుందని కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.కార్పొరేట్ సంస్థలు భారీ డిస్కౌంట్లతో మందులను విక్రయిస్తూ మార్కెట్ సమతుల్యతను దెబ్బతీస్తున్నా యని మండిపడ్డారు. మన దేశంలో దీనివల్ల గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో దశాబ్దాలుగా సేవలు అందిస్తున్న చిన్న మెడికల్ షాపుల మనుగడ ప్ర శ్నార్థకంగా మారుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. కోవిడ్ సమయంలో అత్యవసర పరిస్థితుల కోసం జారీ చేసిన జీవో 220(ఈ)ని ప్రభుత్వం వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఆన్లైన్ మందుల విక్రయాలపై సరైన నియంత్రణ అమలు చేసి ఫార్మసీ వ్యవస్థను రక్షించడమే కాకుండా ప్రజల ఆరోగ్యాన్ని కాపాడాలని సూచించారు. ఒక రోజు మెడికల్ షాప్ బందుకు ప్రజలు సహకరించాలని కోరారు. మందులు అత్యవసర పరిస్థితుల్లో అవసరం ఉంటే 9849108736, 9866223544, 9247393239, 9849705767 ఈ నెంబర్లకు కాల్ చేయాలని తెలిపారు. విధానాన్ని ఆన్ లైన్ విక్రయాలపై ప్రభుత్వం కఠిన నిబంధనలు తీసుకురాకపోతే ఆందోళనలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ సందర్భంగా డ్రగ్ ఇన్స్పెక్టర్ చందన మాట్లాడుతూ ప్రజలకు అత్యవసర మెడిసిన్ అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. మంచిర్యాల్ పట్టణ సెక్రెటరీ మోటూరు అశోక్ , ట్రెజరర్ . చంద్రశేఖర్ హోల్సేల్ అధ్యక్షులు బాలేశ్వరరావు సీనియర్ నాయకులు నరసయ్య, శ్రీనివాస్ , శ్రీనివాస్ మార్కండేయ , ప్రదీప్, ప్రమోద్ తదితరులు పాల్గొన్నారు

# ధాన్యం తరలింపు ప్రక్రియ ప్రణాళిక ప్రకారం పూర్తి చేయాలి

-కలెక్టర్ భవేశ్ మిశ్రా



**నిర్మల్ ప్రతినిధి, మే 18 (నినాదం):** జిల్లాలో వరి, మొక్కజొన్న ధాన్యం తరలింపు ప్రక్రియ ప్రణాళిక ప్రకారం పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా అధికారులను ఆదేశించారు. జిల్లాలో మొక్కజొన్న, వరి ధాన్యం కొనుగోలు ప్రక్రియ పై సోమవారం కలెక్టర్ భవేశ్ మిశ్రా, సంబంధిత శాఖల అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ఇప్పటి వరకు కొనుగోలు చేసిన పంటల వివరాలు అధికారులను అడిగి తెలుసుకున్నారు. కొనుగోలు ప్రక్రియ వేగవంతంగా పూర్తి చేయాలని పేర్కొన్నారు. ఏ కొనుగోలు కేంద్రంలో కూడా తూకం వేసిన ధాన్యం నిల్వ ఉండకూడదన్నారు. అలాగే తేమ శాతానికి వచ్చిన ధాన్యాన్ని వెంట వెంటనే తూకం వేయాలన్నారు. అవసరం అయితే సరిహద్దు జిల్లాల నుంచి అదనంగా లారీలు, హమాలీలను సమకూర్చుకోవాలని చెప్పారు. ఇంకనూ ఎక్కడైనా ధాన్యం నిల్వ చేయడానికి అవకాశం ఉన్న ప్రదేశాలు అన్వేషించాలని వివరించారు. ట్రాక్టర్ల ద్వారా కూడా ధాన్యం తరలింపు ప్రక్రియ కొనసాగించాలని తెలిపారు.ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ (రెవెన్యూ) కిషోర్ కుమార్, పౌర సరఫరాల అధికారులు రాజేందర్, సుధాకర్, వ్యవసాయ అధికారి అంజిప్రసాద్, హార్టికల్చర్ అధికారి రమణ, ఇతర అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

# బక్రీద్‌కు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలి



**నిర్మల్ ప్రతినిధి, మే 18 (నినాదం):** బక్రీద్ పండుగను జిల్లా వ్యాప్తంగా ముస్లిం సోదరులు ప్రశాంత వాతావరణంలో, భక్తిశ్రద్ధలతో జరుపుకునేలా అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో బక్రీద్ పండుగ ఏర్పాట్లపై నిర్వహించిన సమన్వయ సమావేశంలో ఆయన అధికారులతో కలిసి సమీక్ష నిర్వహించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, జిల్లా వ్యాప్తంగా ఉన్న ఈద్గాలు, మసీదుల వద్ద ప్రార్థనలకు వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా తగిన సౌకర్యాలు కల్పించాలని సూచించారు. ముఖ్యంగా ఎండ తీవ్రతను దృష్టిలో ఉంచుకుని అన్ని ప్రార్థనా స్థలాల్లో తాగునీటి సౌకర్యం తప్పనిసరిగా అందుబాటులో ఉంచాలని స్పష్టం చేశారు.

# గంజాయి రవాణా, విక్రయాలపై ప్రత్యేక నిఘా



**మంచిర్యాల, మే 18(నినాదం):** గంజాయి అక్రమ రవాణా చేసినా, వినియోగించినా, నిల్వ చేసినా కఠిన చర్యలు తీసుకుంటామని మంచిర్యాల ఇన్స్పెక్టర్ ప్రమోద్ రావు హెచ్చరించారు. సోమవారం మంచిర్యాల రైల్వే స్టేషన్,బస్ స్టాండ్, పాన్ షాపులు, సినిమా థియేటర్లు తదితర ప్రాంతాల్లో నార్కొటిక్ ట్రైనింగ్ స్నిఫర్ డాగ్ సహాయంతో విస్తృత తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా బస్సులు, రైళ్లు,స్టేషన్ పరిసరాలు మరియు అను మానాస్పద వస్తువులను తనిఖీ చేశారు.ఆగి ఉన్న బస్సులు,రైళ్లలోకి ఎక్కి ప్రయాణికులను తనిఖీ చేశారు. పలువురు ప్రయాణికుల బ్యాగులను పరిశీలించి వివరాలు సేకరించారు.మహారాష్ట్ర నుంచి వచ్చే ప్రయాణికులు, రైలు బోగీలు, అనుమానాస్పదంగా కనిపించే ప్రతి పార్సిల్‌ను పరిశీలించారు.అలాగే పార్సిల్ ఆఫీస్,ఎంట్రీ, ఎగ్జిట్ గేట్ల వద్ద కూడా తనిఖీలు చేపట్టారు. స్టేషన్ పరిధిలోని పాన్ షాపులు,హోటళ్లు, సినిమా థియేటర్లలో కూడా తనిఖీలు నిర్వహించారు.గంజాయి నిర్మూలనలో భాగంగానే ఈ తనిఖీలు చేపట్టామని తెలిపారు.గంజాయి రవాణా చేసినా, విక్రయించినా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.ఇతర ప్రాంతాల నుంచి ప్రైవేట్ వాహనాలు, బస్సులు,రైళ్ల ద్వారా గంజాయిని తీసుకువచ్చి విక్రయిస్తూ యువత జీవితాలను నాశనం చేస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు.ఈ తనిఖీల్లో ఎస్ఐ ఆది మధుసూదన్,డాగ్ స్క్వాడ్ సిబ్బంది, నార్కోటిక్ టీమ్, పోలీస్ స్పెషల్ పార్టీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## ముసుగు దొంగ అరెస్ట్

**నారాయణపేట ప్రతినిధి, మే 18 (నినాదం):** వరుస దొంగతనాలు చేస్తూ, ప్రజలకు కంటిమీద కునుకు లేకుండా చేసిన ముసుగు దొంగను ఎట్టకేలకు పోలీసులు అరెస్ట్ చేశారు. ఇట్టి కేసుకు సంబంధించి పూర్వాపరాలను నారాయణపేట జిల్లా ఎస్పీ వినీత్ సోమవారం నాడు జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వివరిస్తూ...గత కొంత కాలంగా మక్తల్,మరికల్ ప్రాంతాల్లో వరుసగా చోరీలకు పాల్పడుచున్న మక్తల్ కు చెందిన కర్రెం సూర్యనారాయణ,(అలియాస్ తిమ్మప్ప, తిప్పి,సూర్య), ఇన్ని పేర్లతో చెలామణి అవుతున్న ముసుగు దొంగను మక్తల్ ఎస్సై వై. భాగ్యలక్ష్మి రెడ్డి ఆధ్వర్యంలో సోమవారం నాడు అరెస్ట్ చేసి జిల్లా పోలీసు కార్యాలయంలో ఎస్పీ ఆధ్వర్యంలో పత్రికా సమావేశం నిర్వహించి రిమాండ్ కు తరలించారు. ఇట్టి దొంగ 10 దొంగతనాలకు పాల్పడినట్లు వాటి విలువ 12 లక్షల 12 వేల రూపాయలుగా ఎస్పీ వివరించారు. ఇందులో నగదు 9 లక్షల 28 వేలు,బంగారం రెండు తులాలు, మూడు కిలోల వెండి, రెండు విలువైన మద్యం సీసాలు వాటి విలువ 7200, సిగరెట్లు 35వేల విలువైనవి చోరీకి గురైన వాటిల్లో ఉన్నట్లు తెలిపారు. దొంగను అరెస్టు చేసిన అనంతరం రికవరీ అయిన వస్తువుల్లో ఐదు లక్షల నాలుగు వేల నగదు, 13 గ్రాముల బంగారం, 60 తులాల వెండి, 3 మొబైల్ ఫోన్లు, 35 వేలు సిగరెట్లకు మొత్తం నగదు 9,19,500 రికవరీ చేసినట్లు తెలిపారు.

## ఈఏపిసెట్ ఫలితాల్లో అల్ఫోర్స్ విద్యార్థుల ప్రభంజనం: స్టేట్ ర్యాంకులతో మెరిసిన వైనం




**నిర్మల్ ప్రతినిధి, మే 18 (నినాదం):** తెలంగాణ ప్రభుత్వం విడుదల చేసిన టీఎస్ ఈఏపీసెట్ - 2026 (ఖా జూర్సాజజు) ఫలితాల్లో నిర్మల్ పట్టణంలోని అల్ఫోర్స్ విద్యాసంస్థల విద్యార్థులు రాష్ట్ర స్థాయిలో అద్భుత ప్రతిభ కనబరిచి, విశిష్ట ర్యాంకులతో ఘనవిజయం సాధించారు. అగ్రికల్చర్, ఫార్మసీ, మరియు ఇంజినీరింగ్ విభాగాల్లో విద్యార్థులు అత్యుత్తమ ర్యాంకులు కైవసం చేసుకొని సంస్థ కీర్తిని చాటారు. రాష్ట్ర స్థాయిలో అల్ఫోర్స్ విద్యార్థులు సాధించిన ఉత్తమ ర్యాంకుల వివరాలు ఈ క్రింది విధంగా ఉన్నాయి: నబీలా తహ్రీమ్ (2610వ ర్యాంక్), మహవీష్ నీరా (3149వ ర్యాంక్), వి. అఖిల్ (5410వ ర్యాంక్), ఎం. కృష్ణవేణి (5971వ ర్యాంక్), సమా ఫిర్దోస్ (7137వ ర్యాంక్), ఎ. స్ఫూర్తి (7422వ ర్యాంక్), కె. త్రిపుర (8816వ ర్యాంక్), టి. అక్షర (9059వ ర్యాంక్), అయేషా సిద్ధికా (9092వ ర్యాంక్), డి. మనోగ్న (9105వ ర్యాంక్), ఎస్. కీర్తన (9351వ ర్యాంక్), జోహా ఫాతిమా (9593వ ర్యాంక్), మరియు ఎస్. సారిక (9670వ ర్యాంక్) సాధించి అత్యుత్తమ ప్రతిభ కనబరిచారు.

**అల్ఫోర్స్ చైర్మన్ హర్షం**

ఈ ఘన విజయం సాధించిన సందర్భంగా అల్ఫోర్స్ విద్యాసంస్థల అధినేత (ఛైర్మన్) వి. నరేందర్ రెడ్డి విద్యార్థులను ప్రత్యేకంగా అభినందించారు. ప్రణాళికాబద్ధమైన బోధన, విద్యార్థుల కఠోర శ్రమ, అలాగే వారి విజయానికి వెన్నంటి ఉండి కృషి చేసిన అధ్యాపక బృందాన్ని మరియు విద్యార్థుల తల్లిదండ్రులను ఆయన ఈ సందర్భంగా అభినందిస్తూ ప్రశంసించారు. రాబోయే రోజుల్లో విద్యార్థులు మరిన్ని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆయన ఆకాంక్షించారు.

## గోవధ నిషేధం కఠినంగా అమలు చేయాలి

-అసత్య ప్రచారాలు చేస్తే కఠిన చర్యలు తప్పవు

-ఎస్పీ డా.జి.జానకి షర్మిల హెచ్చరిక




**నిర్మల్ ప్రతినిధి, మే 18 (నినాదం):** గోవధ నిషేధానికి నిర్మల్ పోలీసులు అహర్నిశలు కృషి చేస్తున్నారని, దాని కొరకు 24/7 జిల్లా వ్యాప్తంగా 14 చెక్ పోస్టులను నడపడం జరుగుతుందని తెలియజేశారు.సోషల్ మీడియాలో నిర్ధారణ లేకుండా అసత్య ప్రచారాలు చేయడం, ప్రజల్లో అపోహలు సృష్టించడం చట్ట విరుద్ధమని నిర్మల్ జిల్లా ఎస్పీ డా.జి.జానకి షర్మిల,ఐపీఎస్ తెలిపారు. ఇటీవల కొందరు వ్యక్తులు ఎద్దులను , గోవులు అని తప్పుడు ప్రచారం చేస్తూ సోషల్ మీడియాలో పోస్టులు, వీడియోలు షేర్ చేస్తున్నారు. దీని వలన చాలా అలజడి నెలకొంటుంది. ఇలాంటి అసత్య ప్రచారాల వల్ల సామాజిక శాంతి భద్రతలకు భంగం కలిగే అవకాశం ఉందని, తప్పుడు సమాచారాన్ని వ్యాప్తి చేసే వారిపై చట్టపరమైన కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.ప్రజలు చట్టాన్ని తమ చేతుల్లోకి తీసుకోకుండా బాధ్యతాయుతంగా వ్యవహరించాలని సూచించారు. ఎక్కడైనా గోవుల అక్రమ రవాణా జరుగుతోందని అనుమానం కలిగితే లేదా ఆవులు తరలిస్తున్నట్లు సమాచారం తెలిసిన వెంటనే డయల్-100 కు సమాచారం అందించాలని, పోలీసులు వెంటనే స్పందిస్తారని తెలియ జేశారు.గోవులను సంరక్షించే విషయంలో రాజీపడే ప్రసక్తే లేదు అని, అదే సమయంలో అసత్య ప్రచారాలు చేసే సమాజంలో శాంతి భద్రతలకు విఘాతం కలిగించే వారిపై కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని నిర్మల్ జిల్లా ఎస్పీ డా.జి.జానకి షర్మిల ఐపీఎస్ హెచ్చరించారు.

### ప్రతి ఒక్కరూ సన్మార్గంలో నడిచి

## భగవంతుడి సేవలో తరించాలి



**నారాయణపేట ప్రతినిధి, మే 18, (నినాదం):** ప్రతి ఒక్కరు దైనందిన కార్యక్రమాలతో పాటు సన్మార్గంలో నడిచి భగవంతుడి సేవలో తరించాలని బెంగళూరుకు చెందిన స్వామి విద్యా సింధు మాధవ తీర్థులు అన్నారు. అధిక మాసాన్ని పురస్కరించుకొని సోమవారం నారాయణపేట లక్ష్మీ నరసింహ సహిత రాఘవేంద్ర స్వామి ఆలయంలో భాగవత సప్త కార్యక్రమం ప్రారంభం నిర్దేశించి స్వామీజీ ఆధ్యాత్మిక ప్రవచనం చేశారు. ఏడు రోజులపాటు ఉదయం సాయంత్రం స్వామీజీ అనుగ్రహ భాషణం చేస్తారు. మధ్యాహ్నం శ్రీ వెంకటేశ్వర స్వామి శ్రీదేవి భూదేవి లక్ష్మీ నరసింహ స్వామి విగ్రహాలకు సంస్థాన పూజ స్వామీజీ నిర్వహించారు. కార్యక్రమంలో యజ్ఞ నారాయణ పురోహిత్, జోషి రఘు ప్రేమాచారి రాఘవేంద్ర సేవాసమితి సభ్యులు నరసింహ చారి అనిల్ జయ సాయి శ్రీవత్స నరసింహ సీతారాం రావు ధరణి ధర్ దీక్షిత్ శేష శక్తిపీఠం స్వామి శాంతానందా యజుర్వేద స్మార్త పండితులు విద్వాన్ విభావసు పురోహిత్, విద్వాన్ ధీరజ్ ప్రహ్లాద తదితరులు ఉన్నారు

నినాదం
తెలంగాణ ప్రాంతీయం
నిఖార్సైన జర్నలిజం
మంగళవారం
19 మే
2026

# వడ్లు కొనుగోలులో అలసత్వం తగదు

**వారం రోజుల్లో కొనుగోలు పూర్తి చేయాలి**

**మండుటెండలో రైతులు పడిగాపులు కాయడం ప్రభుత్వానికి మంచిది కాదు**

**రైతు మహాధర్నా లో ఎమ్మెల్సీ నవీన్ రెడ్డి, మాజీ మంత్రి సబితా ఇంద్రారెడ్డి, మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్ రెడ్డి**




**కొడంగల్, మే,18(నినాదం) :** రైతులు పండించిన వరి కొనుగోలులో రాష్ట్ర ప్రభుత్వం అలసత్వం వహిస్తుందని ఇది సరైన పద్ధతి కాదని ఎమ్మెల్సీ నవీన్ రెడ్డి, మాజీ మంత్రి సబితా ఇంద్రారెడ్డి, మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్ రెడ్డిలు అన్నారు. సోమవారం కొడంగల్ నియోజకవర్గం లోని దౌల్తాబాద్ మండల కేంద్రంలో నిర్వహించిన రైతు మహాధర్నాలో పాల్గొన్న వారు మాట్లాడుతూ కొడంగల్ నియోజకవర్గం లో రైతులు ఎక్కడ చూసినా వడ్ల కుప్పలు పెట్టుకొని కనిపిస్తున్నారని మండుటెండలో రైతులు ఇబ్బంది పడుతుంటే ముఖ్యమంత్రికి కనబడడం లేదా అంటూ ప్రశ్నించారు. ఓట్లేసి గెలిపించిన పాపానికి రైతులను ఇబ్బంది ఇబ్బందుల పాలు చేయడం సరైనది కాదన్నారు అకాల వర్షాలు కురిస్తే ఆరుగాలం కష్టపడి పండించిన రైతుల పరిస్థితి ఏంటని నిలదీశారు. రైతులు పండించిన పంటను కొనుగోలు చేయలేని ప్రభుత్వం పాలన తీరు ఎలా ఉందో దీన్ని బట్టి ప్రజలు అర్థం చేసుకోవాలని అన్నారు. కొనుగోలు చేస్తున్న కేంద్రాల్లో క్వింటాలకు 10 కిలోల తరుగు తీస్తున్నారని, గన్ని బ్యాగులు సరిపడా లభించకపోవడంతో రైతులు ఇబ్బంది పడుతుంటే ప్రభుత్వం నిమ్మకు నీరెత్తినట్లు నటించడం సరికాదన్నారు. రైతు భరోసా డబ్బులు ఇవ్వడంలేదనీ, రైతు ఋణమాఫీ పూర్తి స్థాయిలో జరగలేదని, కనీసం రైతులు పండించిన పంటను కూడా కొనుగోలు చేయడం ప్రభుత్వానికి చేతకావడం లేదని ఎద్దేవా చేశారు. రైతుల కష్టాలు తెలియని రాష్ట్ర ప్రభుత్వం అడుగడుగునా రైతులకు అన్యాయం చేస్తున్నారని మండిపడ్డారు. వారం రోజుల్లో రైతులు పండించిన పంటలను కొనుగోలు చేయడం పూర్తిచేయకపోతే ముఖ్యమంత్రి క్యాంపు కార్యాలయం ముంగిట వడ్లకుప్పలు పోసి ధర్నా చేస్తామని హెచ్చరించారు. ఈకార్యక్రమంలో బిఆర్ ఎస్ పార్టీ నాయకులు, మాజీ సర్పంచ్ లు,మాజీ ఎంపిటిసిలు,బిఆర్ ఎస్ పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు

# "హ్యూమన్ రైట్స్ డిఫెండర్ అవార్డు 2026" అందుకున్న తిమ్మాపూర్ సర్పంచ్ గుర్రాల శ్రీనివాస్



**దుబ్బాక మే 18 (నినాదం) :** దుబ్బాక మండలం, తిమ్మాపూర్ గ్రామానికి చెందిన ప్రముఖ సామాజిక ఉద్యమకారుడు, గ్రామ సర్పంచ్ గుర్రాల శ్రీనివాస్‌కు అంతర్జాతీయ స్థాయిలో అరుదైన గౌరవం దక్కింది. గోవాలో మే 16వ తేదీన అత్యంత వైభవంగా నిర్వహించిన ఇంటర్నేషనల్ హ్యూమన్ రైట్స్ కాన్ఫరెన్స్ -- 2026 కార్యక్రమంలో ఆయనకు "హ్యూమన్ రైట్స్ డిఫెండర్ అవార్డు -- 2026" ప్రదానం చేశారు.
దేశవ్యాప్తంగా మానవ హక్కుల పరిరక్షణ, సామాజిక న్యాయం, రాజ్యాంగ హక్కుల సాధన కోసం కృషి చేస్తున్న ప్రముఖ సామాజిక కార్యకర్తలు, న్యాయవాదులు, ప్రజాసంఘాల నాయకులు, మేధావులను ఒకే వేదికపైకి తీసుకువచ్చిన ఈ అంతర్జాతీయ సదస్సు విశేష ప్రాధాన్యతను సంతరించుకుంది. సమాజంలో అణగారిన వర్గాల పక్షాన నిలబడి సేవలందిస్తున్న వ్యక్తులను గుర్తించి సత్కరించడం ఈ సదస్సు ముఖ్య ఉద్దేశ్యంగా నిర్వాహకులు తెలిపారు. ఈ సందర్భంగా సుప్రీంకోర్టు అడ్వకేట్ శ్రీ రాగసందేశ్, నేషనల్ ప్రెసిడెంట్ శ్రీ కొంగర అనిల్ కుమార్ చేతుల మీదుగా గుర్రాల శ్రీనివాస్ అవార్డును స్వీకరించారు. సభలో ఈ ఘట్టం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. పలువురు ప్రముఖులు మాట్లాడుతూ, గ్రామీణ స్థాయి నుంచి మానవ హక్కుల పరిరక్షణ కోసం కృషి చేస్తున్న నాయకులకు ఇలాంటి అంతర్జాతీయ స్థాయి గుర్తింపులు రావడం సమాజానికి స్ఫూర్తిదాయకమని పేర్కొన్నారు. గుర్రాల శ్రీనివాస్ గత అనేక సంవత్సరాలుగా దళితులు, బడుగు బలహీన వర్గాలు, అణగారిన సమాజాల సమస్యలపై నిరంతరం స్పందిస్తూ ప్రజల గొంతుకగా నిలుస్తున్నారు. సామాజిక అన్యాయం, వివక్ష, హక్కుల ఉల్లంఘనలపై ఆయన చేస్తున్న పోరాటం అనేక మంది బాధితులకు న్యాయం అందించే దిశగా కీలక పాత్ర పోషిస్తోందని సభలో పలువురు కొనియాడారు. గ్రామీణ ప్రాంతాల్లో రాజ్యాంగ చైతన్యం, సామాజిక అవగాహన పెంపొందించడంలో ఆయన పాత్ర విశేషమని అభిప్రాయపడ్డారు. సమాజ సేవలో ఆయన చేస్తున్న విశిష్ట కృషికి గుర్తింపుగా ఇప్పటికే "దళిత రత్న అవార్డు"తో పాటు డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ జాతీయ అవార్డు (దీూూ) కూడా ఆయన అందుకున్నారు. భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ ఆశయాలను ఆదర్శంగా తీసుకుని సమానత్వ సమాజ నిర్మాణం కోసం ఆయన చేస్తున్న కృషిని సదస్సులో పాల్గొన్న పలువురు ప్రముఖులుప్రత్యేకంగా ప్రశంసించారు. సదస్సులో జరిగిన చర్చల్లో మానవ హక్కుల పరిరక్షణ అనేది కేవలం బాధ్యత మాత్రమే కాకుండా ప్రజాస్వామ్య వ్యవస్థకు మూలస్తంభమని వక్తలు పేర్కొన్నారు. బలహీన వర్గాల పక్షాన నిలబడి వారి హక్కుల కోసం పోరాడే నాయకులను ప్రోత్సహించడం ద్వారా సమాజంలో మరింత చైతన్యం పెరుగుతుందని అభిప్రాయపడ్డారు. అవార్డు స్వీకరించిన అనంతరం గుర్రాల శ్రీనివాస్ మాట్లాడుతూ, "ఈ గౌరవం నా ఒక్కరికి సంబంధించినది కాదు. సమాజంలో న్యాయం కోసం, హక్కుల కోసం పోరాడుతున్న ప్రతి సామాన్యుడికి చెందిన గౌరవం ఇది. భవిష్యత్తులో కూడా రాజ్యాంగ పరిరక్షణ, మానవ హక్కుల సాధన, సామాజిక న్యాయం కోసం మరింత కట్టుబాటుతో పనిచేస్తాను" అని తెలిపారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న మానవ హక్కుల సంఘాల ప్రతినిధులు, సామాజిక కార్యకర్తలు, ప్రజాసంఘాల నాయకులు, అభిమానులు గుర్రాల శ్రీనివాస్‌కు హృదయపూర్వక అభినందనలు తెలియజేస్తూ, ఆయన భవిష్యత్తులో మరింత ఉన్నత స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు.

# భవన నిర్మాణ కార్మికుల... ధర్నాకు సిపిఐ పార్టీ సంపూర్ణ మద్దతు.

**కార్మికులకు లేబర్ కార్డు ఇన్సూరెన్స్ సౌకర్యం కల్పించండి**



**జవహర్ నగర్, మే 18 (నినాదం):** జవహర్ నగర్ లో భవన నిర్మాణ కార్మికుల ధర్నాకు సిపిఐ పార్టీ సంపూర్ణ మద్దతు తెలుపుతుందని దేశవ్యాప్తంగా పెట్రోల్ డీజిల్ ధరలు పెరగడం వల్ల నిత్యవసర వస్తువుల ధరలు భవన నిర్మాణ వస్తువుల మీద విపరీతమైన రేట్లు పెంచడం జరిగిందని దీనికి అనుగుణంగా కార్మికులకు వేతనాలు పెంచి అండగా నిలవాలని సిపిఐ పార్టీ డిమాండ్ చేస్తుందని సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు నిమ్మల నరసింహులు తెలిపారు. మల్కాజిగిరి మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని కీసర సర్కిల్ జవహర్ నగర్ లేబర్ అడ్డ మీద సోమవారం భవన నిర్మాణ కార్మికుల ధర్నాకు సిపిఐ పార్టీ ఆధ్వర్యంలో సంపూర్ణ మద్దతు ప్రకటించింది. ఈ సందర్భంగా నిమ్మల నరసింహులు మాట్లాడుతూ కార్మికులకు రేట్లు పెంచి అండగా నిలవాలని తెలిపారు. అదేవిధంగా లేబర్ కార్డులు హెల్త్ ఇన్సూరెన్స్ తదితర సౌకర్యాలను కల్పించి వారికి అండగా నిలవాలన్నారు. జవహర్ నగర్ లో నిర్వహించిన ఈ ధర్నాకు సిపిఐ పార్టీ ఏఐటిసి సంఘీభావం తెలుపుతుందని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో సిపిఐ కాప్రా మండల కార్యదర్శి దర్శనం యాదగిరి, మండల అధ్యక్షులు అంబాల ఎల్లయ్య, నరసింహ, యూనియన్ నాయకులు మల్లేష్, కొయ్యడ వెంకటేష్, బూడిద వెంకటేష్, చెన్నాపురం యాదయ్య, భవన నిర్మాణ కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

# గంజాయి మత్తు పదార్థాలను నియంత్రించాలి

**టీజేఎస్ జిల్లా అధ్యక్షుడు ఖాదర్ పాషా**



**వనపర్తి ప్రతినిధి, మే 18 (నినాదం) :** యువత భవిష్యత్తును నాశనం చేస్తున్న గంజాయి మత్తు పదార్థాలను నియంత్రించాలని, డ్రగ్స్ విక్రయాలపై ఉక్కుపాదం మోపాలని తెలంగాణ జన సమితి జిల్లా అధ్యక్షుడు యంఏ.ఖాదర్ పాష కోరారు. వనపర్తి జిల్లాకు నూతనంగా పదవీ బాధ్యతలు స్వీకరించిన డీఎస్పీ జి.గిరిబాబు ను తెలంగాణ జన సమితి జిల్లా అధ్యక్షులు యంఏ.ఖాదర్ పాష సోమవారం మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయంలో డీఎస్పీ ని కలిసి పుష్పగుచ్ఛం అందించి శాలువాతో ఘనంగా సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఖాదర్ పాష మాట్లాడుతూ జిల్లాలో శాంతిభద్రతల పరిరక్షణకు నూతన డీఎస్పీ ప్రత్యేక చొరవ చూపాలని కోరారు. వనపర్తి పట్టణంలో నేరాల నియంత్రణకు, ప్రజల భద్రతకు కీలక జంక్షన్లలో, సమస్యాత్మక ప్రాంతాలలో సీసీ కెమెరాలను ఏర్పాటు చేయాలని కోరారు. పోలీస్ స్టేషన్లకు వచ్చే సామాన్య ప్రజలకు, బాధితులకు పోలీస్ యంత్రాంగం ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటూ త్వరితగతిన న్యాయం జరిగేలా చూడాలని కోరారు. జిల్లాలో ప్రజాస్వామ్యయుతంగా ప్రజా సమస్యలపై పోరాడే తమ పార్టీ తరపున పోలీసు విభాగానికి, శాంతిభద్రతల పరిరక్షణకు ఎల్లప్పుడూ పూర్తి సహకారం ఉంటుందని స్పష్టం చేశారు. జిల్లాలో చట్టాన్ని గౌరవిస్తూ శాంతి భద్రతలను కాపాడుతూ ప్రజలకు జవాబుదారీగా పనిచేస్తామని డిఎస్పీ హామీ ఇచ్చారని చెప్పారు. ఈ కార్యక్రమంలో రతన్ నాయక్, ఉద్యమ నాయకులు చాంద్ పాషా తదితరులు పాల్గొన్నారు

# భౌతిక శాస్త్రంలో రవి వర్మకు పీహెచ్.డీ



**పటాన్చెరు, మే18 (నినాదం) :** హైదరాబాదులోని గీతం స్కూల్ ఆఫ్ సైన్స్, భౌతిక శాస్త్ర విభాగం పరిశోధక విద్యార్థి ఐ.ఎస్. రవి వర్మ డాక్టరేట్ కు అర్హత సాధించారు. 'నానోకాంపోజిట్ పాలిమర్ బ్లెండ్ ఎలక్ట్రోలైట్లలో సోడియం అయాన్ ప్రసరణ యంత్రాంగం యొక్క అధ్యయనం' చేసి, సిద్ధాంత వ్యాసాన్ని సమర్పించారు. ఈ పరిశోధనకు మార్గదర్శనం వహిస్తున్న గీతం స్కూల్ ఆఫ్ సైన్స్ భౌతిక శాస్త్ర విభాగం అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ ఎస్. రమేష్ సోమవారం విడుదల చేసిన ప్రకటనలో ఈ విషయాన్ని వెల్లడించారు. డాక్టర్ రవి వర్మ పరిశోధన తదుపరి తరం శక్తి నిల్వ వినియోగం కోసం అధునాతన నానోకాంపోజిట్ పాలిమర్ ఎలక్ట్రోలైట్ ఫిల్మ్ ల అభివృద్ధిపై దృష్టి సారించినట్టు తెలియజేశారు. ఈ అధ్యయనంలో ఎన్ ఏ పి ఎఫ్6 లవణం, ఇథలీన్ కార్బొనేట్ ప్లాస్టిసైజర్, ఏ ఐ2 ఓ నిన్ను కాదు మా ఈడ3, నానోఫిల్లర్ ను చేర్చిన పాలిమర్ బ్లెండ్ ఎలక్ట్రోలైట్ వ్యవస్థను సంశ్లేషణ చేయడం ద్వారా గది ఉష్ణోగ్రత వద్ద మెరుగైన అయానిక వాహకతను సాధించారన్నారు. ఈ పరిశోధనలో, ఎఫ్ టీ ఐ ఆర్, డి ఎస్ సి , ఎస్ఈఎం, ఎక్స్ఆర్డి, ఎలక్ట్రోకెమికల్ ఇంపిడెన్స్ స్పెక్ట్రోస్కోపీ వంటి అధునాతన లక్షణీకరణ పద్ధతులను ఉపయోగించి, అభివృద్ధి చేసిన ఫిల్మ్ ల యొక్క నిర్మాణాత్మక, విద్యుత్, విద్యుద్వాహక, విద్యుత్ రసాయన ధర్మాలను అన్వేషించినట్టు తెలిపారు. సురక్షితమైన, అధిక పనితీరు గల సాలిడ్-స్టేట్ సోడియం-అయాన్ బ్యాటరీలు, పునరుత్పాదక శక్తి నిల్వ వ్యవస్థలు, సూపర్ కెపాసిటర్లు, ఫ్యూయల్ సెల్స్, ఎలక్ట్రోక్రోమిక్ పరికరాలు, ఫ్లెక్సిబుల్ ఎలక్ట్రానిక్స్ లో ఈ పదార్థాన్ని ఉపయోగించడానికి బలమైన సామర్థ్యం ఉందని ఈ పరిశోధన ఫలితాలు నిరూపిస్తున్నాయని వివరించారు. భవిష్యత్ శక్తి సాంకేతికతల కోసం సమర్థవంతమైన, సుస్థిరమైన సాలిడ్-స్టేట్ ఎలక్ట్రోకెమికల్ పరికరాల అభివృద్ధికి ఈ అధ్యయనం గణనీయంగా దోహదపడుతుందని భావిస్తున్నామన్నారు. డాక్టర్ రవి వర్మ సిద్ధాంత వ్యాసం పీహెచ్.డీ. పట్టాకు అర్హత సాధించడం పట్ల గీతం హైదరాబాదు అదనపు ఉపకులపతి ప్రొఫెసర్ డీ.ఎస్.రావు, గీతం రెసిడెంట్ డైరెక్టర్ డీవీవీఎస్ఆర్ వర్మ, స్కూల్ ఆఫ్ సైన్స్ ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం.రెజా, భౌతిక శాస్త్ర విభాగాధిపతి ప్రొఫెసర్ టి.విశ్వం, పలు విభాగాల అధిపతులు, అధ్యాపకులు, సిబ్బంది తదితరులు అభినందనలు తెలియజేసినట్టు ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

# ఫామ్ హౌస్‌కు వెళ్ళి ఉంటే మమ్మల్ని కూడా హత్య చేసేదేమో

**సీ ఐ కి ఫిర్యాదు చేసిన మహిళలు**




**వికారాబాద్, మే18(నినాదం):** రాష్ట్రవ్యాప్తంగా ఎంతో సంచలనంగా మారిన ఇద్దరు అదృశ్యమైన వృద్ధ మహిళల మర్డర్ హిస్టరీని పోలీసులు ఛేదించిన విషయం విధితమే. డబ్బులు అప్పు తీసుకుని తిరిగి ఇవ్వాలని అడిగినందుకు ఇద్దరు వృద్ధ మహిళలను మొయినాబాద్ ఫామ్ హౌస్ పక్కన నిర్మానుష్య ప్రదేశానికి తీసుకెళ్లి అతి దారుణంగా హత్య చేసి పూడ్చిపెట్టిన ప్రధాన నిందితురాలు కరీమా బీ తమను కూడా ఫామ్ హౌస్ కు రావాలని అనేకమంది మహిళలను గతంలో పిలిచిందని ఆ సమయానికి మాకు పనులు ఉన్నందున వెళ్లలేకపోవడంతోనే నేడు బతికి ఉన్నామని కరీమా బీ బాధితులు సోమవారం మీడియా ముందు ఆవేదన వ్యక్తం చేశారు. గత 12వ తారీకు పోలీసులు కరీమా బీ మిగతా నిందితులను అదుపులోకి తీసుకున్నందుకే తాము ప్రాణాలతో బతికిపోయామని అన్నారు. డబ్బులు ఇచ్చినందుకు తల్లి సమానులైన అమాయకులైన ఇద్దరు వృద్ధ మహిళలను అతి కిరాతకంగా హత్య చేసి ఆపై పాతి పెట్టిన నిందితురాలు కరీమా బీ తోపాటు మిగతా నిందితులను కఠినంగా శిక్షించలని పోలీసులను డిమాండ్ చేశారు. ఈ నేపథ్యంలో తాండూర్ రూరల్ సీ ఐ కి ప్రభాకర్ కు కూడా సదరు మహిళలు ఫిర్యాదు చేశారు. ఫామ్ హౌస్ కు వెళ్ళనందుకే ప్రాణాలతో ఉన్నామని వారు వాపోయారు. ఈ మేరకు సీ ఐ కేసునమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.



# లయన్స్ క్లబ్ శిబిరాలను సద్వినియోగం చేసుకోండి





**అమనగల్లు, మే 18(నినాదం) :** సమాజ సేవలో భాగంగా లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో మహబూబ్‌నగర్ జిల్లా యెనుగొండలోని లయన్ రామిరెడ్డి కంటి ఆసుపత్రి సహకారంతో నిర్వహించిన ఉచిత కంటి పరీక్ష మరియు ముత్యబిందు శస్త్రచికిత్స శిబిరం ఘనవిజయం సాధించింది. ఈ శిబిరానికి పరిసర గ్రామాల నుంచి పెద్ద సంఖ్యలో ప్రజలు హాజరై కంటి పరీక్షలు చేయించుకున్నారు. ముఖ్యంగా వృద్ధులు మరియు ఆర్థికంగా వెనుకబడిన ప్రజలకు ఈ శిబిరం ఎంతో ఉపయోగకరంగా నిలిచింది. శిబిరంలో అనుభవజ్ఞులైన వైద్య బృందం ఆధ్వర్యంలో కంటి పరీక్షలు నిర్వహించగా, మొత్తం 23 మంది వృద్ధులకు ముత్యబిందు సమస్య ఉన్నట్లు గుర్తించారు. అనంతరం వారికి అవసరమైన వైద్య సూచనలు అందించి, ఉచిత శస్త్రచికిత్స కోసం యెనుగొండలోని లయన్ రామిరెడ్డి కంటి ఆసుపత్రికి ప్రత్యేక వాహనంలో తరలించారు. ఆసుపత్రిలో వారికి పూర్తిగా ఉచితంగా ముత్యబిందు ఆపరేషన్లు నిర్వహించబడనున్నాయి. శస్త్రచికిత్స అనంతరం రోగులను తిరిగి వారి గ్రామాలకు సురక్షితంగా చేర్చేందుకు కూడా ప్రత్యేక ఉచిత రవాణా సౌకర్యాన్ని ఏర్పాటు చేసినట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ సేవా కార్యక్రమాన్ని లయన్స్ క్లబ్ అధ్యక్షుడు కె. గోవర్ధన్ రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్మన్ లయన్ పత్యా నాయక్, కమిషనర్ రాఘవేందర్ రెడ్డి ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. వారు మాట్లాడుతూ, లయన్స్ క్లబ్ సమాజంలోని పేద ప్రజలకు అందిస్తున్న సేవలు ఆదర్శప్రాయమని కొనియాడారు. ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల్లో వైద్య సేవలు అందుబాటులో లేక ఇబ్బందులు పడుతున్న ప్రజలకు ఇలాంటి శిబిరాలు ఎంతో మేలు చేస్తున్నాయని తెలిపారు. అలాగే ప్రతి నెల మూడవ సోమవారం ఉచిత కంటి వైద్య శిబిరాన్ని నిరంతరం నిర్వహించనున్నట్లు క్లబ్ ప్రతినిధులు వెల్లడించారు. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని కంటి సంబంధిత సమస్యలను ప్రారంభ దశలోనే గుర్తించి చికిత్స పొందాలని కోరారు. సమాజ సేవే లక్ష్యంగా లయన్స్ క్లబ్ భవిష్యత్తులో మరిన్ని వైద్య మరియు సేవా కార్యక్రమాలు చేపట్టనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో శిబిర ఇన్‌చార్జ్ చంద్రశేఖర్, కార్యదర్శి గంప శ్రీనివాస్, రమేష్, కొండల్ రెడ్డి, పండు రెడ్డి, మోహన్ రెడ్డి, పి.ఆర్.ఓ పాషా తదితరులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

# హైదరాబాద్ ప్రజల దాహార్తిని తీర్చడంలో కాంగ్రెస్ ప్రభుత్వానికి చిత్తశుద్ధి లేదు

**బిఆర్ఎస్ ఎల్పి విప్, ఎమ్మెల్యే కేపీ.వివేకానంద్**





**కుత్బుల్లాపూర్, మే 18 (నినాదం) :** కుత్బుల్లా పూర్ నియోజక వర్గం 127--రంగారెడ్డి నగర్ డివిజన్, ఆదర్శ్ నగర్‌లోని జలమండలి కార్యాలయం ఎదుట బిఆర్ఎస్ ఎల్పి విప్, కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే కేపీ.వివేకానంద్ ఆధ్వర్యంలో నిర్వహించిన నిరసన ధర్నా కార్యక్రమంలో నియోజకవర్గానికి చెందిన వివిధ కాలనీల వాసులు, బస్తీ వాసులు, డబుల్ బెడ్ రూమ్ ఇళ్ల సముదాయాల వాసులు,మాజీ ప్రజా ప్రతినిధులు, పార్టీ అధ్యక్షులు,బిఆర్ఎస్ శ్రేణులు, భారీగా పాల్గొనగా ఎమ్మెల్యే కేపీ.వివేకానంద్ త్రాగునీటి సరఫరాలో కాంగ్రెస్ ప్రభుత్వ నిర్లక్ష్య వైఖరిపై తీవ్ర స్థాయిలో మండిపడ్డారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గత రెండున్నర సంవత్సరాలుగా కాంగ్రెస్ ప్రభుత్వ నిర్లక్ష్య ధోరణి, పాలకుల అనుభవ రాహిత్యం, అవగాహన లోపం కారణంగా హైదరాబాద్ నగర ప్రజలు తీవ్ర త్రాగునీటి ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. ఎన్నికల సమయంలో కాంగ్రెస్ ప్రభుత్వం హైదరాబాద్ ప్రజలకు 24 గంటల త్రాగునీటి సరఫరా అందిస్తామని హామీ ఇచ్చి, ఆ హామీని అమలు చేయడంలో పూర్తిగా విఫలమైందన్నారు. బిఆర్ఎస్ ప్రభుత్వం హయాంలో మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ నాయకత్వంలో సుమారు 2000 కోట్ల రూపాయల నిధులతో కిలోమీటర్ల మేర పైప్ లైన్ ఏర్పాటుచేసి హైదరాబాద్ నగరానికి నాడు బిఆర్ఎస్ అధినేత కేసీఆర్ త్రాగునీటిని అందజేయగా, కాంగ్రెస్ ప్రభుత్వం మాత్రం తమ అనాలోచిత నిర్ణయాలు, పరిపాలనా వైఫల్యాలతో రాష్ట్రాన్ని మళ్లీ కరువు పరిస్థితుల వైపు నెడుతోందని విమర్శించారు. హైదరాబాద్ నగర ప్రజల అవసరాలను దృష్టిలో పెట్టుకుని బిఆర్ఎస్ ప్రభుత్వం వివిధ ప్రాజెక్టుల ద్వారా సమృద్ధిగా త్రాగునీటి సరఫరా అందించి ప్రజల దాహార్తిని తీర్చిందన్నారు. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజా అవసరాలకు అనుగుణంగా నీటిని అందించడంలో పూర్తిగా విఫలమైందని పేర్కొన్నారు. కాలనీలు, బస్తీలలో పాత మురుగునీరు వ్యవస్థ ఉండడంవల్ల సామర్థ్యానికి మించి మురుగు ప్రవహిస్తుండడంతో డ్రైనేజీ లీకై రోడ్లమీద పారుతుండడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా భవిష్యత్తును దృష్టిలో ఉంచుకొని మురుగునీటి సామర్థ్య పైప్ లైన్ లను నిర్మించడంలో ప్రభుత్వం ఘోరంగా విఫలమైంది. జిహెచ్ఎంసి పరిధిని పెంచుతూ ఔటర్ రింగ్ రోడ్డు వెలుపల ఉన్న గ్రామాలను కూడా జిహెచ్ఎంసి లో కలిపిన ప్రభుత్వం సరైన నిధులు ఇవ్వకపోవడం, గతంలో ఆర్డబ్ల్యూఎస్ శాఖ నిర్వహణలో ఉన్న త్రాగునీటి సరఫరా నేడు హెచ్ఎండబ్ల్యూఎస్ కు మారిన ఆర్డబ్ల్యూఎస్, హెచ్ఎండబ్ల్యూఎస్ శాఖల సమన్వయ లోపంతో ప్రజలకు ఇబ్బందులు తలెత్తుతున్నాయి. ఇప్పటికైనా కాంగ్రెస్ ప్రభుత్వం మేల్కొని, హైదరాబాద్ నగర ప్రజల త్రాగునీటి కష్టాలను వెంటనే పరిష్కరించి, ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు 24 గంటల త్రాగునీటి సరఫరాను అమలు చేయాలని డిమాండ్ చేశారు. హైదరాబాద్ ప్రజల త్రాగునీటి సమస్యల విషయంలో ప్రభుత్వం నిర్లక్ష్య వైఖరి కొనసాగిస్తే, ప్రజల పక్షాన పోరాడి వారి హక్కులను సాధించేందుకు బిఆర్ఎస్ పార్టీ ఎల్లప్పుడూ ముందుంటుందని స్పష్టం చేశారు. జిహెచ్ఎంసి పరిధిని విస్తరిస్తూ ఔటర్ రింగ్ రోడ్ వెలుపల ఉన్న గ్రామాలను కూడా కలిపిన ఈ ముఖ్యమంత్రి, ఆయా గ్రామాలకు నీటిని సరఫరా చేసే వాటర్ వర్క్స్ బోర్డు కు మాత్రం సరిపడ నిధులు ఇవ్వలేదు. బిఆర్ఎస్ ఆధ్వర్యంలో ప్రతిఆడబిడ్డ కష్టం తీర్చిన బిఆర్ఎస్ అధినేత కేసిఆర్ అని గుర్తు చేశారు. గడిచిన 3 ఏళ్లల్లోనే రేవంత్ సర్కార్ ఆధ్వర్యంలో నీటి సరఫరా బంద్ చేసి, గత కాంగ్రెస్ హయాంలో మాదిరిగా బిందెలతో రోడ్లపైకి వచ్చేలా చేసిన ఘనత రేవంత్ రెడ్డిదే అని ఎద్దేవా చేశారు.
ఇళ్లలోని వాటర్ పైప్ లలో వాటర్ ప్రెజర్ లేదు. రేవంత్ రెడ్డి గాలీ మోటర్ లో తిరిగి గాలి మాటలు మాట్లాడంలో మాత్రం ప్రెజర్ ఉందన్నారు. ఫ్యూచర్ లేని సిటీకి ఫ్యూచర్ గురించి మాట్లాడడంపై ఉన్న శ్రద్ధ రాష్ట్ర ప్రజలకు మంచి చేయడంలో లేదని మండిపడ్డారు. గాలిమోటర్ లో మూటలతో డిల్లీకి పోవుడు కాదు, రిజర్వాయర్ ల చుట్టూ తిరిగి ప్రజల నీటి దప్పిక తీర్చేలా చర్యలు చేపట్టాలని సూచించారు. కేసీఆర్ హయాంలో ఇంటింటికి త్రాగునీటిని అందించి ట్యాంకర్లను బంద్ చేయగా, నేడు రేవంత్ హయంలో నీటి ట్యాంకర్లు రోడ్డులపైకి తెచ్చింది ఈ కాంగ్రెస్ ప్రభుత్వం పుణ్యమే అని తెలిపారు. రేవంత్ రెడ్డి ఊహల నగరమైన ఫోర్త్ సిటీని చూపిస్తూ ఉన్న హైదరాబాద్ సిటీని విస్మరిస్తూ హైదరాబాద్ ప్రజలకు మౌలిక వసతులు కల్పించకుండా తీవ్ర ఇబ్బందులకు గురి చేయడం ఏమిటని ప్రశ్నించారు. ప్రిన్సిపాల్ సెక్రటరీ,బోర్డ్ ఎండి తో మాట్లాడినా వాటర్ సప్లై పై చర్యలు శూన్యంగా ఉన్నదని విమర్శించారు. హైదరాబాద్ ప్రజలతో పాటు కుత్బుల్లాపూర్ ప్రజలనీటి కష్టాన్ని తీర్చకపోతే జూబ్లీహిల్స్ లోని రేవంత్ రెడ్డి ఇళ్లును ముట్టడించడం ఖాయమని ఎమ్మెల్యే కేపీ వివేకానంద హెచ్చరించారు.

నినాదం
తెలంగాణ ప్రాంతీయం
నిఖార్సైన జర్నలిజం
మంగళవారం
19 మే
2026

# పర్యాటక వారోత్సవాలను విజయవంతం చేయాలి

నాగర్ కర్నూల్
కలెక్టర్ హేమంత కేశవ్ పాటీల్



**నాగర్ కర్నూల్ మే 18 (నినాదం) :** ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యచరణ ప్రణాళికలో భాగంగా మే 18వ తేదీ నుంచి 23వ తేదీ వరకు నాగర్‌కర్నూల్ జిల్లాలో నిర్వహించనున్న పర్యాటక వారోత్సవాల సందర్భంగా, నాగర్‌కర్నూల్ కలెక్టరేట్ ప్రధాన సమావేశ మందిరంలో అదనపు కలెక్టర్ అమరేందర్ జిల్లా అధికారులతో కలిసి జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటీల్ అవగాహన గోడపత్రికను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటీల్ మాటాడుతూ.. పర్యాటక రంగం జిల్లా అభివృద్ధిలో కీలక పాత్ర పోషిస్తుందని కలెక్టర్ తెలిపారు. జిల్లాలోని పర్యాటక కేంద్రాలను గుర్తించి వాటిని మరింత అభివృద్ధి చేయడం ద్వారా జిల్లాకు కొత్త గుర్తింపు తీసుకురావచ్చని, పర్యాటక వారోత్సవాలు కేవలం వేడుకలకే పరిమితం కాకుండా, ప్రజల్లో పర్యాటక అవగాహన పెంపొందించే ఒక సమగ్ర ఉద్యమంగా మారాలని జిల్లా కలెక్టర్ సూచించారు. యువతను పర్యాటక రంగంలో భాగస్వామ్యం చేయడం ద్వారా ఉపాధి అవకాశాలు పెరుగుతాయని, స్థానిక ఆర్థిక వ్యవస్థకు బలం చేకూరుతుందని, పర్యాటక ప్రదేశాల శుభ్రత, సంరక్షణ ప్రతి పౌరుడి బాధ్యత అని ఆయన స్పష్టం చేశారు. ముఖ్యంగా నాగర్ కర్నూల్ జిల్లా కృష్ణ నది తీరక ప్రాంతంలో సోమశిల, సోమశిల టెంపుల్, మరియు మల్లేశ్వరం హైలాండ్, నల్లమల్ల అటవీ ప్రాంతం వంటి ప్రముఖ పర్యాటక ప్రాంతాలను ప్రపంచ స్థాయి పర్యాటక కేంద్రాలుగా అభివృద్ధి చేయడానికి సమన్వయ చర్యలు తీసుకుంటున్నామని కలెక్టర్ పేర్కొన్నారు. జిల్లా పర్యాటక శాఖ అధికారి నరసింహా 19వ తేదీ నుండి 23వ తేదీ వరకు జరిగే రోజు వారి కార్యక్రమాల వివరాలను జిల్లా అధికారులకు వివరించారు. 18వ తేదిన యువ పర్యాటక క్లబ్స్ ప్రారంభం పర్యాటక వారోత్సవాల ప్రారంభ దినోత్సవంగా యువ పర్యాటక క్లబ్స్ కార్యక్రమాన్ని నిర్వ హించి పోస్టర్ విడుదల చేయనున్నారు. విద్యా ర్థులు, యువతలో పర్యాటక అవగాహన పెంపొందించే దిశగా ఈ కార్యక్రమం ప్రారంభించబడుతుంది. 19వ తేదీన పర్యాటక అవగాహన ర్యాలీ ఁ కార్యక్రమం కృష్ణా నది పరివాహక ప్రాంతం, సోమశిల ప్రాంతాల్లో పర్యాటక అవగాహన డ్రైవ్ నిర్వహించబడుతుంది. ఈ కార్యక్రమంలో పర్యాటక ప్రాధాన్యం, స్థానిక ప్రదేశాల విలువ, మరియు పర్యాటకుల బాధ్యతలపై ప్రజలకు అవగాహన కల్పించబడుతుంది. 20వ తేదీన స్వచ్ఛత కార్యక్రమం సోమశిల టెంపుల్..... పరిసర ప్రాంతాల్లో స్వచ్ఛత కార్యక్రమాన్ని నిర్వహించనున్నారు. పర్యాటక కేంద్రాలను శుభ్రంగా ఉంచడం, పర్యావరణ పరిరక్షణ, మరియు ప్లాస్టిక్ వినియోగ తగ్గింపు పై ప్రత్యేక దృష్టి సారించబడుతుంది. స్థానిక ప్రజలు, విద్యార్థులు, స్వచ్ఛంద సంస్థలు పాల్గొననున్నారు. 21వ తేదీన వారసత్వ నడక సోమశిల టెంపుల్ పరిసరాల్లో వారసత్వ నడక (ఎవతీఝుస్త్రవ ఝెుశ్రీఎ) కార్యక్రమం నిర్వహించబడుతుంది. ఈ కార్యక్రమంలో ప్రాంతీయ చరిత్ర, ఆలయ ప్రాధాన్యం, సాంస్కృతిక వారసత్వం గురించి పర్యాటకులకు మరియు యువతకు వివరించనున్నారు. 22వ తేదీన పర్యాటక ఇన్ఫ్లూయెన్సర్లు , యూట్యూబర్ల సమావేశం మల్లేశం ఐలాండ్ ప్రదేశంలో స్థానిక పర్యాటక ఇన్ఫ్లూయెన్సర్లు, యూట్యూబర్లు, ట్రావెల్ బ్లాగర్లు పాల్గొనే ప్రత్యేక సమావేశాన్ని నిర్వహించనున్నారు. డిజిటల్ మీడియా ద్వారా తెలంగాణ పర్యాటక ప్రదేశాలను ప్రపంచానికి పరిచయం చేయడమే ఈ కార్యక్రమ లక్ష్యం. 23వ తేదీన బ్రాండ్ కిట్ పోస్టర్ విడుదల ఁ ముగింపు కార్యక్రమం పర్యాటక వారోత్సవాల ముగింపు కార్యక్రమంగా నాగర్‌కర్నూల్ లో బ్రాండ్ కిట్ పోస్టర్ విడుదల చేయనున్నారు. ఈ సందర్భంగా వారోత్సవాల ఫలితాలు, భవిష్యత్ ప్రణాళికలు, పర్యాటక అభివృద్ధి వ్యూహాలపై చర్చించబడుతుంది. ఈ కార్యక్రమంలో జిల్లా పర్యాటక శాఖ అధికారి నరసింహ, జిల్లా క్రీడా యువజన శాఖ అధికారి సీతారామ్ నాయక్,డిపిఆర్ఓ కిరణ్ కుమార్ వివిధ శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## క్యాసారం బీరప్పల జాతరలో పాల్గొన్న ఎమ్మెల్యే జిఎంఆర్ 4



**పటాన్చెరు, మే18 (నినాదం) :** గ్రామీణ ప్రాంతాలలో నిర్వహించే జాతరలు తెలంగాణ సంస్కృతి సంప్రదాయాలకు ప్రతీకలని పటాన్చెరు శాసన సభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి అన్నారు. పటాన్చెరు మండల పరిధిలోని క్యాసారం గ్రామంలో సోమవారం నిర్వహించిన బీరప్పల జాతరలో ఎమ్మెల్యే జిఎంఆర్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామి వారి కృపతో ప్రజలందరూ సుఖసంతోషాలతో ఆయురారోగ్యాలతో ఉండాలని కోరుకున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు దశరథ్ రెడ్డి, వెంకట్ రెడ్డి, కృష్ణ యాదవ్, ప్రభాకర్, ఈశ్వర్, ఆలయ కమిటీ సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

## క్రీడల వల్ల పిల్లల్లో శరీర దారుఢ్యం, మానసిక ఉల్లాసం, సోదర భావం కలుగుతాయి

కాంగ్రెస్ ఈస్ట్ ఆనంద్ బాగ్ డివిజన్ అధ్యక్షులు నోరి సత్యమూర్తి



**మల్కాజిగిరి, మే18(నినాదం) :** క్రీడల వల్ల పిల్లల్లో శరీర దారుఢ్యం,మానసిక ఉల్లాసం, సోదర భావం కలుగుతాయని, ప్రతి వ్యక్తి వికాసం లో క్రీడలు, అత్యంత ప్రాముఖ్యత ను కలిగి ఉంటాయని కాంగ్రెస్ పార్టీ ఈస్ట్ ఆనంద్ బాగ్ డివిజన్ అధ్యక్షులు నోరి సత్యమూర్తి అన్నారు. మల్కాజిగిరి మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో జరిగే వేసవి క్రీడల కోచింగ్ క్యాంపును ఈస్ట్ ఆనంద్ బాగ్ డివిజన్ మౌలాలి రైల్వే కోటర్స్ లోని బృందావన్ పార్క్ లో ఏప్రిల్ 24 నుంచి మే 31 వరకు నిర్వహిస్తున్నారు. సుమారు 40 మంది విద్యార్థులు వాలీబాల్, క్రికెట్, బ్యాడ్మింటన్, క్యారమ్స్, లలో శిక్షణ పొందుతున్నారు. ఈ వేసవి క్రీడాశిబిరంలో ఎంపికైన వారికి జిహెచ్ఎంసి స్థాయిలో జరిగే వాలీబాల్ పోటీల్లో పాల్గొనటానికి సిద్ధమవుతున్నారు. ఈ కార్యక్రమానికి నిర్వాహకుల ఆహ్వానం మేరకు కాంగ్రెస్ పార్టీ ఈస్ట్ ఆనంద్ బాగ్ డివిజన్ అధ్యక్షులు నోరి సత్యమూర్తి పాల్గొని పిల్లలకి క్రీడా పరికరాలను అందజేశారు. అనంతరం ఈ కార్యక్రమంను ప్రతి సంవత్సరం నిర్వహిస్తున్న శేఖర్ మోరే ని అభినందించారు. స్థానిక కాలనీ వాసులు శామ్యూల్ సుందర్ రాజ్, చిన్నారులకి అల్పాహారం అందజేశారు. ఈ కార్యక్రమం లో వాలీబాల్ కోచ్ షేక్ యూసఫ్ ఫిట్నెస్ కోచ్ వెంకటేష్, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

## ప్రజావాణి సమస్యల సత్వర పరిష్కారంపై దృష్టి సారించాలి

అడిషనల్ కలెక్టర్ సంగీత



**సంగారెడ్డి బ్యూరో, మే18 (నినాదం):** ప్రజావాణి లో వచ్చిన దరఖాస్తులను త్వరితగతిన పరిష్కరించే దిశగా అధికారులు దృష్టి సారించాలని అడిషనల్ కలెక్టర్ సంగీత అధికారులను ఆదేశించారు. ప్రజావాణి కార్యక్రమానికి వచ్చే ప్రతి ఫిర్యాదును బాధ్యతగా స్వీకరించి, నిర్ణీత గడువులో పరిష్కరించాలని సూచించారు. సోమవారం జిల్లా కలెక్టరేట్‌లోని గ్రీవెన్స్ హాల్‌లో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో అదిషనల్ కలెక్టర్ ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. వివిధ సమస్యలతో వచ్చిన ప్రజల నుంచి వివరాలు తెలుసుకుని, సమ స్యల పరిష్కారం కోసం సంబంధిత శాఖల అధికారులకు తగిన సూచ^నలు జారీ చేశారు. జిల్లాలో డివిజన్ వారీగా నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమాల్లో మొత్తం 80 ఫిర్యాదులు అందినట్లు అధికారులు తెలిపారు. అందులో కలెక్టరేట్‌కు 38, సంగారెడ్డి డివిజన్‌కు 12, ఆందోల్ డివిజన్‌కు 03, నారాయణఖేడ్ డివిజన్‌కు 19, జహీరాబాద్ డివిజన్‌కు 08 ఫిర్యాదులు అందినట్లు వెల్లడించారు. ఈ కార్యక్రమం లో జిల్లా అధికారులు, రెవెన్యూ అధికారులు,, మున్సిపల్ కమిషనర్లు, కలెక్టరేట్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## నిరుపేద కుటుంబానికి బియ్యం అందజేత



**దుబ్బాక, మే 18 (నినాదం) :** "రెక్కాడితే గానీ డొక్క నిండని" పరిస్థితుల్లో జీవనం సాగిస్తున్న ఓ నిరుపేద కుటుంబానికి మానవత్వంతో ముందుకొచ్చి సహాయం చేశారు సామాజిక కార్యకర్తలు. సిద్దిపేట జిల్లా దుబ్బాక మండలం గంభీర్‌పూర్ గ్రామానికి చెందిన వనం సుధాకర్ ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఈ విషాద ఘటనతో కుటుంబం ఆర్థికంగా తీవ్ర ఇబ్బందుల్లో పడింది. ఈ విషయం తెలుసుకున్న మాల మహానాడు దుబ్బాక నియోజకవర్గ కన్వీనర్ నీరటి నర్సింలు, నీరటి బుజ్జమ్మ జ్ఞాపకార్థంగా బాధిత కుటుంబాన్ని పరామర్శించి బియ్యాన్ని అందజేశారు. ఈ సందర్భంగా కుటుంబ సభ్యులను ఓదార్చిన ఆయన, ప్రభుత్వం వెంటనే స్పందించి బాధిత కుటుంబానికి అన్ని విధాలుగా సహాయం అందించాలని కోరారు. గ్రామ ప్రజలు కూడా ఈ కుటుంబానికి తోడుగా నిలవాలని ఆయన పిలుపునిచ్చారు. కష్టకాలంలో మానవత్వంతో ముందుకొచ్చిన వారిని గ్రామస్థులు అభినందించారు. ఈ కార్యక్రమంలో మ్యాదరి నర్సింలు, ఏడపోయిన లక్ష్మణ్, నేరడి శేఖర్, ప్రశాంత్, మనోహర్, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

## వికారాబాద్‌లో జొన్నల కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేయాలని కలెక్టర్‌కు ఎంపీ లేఖ



**వికారాబాద్, మే 18(నినాదం ):** రైతులు పండించిన జొన్నలను మద్దతు ధర కల్పించి ప్రభుత్వం కొనుగోలు చేయాలని కోరుతూ చేవెళ్ళ ఎం పీ విశ్వేశ్వర్ రెడ్డి వికారాబాద్ జిల్లా కలెక్టర్ దీపక్ తివారికి లేఖ వ్రాశారు. ఈ లేఖను సోమవారం జిల్లా కలెక్టర్ కు బిజెపి వికారాబాద్ అసెంబ్లీ కోఆర్డినేటర్ వడ్ల నందు అందజేశారు. వికారాబాద్ జిల్లాలో జొన్నల కొనుగోలు కేంద్రాలు ప్రారంభం కాలేదని తెలిపారు. ఈ ఆలస్యంతో రైతులు తమ పంటను సరైన ధరలకు విక్రయించలేక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, నష్టపోయే పరిస్థితుల్లో అమ్మకాలకు దిగవలసి వస్తోందని లేఖలో పేర్కొన్నారు. అదిలాబాద్ వంటి జిల్లాలలో నిర్ణయించిన షెడ్యూల్ ప్రకారం కొనుగోలు ప్రక్రియ ఇప్పటికే ప్రారంభమైందని తెలిసిందని, అక్కడి రైతులు ఎటువంటి ఇబ్బందులు లేకుండా తమ పంటను మార్కెట్ చేయగలుగుతున్నారని తెలిపారు. వికారాబాద్ జిల్లాలో జొన్నల కొనుగోలు కేంద్రాలను తక్షణమే ప్రారంభించేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని వినమ్రంగా కోరుతున్నట్లు వివరించారు. సమయానుకూల జోక్యం రైతులకు ఎంతో మేలు చేసి వారి ప్రయోజనాలను కాపాడుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో రొంపల్లి సర్పంచ్ శ్రీనివాస్ మాజీ ఎంపీటీసీ సభ్యులు శ్రీకాంత్ రెడ్డి,కౌన్సిలర్లు స్రవంతి శ్యామ్ రెడ్డి,రుచిత సాయి చరణ్ రెడ్డి,బీజే వై ఎం అధ్యక్షులు సాయిచరణ్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు

## ఘనంగా స్ప్రింగ్ ఫీల్డ్ హై స్కూల్ 1999--2000 బ్యాచ్ పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం 6




**రాజేంద్రనగర్, మే 18( నినాదం):** రాజేంద్రనగర్‌లోని స్ప్రింగ్ ఫీల్డ్ హై స్కూల్ 1999--2000 విద్యాసంవత్సరానికి చెందిన పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం అత్యంత వైభవంగా, ఆహ్లాదకరమైన వాతావరణంలో నిర్వహించబడింది. దాదాపు రెండు దశాబ్దాల సుదీర్ఘ విరామం తర్వాత సహ విద్యార్థులంతా ఒకే వేదికపైకి చేరడంతో అక్కడ పండుగ వాతావరణం నెలకొంది. ఈ కార్యక్రమానికి పూర్వ విద్యార్థులతో పాటు ఉపాధ్యాయులు హాజరయ్యారు. గురువులకు ఘన సన్మానం- మధుర స్మృతుల నెమరువేత కార్యక్రమంలో భాగంగా పూర్వ విద్యార్థులు తమకు విద్యాబుద్ధులు నేర్పిన గురువులను శాలువాలతో ఘనంగా సన్మానించి, వారి పాదాలకు నమస్కరించి ఆశీస్సులు తీసుకున్నారు. ఉపాధ్యాయులు చేసిన సేవలను, అందించిన ప్రోత్సాహాన్ని ఈ సందర్భంగా కొనియాడారు. అనంతరం విద్యార్థులు పాఠశాల రోజుల్లో గడిపిన మధురస్మృతులను, చేసిన అల్లరిని గుర్తుచేసుకుంటూ ఉపాధ్యాయులతో ఆత్మీయంగా ముచ్చటించారు. ప్రస్తుతం కొనసాగుతున్న ఉద్యోగ వ్యాపారాలు, జీవిత ప్రయాణంలో సాధించిన విజయాలను గురువులతో, స్నేహితులతో పంచుకున్నారు. పాత జ్ఞాపకాలను సాంస్కృతిక కార్యక్రమాలు, సరదా సంభాషణలు, ఆటపాటలు ఈ సమావేశానికి ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. అందరూ కలిసి దిగిన గ్రూప్ ఫోటోలు, సెల్ఫీలతో సందడి వాతావరణం కనిపించింది. ఈ కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు రాఘవేందర్ గౌడ్,మహేష్ యాదవ్,దివాకర్,వినయ్ కుమార్, రాకేష్ వర్మ,ప్రకాష్,కార్తీక్,సురేష్ బాబు, జస్వంత్,తన శేఖర్,రఘువీర్,కరుణాకర్, ప్రశాంత్ పాటిల్,మహేందర్,పంకజ్, జి. మహేష్,రాకేష్ కావలి,ప్రవీణ్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.


## మేడ్చల్ జిల్లా 10వ తరగతి టాపర్ భౌరంపేట్ విద్యార్థి లక్ష్మీనారాయణను అభినందించిన ఎమ్మెల్యే



**కుత్బుల్లాపూర్, మే 18 (నినాదం) :** రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల విడుదల చేసిన 10వ తరగతి ఫలితాల్లో మేడ్చల్ జిల్లా ప్రభుత్వ పాఠశాలల్లో జిల్లా టాపర్‌గా నిలిచిన కుత్బుల్లాపూర్ నియోజకవర్గం, దుండిగల్ సర్కిల్, భౌరంపేట్ పాఠశాల విద్యార్థి లక్ష్మీనారాయణ, దుండిగల్ మండల్ ద్వితీయ స్థానం వచ్చిన గాగిల్లపూర్ ప్రభుత్వ పాఠశాల విద్యార్థి శైలజను సోమవారం బీఆర్ఎస్ ఎల్పీ విప్, ఎమ్మెల్యే కేపీ. వివేకానంద వారిని అభినందిస్తూ శాలువాతో సన్మానించి, శుభాకాంక్షలు తెలిపారు. ప్రభుత్వ పాఠశాలలో చదివి జిల్లా టాపర్‌గా నిలవడం గర్వకారణమని కొనియాడారు. భవిష్యత్తులో మరింత కష్టపడి చదువుకొని ఉన్నత లక్ష్యాలను సాధించాలని, తల్లిదండ్రులకు, పాఠశాలకు, ప్రాంతానికి మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. అలాగే విద్యార్థిని ఈ స్థాయికి తీసుకురావడంలో కృషి చేసిన పాఠశాల ప్రధానోపాధ్యాయులు రామిరెడ్డిగారిని, భిక్షపతి గౌడ్ ను ఎమ్మెల్యే ప్రత్యేకంగా అభినందించారు. ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించడం ఆనందకరమని, ఉపాధ్యాయుల కృషి అభినందనీయమని వివరించారు. ఈ కార్యక్రమంలో భౌరంపేట్ మాజీ కౌన్సిలర్లు నర్సారెడ్డి శ్రీనివాస్ రెడ్డి, నాచారం మురళీ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

## మణికొండ సమస్యలపై జోనల్ కమిషనర్‌కు వినతిపత్రం

'ఫెడరేషన్ ఆఫ్ ఆల్ కాలనీస్ అధ్యక్షులు అర్వపల్లి వంశీ



**రాజేంద్రనగర్, మే 18 (నినాదం):** నార్సింగి సర్కిల్ మణికొండ పరిధిలోని పలు కీలకమైన పౌర సమస్యలను పరిష్కరించాలని కోరుతూ 'ఫెడరేషన్ ఆఫ్ ఆల్ కాలనీస్ మణికొండ' ప్రతినిధులు ఫెడరేషన్ అధ్యక్షులు అర్వపల్లి వంశీ నాయకత్వంలో సోమవారం సిఎమ్‌సి జోనల్ కమిషనర్ నారాయణ అమిత్, ను కలిసి స్థానిక సమస్యలపై వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మణికొండ వ్యాప్తంగా నిలిచిపోయిన రోడ్ల నిర్మాణాలు, రెగ్యులర్ రిపేర్ల అంశాన్ని కమిషనర్ దృష్టికి తీసుకెళ్లామన్నారు.ఆల్కాపూర్ టౌన్‌షిప్ రోడ్ నెంబర్ 13 బి ఆర్ సి రోడ్ వరకు,ఆల్కాపూర్ టౌన్‌షిప్ 100 ఫీట్ రోడ్, నార్సింగి రోడ్ వరకు కనెక్టివిటీ రోడ్లను వెంటనే ప్రారంభించాలని కోరమన్నారు. లింక్ రోడ్లు అందుబాటులోకి వస్తే మణికొండలో ట్రాఫిక్ సమస్యలు తగ్గడంతో పాటు, ప్రజలకు మెరుగైన రవాణా సౌకర్యం లభిస్తుందని వివరించారు. మర్రిచెట్టు నుండి ట్రయల్స్ విల్లాస్ రోడ్, ఆంధ్రా బ్యాంక్ పైప్‌లైన్ రోడ్ నుండి షేక్‌పేట్ వైపు ఉన్న పెండింగ్ రోడ్డు పనులను వేగవంతం చేయాలని కోరారు. నాలాల పనులు, పార్కుల అభివృద్ధి మణికొండ వ్యాప్తంగా పందెం వాగు , తారామతి బరాదరి వరకు నాలాల శుభ్రపరిచే పనులతో పాటు, డ్రైనేజ్ కల్వర్ట్ పనులను చేపట్టాలని విజ్ఞప్తి చేశారు. వీటితో పాటు హైడ్రా పరిరక్షణలో ఉన్న తిరుమల హిల్స్ పార్క్ స్థలాన్ని ప్రజలకు ఉపయోగపడేలా అభివృద్ధి చేయాలన్నారు. ఫెడరేషన్ విజ్ఞప్తులపై జోనల్ కమిషనర్ నారాయణ అమిత్ సానుకూలంగా స్పందించారు. మణికొండ వ్యాప్తంగా రిపేర్లను సిఎమ్‌సి నిరంతరం చేపడుతుందని స్పష్టం చేశారు. ఎక్కడైనా అత్యవసరంగా రోడ్డు రిపేర్లు అవసరమైతే ఆ వివరాలను వెంటనే అధికారుల దృష్టికి తీసుకురావాలని సూచించారు. ఈ సమావేశంలో ఫెడరేషన్ వైస్ ప్రెసిడెంట్ ప్రవీణ, జాయింట్ సెక్రటరీలు శంకర్ దేవ్, కృష్ణ కుమార్, ఈసీ సభ్యులు డా. పి. అవినాష్, డి. శ్రీనివాస్ రెడ్డి, రామయ్య, ఎర్రన్న, తదితరులు పాల్గొన్నారు.


## కొంపల్లి ఆర్మీ భూముల ఆక్రమణపై అకుల సతీష్ బృందం ఫిర్యాదు



**కుత్బుల్లాపూర్, మే 18 (నినాదం) :** మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా దుండిగల్ మండలం కొంపల్లి గ్రామ పరిధిలోని సర్వే నెంబర్ 100లో ఉన్న ఆర్మీ ప్రభుత్వ భూములపై జరిగిన అక్రమ ఆక్రమణల విషయమై అకుల సతీష్, ఆయన బృందం జిల్లా కలెక్టర్ కు ఫిర్యాదు అందజేశారు.సుమారు 776 ఎకరాల ఆర్మీ భూమిలో దాదాపు 3.6 ఎకరాలను కొంతమంది వ్యక్తులు నకిలీ పత్రాలు, తప్పుడు రికార్డులు సృష్టించి ఆక్రమించుకున్నారని ఫిర్యాదులో పేర్కొన్నారు. ఆక్రమణదారులు కాంపౌండ్ వాల్స్, అంతర్గత రోడ్లు, విద్యుత్ స్తంభాలు ఏర్పాటు చేసి అక్రమ వెంచర్‌గా అభివృద్ధి చేస్తున్నారని ఆరోపించారు. ఈ వ్యవహారంలో కొంతమంది రెవెన్యూ, జి హెచ్ ఎం సి, విద్యుత్ శాఖ అధికారుల నిర్లక్ష్యం లేదా సహకారం ఉన్నట్లు అనుమానాలు వ్యక్తం చేస్తూ పూర్తి స్థాయి విచారణ చేపట్టాలని కోరారు. గతంలో ఈ అంశంపై ఫిర్యాదులు చేసినప్పటికీ ఎలాంటి చర్యలు తీసుకోలేదని, ప్రస్తుతం బయటపడుతున్న వివరాల ప్రకారం కొంతమంది ఎమ్మెల్యే అనుచరుల ప్రమేయం ఈ భూ స్కామ్‌లో ఉన్నట్లు ఆరోపణలు వస్తున్నాయని తెలిపారు. ఒక ఎమ్మెల్యే సహకారం లేకుండా ఇంత పెద్ద స్థాయిలో ఆర్మీ భూముల ఆక్రమణ జరగడం సాధ్యం కాదని నల్ల జై శంకర్ గౌడ్, అకుల సతీష్ పేర్కొన్నారు. ఆర్మీ, రెవెన్యూ, జి హెచ్ ఎం సి, సర్వే శాఖలతో కలిసి వెంటనే జాయింట్ సర్వే నిర్వహించి, ఆక్రమణకు పాల్పడిన వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. అక్రమ నిర్మాణాలను తొలగించి భూమిని తిరిగి ఆర్మీ శాఖకు అప్పగించాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో పులి బాలరాం, మనీష్, నాగరాజ్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు. దేశ రక్షణకు సంబంధించిన ఆర్మీ భూముల ఆక్రమణ, జాతీయ భద్రతకు సంబంధించిన అంశమని పేర్కొంటూ, బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని కోరారు.

## ఉస్మాన్ నగర్ బీఈమ్యాక్ సొసైటీ ప్రజలకు ఇంప్రూవ్మెంట్ చార్జీలు తగ్గించండి

జలమండలి ఎండి అశోక్ రెడ్డిని కోరిన ఎమ్మెల్యే జిఎంఆర్



**పటాన్చెరు, మే18(నినాదం) :** తెల్లాపూర్ డివిజన్ పరిధిలోని ఉస్మాన్ నగర్ లో గల బిహెచ్ఇఎల్ బీఈమ్యాక్ సొసైటీ కాలనీవాసులకు మంచినీటి కనెక్షన్ల కోసం వసూలు చేస్తున్న ఇంప్రూవ్మెంట్ చార్జీలను తగ్గించాలని కోరుతూ జలమండలి ఎండి అశోక్ రెడ్డిని పటాన్చెరు శాసనసభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి విజ్ఞప్తి చేశారు.. సోమవారం హైదరాబాద్లోని జలమండలి కార్యాలయంలో ఎండి అశోక్ రెడ్డితో ఎమ్మెల్యే జిఎంఆర్ సమావేశమయ్యారు. ఈ సందర్భంగా నియోజకవర్గ పరిధిలో జలమండలి ద్వారా చేపడుతున్న మంచినీటి సరఫరా, రిజర్వాయర్లు, నూతన కనెక్షన్లపై చర్చించారు. ప్రధానంగా తెల్లాపూర్ డివిజన్ పరిధిలోని ఉస్మాన్ నగర్ లో బిహెచ్ఎల్ పరిశ్రమలో విధులు నిర్వర్తించి.. రిటైర్మెంట్ అయిన అనంతరం బిఈమెక్ సొసైటీ పేరుతో గృహాలను నిర్మించుకొని జీవనం కొనసాగిస్తున్నారని తెలిపారు. ఇటీవల మంచినీటి కనెక్షన్ల కోసం జలమండలికి దరఖాస్తు చేసుకోగా.. మూడు కోట్ల రూపాయలు చెల్లించాలని ఇందులో 64 లక్షల రూపాయలు ఇంప్రూవ్మెంట్ చార్జీలు కట్టాలని నోటీసులు అందజేశారని తెలిపారు. ఇప్పటికే మూడు కోట్ల రూపాయలను డిడి రూపంలో జలమండలికి చెల్లించడం జరిగిందని తెలిపారు. ప్రస్తుతం కాలనీలో అత్యధిక శాతం ఉద్యోగ విరమణ పొందిన కార్మికులు నివసిస్తున్నారని.. ఇంప్రూవ్మెంట్ చార్జీలు చెల్లించే ఆర్థిక పరిస్థితులు వారికి లేవని ఆయన తెలిపారు. మానవత దృక్పథంతో ఇంప్రూవ్మెంట్ చార్జీలను రద్దుచేసి నల్ల కనెక్షన్లను మంజూరు చేయాలని విజ్ఞప్తి చేశారు. ఇందుకు సానుకూలంగా స్పందించిన ఎండి అశోక్ రెడ్డి అతి త్వరలో వీటికి సంబంధించి నిర్ణయం తీసుకోనున్నట్టు తెలిపారు. ఈ సమావేశంలో మాజీ ప్రజా ప్రతినిధులు ఉమేష్, బీఈమ్యాక్ అధ్యక్షులు సంజీవ్ ప్రసాద్, ఉపాధ్యక్షులు మాధవరావు, సంయుక్త కార్యదర్శి ప్రభాకర్ రెడ్డి, ప్రతినిధులు వాసుదేవరావు, సందీప్ రెడ్డి, సూర్య తదితరులు పాల్గొన్నారు.

నినాదం
తెలంగాణ ప్రాంతీయం
నిఖార్సైన జర్నలిజం
మంగళవారం, తెలంగాణ
19 మే 2026

## నివాసాలపై ప్రమాదకర విద్యుత్ వైర్లు తొలగించాలని ఎస్ ఈ, డిఈలకు విజ్ఞప్తి



**అమరచింత, మే 18, (నినాదం):** అమరచింత మునిసిపాలిటీ కేంద్రంలోని శ్రీకృష్ణ నగర్ లో ప్రమాదకర విద్యుత్ వైర్లను తొలగించాలని బీ ఆర్ఎస్ మూడవ వార్డు కౌన్సిలర్ తిరుమలేష్ సోమవారం జిల్లా కేంద్రంలోని ఎస్ ఈ తిరుపతిరావు, డీ.ఈ వెంకట శివరాం లను కలిసి విజ్ఞప్తి చేశారు. శ్రీకృష్ణ నగర్ లో గత కొన్ని సంవత్సరాలుగా కాలనీలోని నివాసాలపై 11 కె.వి విద్యుత్ వైర్లు ప్రమాదకరంగా కిందికి వేలాడుతున్నాయని అన్నారు. ఈ విద్యుత్ వైర్ల వల్ల అనేక ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయని విద్యుత్ వైర్లు ఇక్కడి నుంచి తొలగించాలని పలుమార్లు సంబంధిత అధికారులను కోరిన ఫలితం లేకుండా పోయిందని తిరుమలేష్ ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా అధికారులు వీటిని తొలగించాలని ఎస్ ఈ, డి ఈ ల కు వినతి పత్రం అందించినట్లు తిరుమలేష్ తెలిపారు.

## 20 ఏళ్ల తర్వాత మళ్లీ కలిసిన పూర్వ విద్యార్థులు

### శాంతినికేతన్ పాఠశాలలో పాత జ్ఞాపకాలకు కొత్త వెలుగు



**డోర్నకల్ /మరిపెడ మే 18(నినాదం):** మరిపెడ మండలం మున్సిపాలిటీ కేంద్రంలో శాంతినికేతన్ పాఠశాలలో 20 సంవత్సరాల క్రితం పదవ తరగతి చదివిన పూర్వ విద్యార్థులు ఈరోజు ఆత్మీయ సమ్మేళనం నిర్వహించి.పాత జ్ఞాపకాలను మరోసారి గుర్తు చేసుకున్నారు. కాలం ఎంత దూరం చేసినా, పాఠశాల అనుబంధం మాత్రం ఎప్పటికీ చెదరదని ఈ కార్యక్రమం మరోసారి నిరూపించింది.ఉద్యోగాలు, వ్యాపారాలు, కుటుంబ బాధ్యతలతో దేశంలోని వివిధ ప్రాంతాల్లో స్థిరపడిన పూర్వ విద్యార్థులు ఎంతోకాలం తర్వాత ఒకే వేదికపై కలుసుకోవడంతో పాఠశాల ప్రాంగణం భావోద్వేగాలతో నిండిపోయింది.ఒకప్పుడు కలిసి చదివిన తరగతి గదులు, ఆడుకున్న మైదానాలు, ఉపాధ్యాయుల సూచనలు, చిన్న చిన్న అల్లర్లు అన్నీ ఒక్కసారిగా వారి కళ్లముందు మెదిలాయి.ఈ సందర్భంగా విద్యార్థులు తమ పాత ఫోటోలు చూసుకుంటూ ఆనాటి మధుర జ్ఞాపకాలను పంచుకున్నారు.కొందరు తమ జీవిత ప్రయాణాలను వివరించగా, మరికొందరు పాఠశాల తమ జీవితానికి వేసిన బలమైన పునాదులను గుర్తు చేసుకున్నారు.గురువుల పట్ల కృతజ్ఞతాభావం వ్యక్తం చేస్తూ వారికి సన్మానం నిర్వహించారు.స్నేహం కాలంతో తగ్గిపోదు కలిసే సందర్భాలు మాత్రమే తగ్గిపోతాయి అని పలువురు భావోద్వేగానికి గురయ్యారు.20 ఏళ్ల తర్వాత కలుసుకున్నా, మళ్లీ అదే పాత రోజుల ఆనందం కనిపించిందని వారు పేర్కొన్నారు.సాంస్కృతిక కార్యక్రమాలు, జ్ఞాపికల అందజేత, గ్రూప్ ఫోటోలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. భవిష్యత్తులో ప్రతి సంవత్సరం ఇలాంటి సమావేశాలు నిర్వహించాలని పూర్వ విద్యార్థులు నిర్ణయించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు యాదయ్య,రామచంద్రయ్య, అశోక్,విశ్వనాద్,వీరన్న, మోమిన్,రమేష్, పూర్వ విద్యార్థిని, విద్యార్థులు పాల్గొన్నారు.

## ధాన్యం కొనుగోలు ప్రక్రియను వేగవంతంగా కొనసాగించాలి

### జిల్లా అదనపు కలెక్టర్ వినోద్‌కుమార్ ఆదేశం





**వనపర్తి ప్రతినిధి, మే18 (నినాదం):** రైతులు ఎక్కువసేపు కొనుగోలు కేంద్రాల్లో వేచి ఉండాల్సిన పరిస్థితి రాకుండా వరి ధాన్యం కొనుగోలు ప్రక్రియను వేగవంతంగా కొనసాగించాలని అదనపు కలెక్టర్ (రెవెన్యూ) వినోద్ కుమార్ ఆదేశించారు. సోమవారం జిల్లా అదనపు కలెక్టర్ వినోద్ కుమార్ వనపర్తి మండలం చిట్యాల వ్యవసాయ మార్కెట్ యార్డ్‌లోని వరి కొనుగోలు కేంద్రాలను సందర్శించి కొనుగోలు ప్రక్రియను పరిశీలించారు. కేంద్రాలలో రైతుల నుంచి వరి సేకరణ, తూకం, రికార్డుల నిర్వహణ తదితర అంశాలను పరిశీలించి అధికారులతో మాట్లాడారు.ఈ సందర్భంగా కొనుగోలు కేంద్రాల ఇన్‌చార్జిలకు అదనపు కలెక్టర్ పలు కీలక సూచనలు చేశారు. వరి కొనుగోలు ప్రక్రియను మరింత వేగవంతం చేయాలని, రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. కొనుగోలు చేసిన వరిని వెంటనే కేటాయించిన రైస్ మిల్లులు లేదా గోదాములకు తరలించేలా సమన్వయంతో పనిచేయాలని సూచించారు.రైతులు ఎక్కువసేపు కొనుగోలు కేంద్రాల్లో వేచి ఉండాల్సిన పరిస్థితి రాకుండా అన్ని ఏర్పాట్లు చేయాలని, వేగవంతంగా వరి ధాన్యం కొనుగోళ్ల ప్రక్రియను కొనసాగించాలన్నారు. ప్రతి దశలో పారదర్శకత పాటించాలని అదనపు కలెక్టర్ స్పష్టం చేశారు.

# పారిశుద్ధ్య కార్మికులకు కనీస వేతనాలు అమలు చేయాలి

### జిల్లా కలెక్టర్, లేబర్ కమిషనర్‌కు ఏఐటీయూసీ వినతి



గ్రామపంచాయతీ సిబ్బందికి చట్టబద్ధ హక్కులు కల్పించాలని డిమాండ్

**నల్లబెల్లి, మే 18 (నినాదం):** వరంగల్ జిల్లా నల్లబెల్లి మండలం,గ్రామపంచాయతీల్లో పనిచేస్తున్న పారిశుద్ధ్య సిబ్బందిని పూర్తి స్థాయి కార్మికులుగా గుర్తించి కనీస వేతన చట్టాన్ని అమలు చేయాలని కోరుతూ ఏఐటీయూసీ అనుబంధ గ్రామపంచాయతీ పారిశుద్ధ్య సిబ్బంది సంఘం నాయకులు అధికారులను ఆశ్రయించారు. ఈ మేరకు వరంగల్ జిల్లా కలెక్టర్ కార్యాలయంలో ఏవోకు, లేబర్ కమిషనర్ కార్యాలయ అధికారికి వినతిపత్రాలు సమర్పించారు. తెలంగాణ రాష్ట్రవ్యాప్తంగా గ్రామపంచాయతీల్లో ఆన్‌లైన్ పారిశుద్ధ్య సిబ్బందిగా పనిచేస్తున్న ఎంపీడబ్ల్యూలకు కేవలం రూ.9,500 గౌరవ వేతనం మాత్రమే అందుతుండగా, ఆఫ్‌లైన్ సిబ్బందికి రూ.5 వేల నుంచి రూ.7 వేల వరకు మాత్రమే చెల్లిస్తున్నారని నాయకులు తెలిపారు. పెరుగుతున్న ధరలు, కుటుంబ పోషణ, పిల్లల చదువులు, వైద్య ఖర్చులకు ఈ వేతనాలు సరిపోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు.పారిశుద్ధ్య కార్మికులు ప్రతిరోజూ గ్రామాల్లో చెత్త సేకరణ, కాలువల శుభ్రత, మురుగునీటి పారుదల వంటి ప్రమాదకర పనులు చేస్తున్నప్పటికీ వారికి తగిన భద్రతా పరికరాలు, వైద్య సదుపాయాలు అందడం లేదని పేర్కొన్నారు. విధి నిర్వహణలో ప్రమాదాలు జరిగినప్పుడు వైద్య ఖర్చులు భరించాల్సిన పరిస్థితి వస్తోందని, విశ్రాంతి సెలవులు, జీతభత్యాలతో కూడిన విశ్రాంతి వంటి కనీస హక్కులు కూడా అమలు కావడం లేదని ఆరోపించారు. పండుగలు, జాతరలు, ప్రత్యేక సందర్భాల్లో అదనపు పనిభారం మోస్తున్నప్పటికీ అదనపు వేతనం చెల్లించడం లేదని నాయకులు వాపోయారు. కొన్ని గ్రామపంచాయతీల్లో ఆదివారం సెలవు కూడా ఇవ్వడం లేదని తెలిపారు. నల్లబెల్లి గ్రామపంచాయతీలో ఇద్దరు ఆన్‌లైన్ కార్మికులకు తీర్మానం లేదనే కారణంతో కేవలం రూ.7 వేలే చెల్లిస్తున్నారని ఆరోపించారు. అనేక గ్రామపంచాయతీల్లో నెలల తరబడి వేతనాలు పెండింగ్‌లో ఉండటం వల్ల కుటుంబాలు ఆర్థికంగా తీవ్ర ఇబ్బందులుఎదుర్కొంటున్నాయని అన్నారు. గ్రామపంచాయతీ పారిశుద్ధ్య సిబ్బందిని కార్మికులుగా గుర్తిస్తూ కార్మిక చట్టాలను పూర్తిస్థాయిలో అమలు చేయాలని, కనీస వేతనాల ప్రకారం నెలకు రూ.21 వేల జీతం చెల్లించాలని వారు డిమాండ్ చేశారు. అదనపు పనులకు అదనపు వేతనం, ప్రమాదాల సమయంలో వైద్య ఖర్చులు, విధి విరమణ సమయంలో భద్రతా ప్రయోజనాలు కల్పించేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ, గ్రామాల పరిశుభ్రతకు పారిశుద్ధ్య కార్మికులే వెన్నెముక అని పేర్కొన్నారు. కరోనా కాలంలో ప్రాణాలను పణంగా పెట్టి పనిచేసిన కార్మికులకు ఇప్పటికీ తగిన గుర్తింపు, లభించడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం వెంటనే స్పందించి పారిశుద్ధ్య కార్మికుల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో చింతకింది కుమారస్వామితో పాటు మామిడిపల్లి సంపత్, శనిగరం చిరంజీవి, మామిడిపల్లి రవి, దండెం రాజు, అంబి రాజు, జన్ను సుదర్శన్, కొత్తపల్లి సదయ్య, పి.యశోద, జి.స్వప్న తదితరులు పాల్గొన్నారు.

# జనగణన--2027లో పారదర్శకతకు ప్రాధాన్యం ఇవ్వాలి





- క్షేత్రస్థాయిలో నమోదు ప్రక్రియను పరిశీలించిన రాష్ట్ర జనగణన డైరెక్టర్ భారతి హోలికెరీ

**హనుమకొండ, మే 18,(నినాదం):** జనగణన--2027 ప్రక్రియను పారదర్శకంగా, ఖచ్చితత్వంతో నిర్వహించాలని రాష్ట్ర జనగణన డైరెక్టర్ భారతి హోలికెరీ సూచించారు. సోమవారం హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్‌పాయితో కలిసి హనుమకొండలోని ఎక్సైజ్ కాలనీ ప్రాంతంలో క్షేత్రస్థాయిలో జరుగుతున్న హౌస్ లిస్టింగ్, డిజిటల్ మ్యాపింగ్, గృహాల నమోదు ప్రక్రియను ప్రత్యక్షంగా పరిశీలించారు.ఈ సందర్భంగా ఎన్యూమరేటర్లు, సూపర్‌వైజర్లు ఇంటింటికి వెళ్లి సేకరిస్తున్న వివరాలను సమీక్షించారు. కుటుంబ సభ్యుల వివరాలు, నివాస గృహాల సమాచారం, ప్రాంతాల వారీ నమోదు విధానం, డిజిటల్ పరికరాల వినియోగం తదితర అంశాలను పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. ఏ ప్రాంతానికి చెందిన సమాచారం ఆ ప్రాంతానికి సంబంధించిన కుటుంబాల ఆధారంగా ఖచ్చితంగా నమోదు కావాలని పేర్కొన్నారు.జనగణనలో నమోదు చేసే ప్రతి సమాచారం దేశ ప్రణాళికా రూపకల్పనకు కీలకమని తెలిపారు. అందువల్ల వివరాల నమోదు సమయంలో ఎలాంటి పొరపాట్లు చోటుచేసుకోకుండా ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని సూచించారు. ప్రజలతో మర్యాదపూర్వకంగా వ్యవహరిస్తూ పూర్తి సమాచారం సేకరించాలని ఎన్యూమరేటర్లకు సూచించారు.ప్రతి కుటుంబానికి సంబంధించిన వివరాలు సమగ్రంగా నమోదు కావాలని, ఎలాంటి పొరపాట్లు లేదా సమాచార లోపాలు చోటుచేసుకోకుండా అధికారులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని సూచించారు. అదేవిధంగా క్షేత్రస్థాయిలో పనిచేస్తున్న ఎన్యూమరేటర్లు, సూపర్‌వైజర్లు పూర్తి అవగాహనతో విధులు నిర్వహించాలని, డిజిటల్ మ్యాపింగ్ ప్రక్రియను సమర్థవంతంగా అమలు చేయాలని తెలిపారు. జనగణన ప్రక్రియ విజయవంతానికి ప్రజల సహకారం కూడా అత్యంత అవసరమని పేర్కొన్నారు. హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్‌పాయి మాట్లాడుతూ జిల్లాలో జనగణన ప్రక్రియను సమర్థవంతంగా నిర్వహించేందుకు నిరంతర పర్యవేక్షణ కొనసాగిస్తున్నామని తెలిపారు. సిబ్బందికి క్షేత్రస్థాయిలో శిక్షణ అందిస్తూ డిజిటల్ మ్యాపింగ్, గృహాల నమోదు ప్రక్రియను పారదర్శకంగా అమలు చేస్తున్నామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఓ సత్యనారాయణ రెడ్డి, హనుమకొండ ఎమ్మార్వో రవీందర్ రెడ్డి, మున్సిపల్ అధికారులు బిర్రు శ్రీను, జనగణన విభాగ సిబ్బంది, ఎన్యూమరేటర్లు, సూపర్‌వైజర్లు తదితరులు పాల్గొన్నారు.

## ఆర్డీవోను మర్యాదపూర్వకంగా కలిసిన బార్ అసోసియేషన్ ప్రతినిధులు

**మిర్యాలగూడ మే 18 (నినాదం ):** మిర్యాలగూడ డివిజన్ నూతన రెవెన్యూ డివిజనల్ అధికారి ఎస్. రమణారెడ్డిని మిర్యాలగూడ బార్ అసోసియేషన్ ప్రతినిధులు సోమవారం మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు.బార్ అసోసియేషన్ అధ్యక్షులు గౌరు వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో ఆర్డీవో కార్యాలయంలో ఆయనను కలిసి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా నూతన ఆర్డీవో కి బార్ అసోసియేషన్ తరపున పూల మొక్కను అందించి ఘనంగా సత్కరించారు. అనంతరం డివిజన్ పరిధిలోని పలు అంశాలపై వారితో కాసేపు ముచ్చటించారు. ఈ కార్యక్రమంలో జనరల్ సెక్రెటరీ జంగిలి ఎల్లయ్య, ఉపాధ్యక్షుడు ఈసరం కరుణాకర్,జాయింట్ సెక్రెటరీ రాయారపు భాస్కర్,కోశాధికారి రెడ్డిపల్లి సైదులు తదితరులు పాల్గొన్నారు.

## అనుమానాస్పద స్థితిలో వ్యక్తి మృతి : కేసు నమోదు

**కమలాపూర్ మే 18 (నినాదం):** ట్రాక్టర్ డ్రైవర్ గా పనిచేస్తున్న మాదారపు సురేష్ (40) అనే వ్యక్తి అనుమానాస్పద స్థితిలో మృతి చెందారని స్థానిక సి ఐ పి నవీన్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం మండలంలోని అంబాల గ్రామానికి చెందిన మాదారపు సురేష్ అనే వ్యక్తి ట్రాక్టర్ డ్రైవర్ గా అదే గ్రామానికి చెందిన బోయిని శ్రీకాంత్ దగ్గర పనిచేస్తున్నాడని తెలిపారు.ఆదివారం ఉదయం డ్రైవర్ పని కోసం వెళ్లి రోజు లాగా ఇంటికి తిరిగి రాలేదు. దింతో కుటుంబ సభ్యులు సురేష్ కోసం వెతకడం మొదలు పెట్టారు. అదే రోజు సుమారు రాత్రి 10గంటలకు పెరుకపల్లి గ్రామ శివారులో గల మామిడి తోటలో అనుమానస్పదంగా మృతి చెంది ఉన్నాడు.మృతుడిని పరిశీలించగా ముక్కు నుండి రక్తం కారుతూ ఎడమ కాలు విరిగిపోయి ఉండడం గమనించారు. దింతో మృతుడి భార్య మాదారపు సుమలత తన భర్త సురేష్ అనుమానాస్పదంగా మృతి చెంది ఉన్నాడనే ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సి ఐ తెలిపారు. మృతుడికి భార్య ,ఇద్దరు కూతుళ్లు, ఒక కుమారుడు ఉన్నారు.

## మొక్కజొన్న కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించిన మార్కెట్ కమిటీ చైర్మన్

**చింతపల్లి, మే 18( నినాదం):** మండల కేంద్రంలోని ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం మార్క్‌ఫెడ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మొక్కజొన్న కొనుగోలు కేంద్రాన్ని సోమవారం మాల్ మార్కెట్ కమిటీ చైర్మన్ దొంతం అలివేలు సంజీవ రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రైతులు తమ మొక్కజొన్న పంటను కొనుగోలు కేంద్రాలకు తీసుకువచ్చి, ప్రభుత్వం కల్పిస్తున్న అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధర ప్రకారం క్వింటాల్‌కు రూ.2400 చెల్లించనున్నట్లు తెలిపారు. పిఎసిఎస్ చైర్మన్ లింగంపల్లి వెంకటయ్య మాట్లాడుతూ రైతులు మధ్యవర్తులను ఆశ్రయించకుండా నేరుగా కొనుగోలు కేంద్రాల్లోనే ధాన్యం విక్రయించాలని కోరారు. ఈ కార్యక్రమంలో తాసిల్దార్ పండాల విజయలక్ష్మి, మండల వ్యవసాయ శాఖాధికారి శ్రవణ కుమారి, వ్యవసాయ సాంకేతిక నిర్వహణ సంస్థ అధ్యక్షుడు అంగిరేకుల నాగభూషణం, స్థానిక సర్పంచ్



కాసారపు శ్వేతా శ్రీనివాస్, మార్కెట్ కమిటీ సెక్రటరీ వేణు కుమార్, పిఎసిఎస్ సీఈవో రాజశేఖర్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ జిల్లా అధికార ప్రతినిధి వచ్చేలా యాదగిరి, రెవెన్యూ ఇన్స్పెక్టర్ జి. సునీత, డైరెక్టర్లు ఎండి. ముషావర్, హనుమా నాయక్, ఏ ఈ ఓ. కలకొండ శ్రీలత, నల్ల రఘు రెడ్డి, తదితరులు పాల్గొన్నారు

## పరిశ్రమలో ప్రమాదాలు జరిగినప్పుడు అప్రమత్తంగా ఉండాలి

### జిల్లా కలెక్టర్ చంద్రశేఖర్



**నల్గొండ ప్రతినిధి మే 18 (నినాదం) :** ప్రమాదాలు సంభవించినప్పుడు మనల్ని మనం రక్షించుకుంటూనే ఎదుటివారిని కాపాడాల్సిన అవసరం ఉందని జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్ అన్నారు. సోమవారం నల్గొండ జిల్లా, చిట్యాల మండలం పిట్టంపల్లి గ్రామపంచాయతీ పరిధిలోని వియాష్ సైంటిఫిక్ లిమిటెడ్ కంపెనీ (సైమ్ ల్యాబ్స్) లో నిర్వహించిన "మాక్ డ్రిల్" నమూనా విన్యాసానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. జాతీయ విపత్తుల నిర్వహణ సంస్థ ఆదేశాల మేరకు రాష్ట్ర విపత్తుల నిర్వహణ రాష్ట్రంలోని అన్ని జిల్లాలలో వరదలు, అటవీ అగ్ని ప్రమాదాలు, పారిశ్రామిక ప్రమాదాలు సంభవించినప్పుడు జిల్లా యంత్రాంగాల ప్రతిస్పందన, సంసిద్ధతపై వివిధ జిల్లాలలో సంసిద్ధత కార్యక్రమాలను నిర్వహిస్తున్నది. ఇందులో భాగంగా నల్గొండ జిల్లా పారిశ్రామిక ప్రమాదాల ప్రతిస్పందన, సంసిద్ధతకు ఎంపిక కాగా, ఈ నమూనా కార్యక్రమాన్ని పిట్టంపల్లి గ్రామపంచాయతీ పరిధిలోని వియాస్ సైంటిఫిక్ లిమిటెడ్ కంపెనీలో నిర్వహించడం జరిగింది. నమూనా విన్యాసాన్ని పరిశీలించిన అనంతరం జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ పరిశ్రమలలో ప్రమాదాలు సంభవించినప్పుడు సంబంధిత కంపెనీ తక్షణమే స్పందించాలని, ఫైర్, వాటర్, వైద్య ఆరోగ్య శాఖల బృందాలు నిర్దేశించిన సమయంలో అప్రమత్తం కావాలన్నారు. ఒకరికొకరు సహకరించుకుంటూ వారిని వారు కాపాడుకుంటూనే ,తోటి వారిని కాపాడుకోవాల్సిన అవసరం ఉందన్నారు. ప్రమాదాల సమయంలో అత్యవసర ప్రతిస్పందనతో పాటు, పరిస్థితులను ఎదుర్కొనేందుకు సంసిద్ధంగా ఉండడం, తద్వారా వ్యవస్థలను బలోపేతం చేసేందుకు నమూనా విన్యాసాలు ఉపయోగపడతాయన్నారు. దీని ద్వారా పరిశ్రమలలో ప్రమాదాలు సంభవించినప్పుడు ఉద్యోగులను ఏ విధంగా సంరక్షించుకోవాలో తెలుస్తుందని చెప్పారు. ఇలాంటి విన్యాసాల వల్ల ప్రమాదాలు సంభవించినప్పుడు చనిపోయేవారి సంఖ్యను పూర్తిగా తగ్గించడంతోపాటు, ప్రమాదంలో గాయపడిన వారికి తక్షణ వైద్య చికిత్సలను అందించవచ్చని, తద్వారా సంఘటన సంభవించినప్పుడు ఎంతవరకు సిద్ధంగా ఉన్నామనే విషయం అర్థం అవుతుందన్నారు. ఇన్స్పెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీస్ శ్రీదేవి, పరిశ్రమల శాఖ జిల్లా మేనేజర్ సతీష్, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ పుట్ల శ్రీనివాస్, డిప్యూటీ డిఎంహెచ్ డాక్టర్ వేణుగోపాల్ రెడ్డి, జిల్లా అగ్నిమాపక శాఖ అధికారి, ఇతర సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

## ఉద్యమకారులందరిని గుర్తించాలి

### ఉద్యమకారుల ఫోరం



**మిర్యాలగూడ మే 18( నినాదం ):** తొలి దశ,మలిదశ తెలంగాణ ఉద్యమంలో పాల్గొన్న ఉద్యమకారులు అందర్నీ ప్రభుత్వం గుర్తించి తగిన గుర్తింపు ఇచ్చి ప్రోత్సహించాలని తెలంగాణ ఉద్యమకారుల ఫోరం నాయకులు డాక్టర్ రాజు, మారం శ్రీనివాస్, తాళ్లపల్లి రవి మాలోతు దశరథ నాయక్ లు కోరారు. సోమవారం మిర్యాలగూడలోని అమరవీరుల స్థూపం వద్ద తెలంగాణ ఉద్యమకారుల ఫోరం ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా తెలంగాణ ఉద్యమకారులను గుర్తించేందుకు రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్,ప్రభుత్వ సలహాదారు కేశవరావు, అద్దంకి దయాకర్, రాములు నాయక్ ఆధ్వర్యంలో కమిటీని ఏర్పాటు చేయడం హర్షనియమని తెలిపారు. ఉద్యమకారులను గుర్తించేందుకు ఏర్పాటు చేసిన కమిటీ రాష్ట్రవ్యాప్తంగా పర్యటించి ఉద్యమంలో ప్రాణాలర్పించిన వారికి ఉద్యమం ఉధృతం కావడానికి కారకులైన ఉద్యమకారులందరిని గుర్తించి తగిన ప్రోత్సాహంతో పాటు ఇళ్ల స్థలాలు ఇండ్లు ప్రభుత్వ ఉద్యోగం ఇవ్వాలని కోరారు. గత ప్రభుత్వం తెలంగాణ ఉద్యమకారులను నిర్లక్ష్యం చేసిందని ప్రస్తుత ప్రభుత్వం ఉద్యమకారులను గుర్తించేందుకు కమిటీ ఏర్పాటు చేయడం ఉద్యమకారులను ప్రోత్సహించినట్లేనని అన్నారు. కొత్తగా ఏర్పాటుచేసిన కమిటీ తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా పర్యటించి అన్ని వర్గాల ప్రజలు ,ఉద్యమకారులతో చర్చించి ఉద్యమకారుల డిమాండ్లను పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని కోరారు. తెలంగాణ ఉద్యమంలో అన్ని వర్గాల ప్రజలు భాగస్వామ్యం అయ్యారని వారందరికీ తగిన గుర్తింపు ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో తెలంగాణ ఉద్యమకారుల ఫోరం నాయకులు బంటు వెంకటేశ్వర్లు ,మాడుగుల శ్రీనివాస్, కళాకారులు దారం మల్లేష్ యాదవ్ ,నకిరేకంటి కిరణ్ కుమార్ ,ఆర్టీసీ ఉద్యోగులు పాండురంగయ్య ,ఇక్బాల్, దేగ వీటి ,కొత్త వెంకటేష్, రేపాల పురుషోత్తం రెడ్డి,తెలంగాణ జర్నలిస్టు ఫోరం నాయకులు సీనియర్ జర్నలిస్టులు మహమ్మద్ అస్లాం ,సైదులు తొలి దశ ఉద్యమకారులు చీరెళ్ళ సత్యనారాయణ,విజయకుమార్ ,కృష్ణమూర్తి, గుండు శ్రీరాములు గౌడ్, తదితరులు పాల్గొన్నారు.

మంగళవారం, తెలంగాణ
19 మే 2026
నినాదం
తెలంగాణ ప్రాంతీయం
నిఖార్సైన జర్నలిజం

# గుండెపుడిలో పలువురిని పరామర్శించిన మాజీ మంత్రి



**డోర్నకల్ /మరిపెడ మే 18(నినాదం)**
మరిపెడ మండలం గుండెపూడి గ్రామానికి చెందిన బిఆర్ఎస్ నాయకులు గ్రామ ఉప సర్పంచ్ గడ్డం ఉపేందర్ రెడ్డి తల్లి మరణించడంతో వారి కుటుంబాన్ని సోమవారం మాజీ మంత్రి సత్యవతి రాథోడ్ వారి స్వగృహం చేరుకొని గడ్డం పుల్లమ్మ చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించి మనోధైర్యాన్ని కల్పించారు. అనంతరం పసునుంటి మల్లారెడ్డి కాలు ప్రమాదానికి గురి కావడంతో వారిని పరామర్శించారు. ఈ సందర్భంగా ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని వారిని సూచించారు. వారితోపాటు బిఆర్ఎస్ నాయకులు గ్రామ సర్పంచి లకావత రవికుమార్,బోడపట్ల సుధాకర్ ,కోట వెంకటరెడ్డి,గాయం జగదీశ్వర్ రెడ్డి,గంట్ల పాపిరెడ్డి,నాగినబోయిన నరసయ్య, బోడపట్ల శ్రీను,పులుసు వెంకన్న,పులుసు వీరన్న,ఎస్ కే యాకూబ్,గంట్ల సోమిరెడ్డి,ఓర సాయిలు,బోడపట్ల వెంకన్న,లింగాల బాబు,దుబ్బాక సురేష్,దుబ్బాక్ లింగ నాయక్,లింగాల మహేందర్, రేఖ వెంకటనారాయణ,పంతుల్య, ఇందుర్తి శేషురెడ్డి,గంటల నరేష్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

# సక్సెస్ ఫుల్‌గా మారథాన్ రన్ యూత్ వీక్ సెలబ్రేషన్స్





**అమరచింత, మే 18, (నినాదం):** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న 99 రోజులు ప్రజా పాలన - ప్రగతి ప్రణాళిక యూత్ వీక్ సెలబ్రేషన్ కార్యక్రమం సోమవారం ఆత్మకూరు మున్సిపాలిటీ కార్యాలయం వద్ద సోమవారం అధికారులు ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో భాగంగా జాతర మైదానం నుండి మున్సిపల్ కార్యాలయం వరకు మారథాన్ రన్ ర్వహించడం జరిగింది. అనంతరం మున్సిపల్ కార్యాలయ ప్రాంగణంలో యోగ నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ శ్రీమతి జీ. నాగమణి, వైస్ చైర్మన్ శ్రీ ఎం. శ్రీనివాసులు, కమిషనర్ శ్రీ చికినే శశిధర్, ఎస్సై జయన్న కౌన్సిలర్లలు, వార్డు ఆఫీసర్లు, జూనియర్ అసిస్టెంట్లు, కంప్యూటర్ ఆపరేటర్లు, బిల్ కలెక్టర్లు, మెప్మా ఆర్పీలు, కోచ్ లు ఖాదర్, శివ కుమార్, స్థానిక క్రీడాకారులు పాల్గొన్నారు.

# ఆధ్యాత్మికతతో పాటు సాంస్కృతిక వాతావరణం

### భాషా సంస్కృతిక శాఖ సంచాలకులు నరసింహారెడ్డి



**మహాదేవపూర్ మే 18, (నినాదం);** దక్షిణ కాశీగా పేరుగాంచిన కాళేశ్వరం లో ఈనెల 21 నుండి జూన్ 1 వరకు జరిగే సరస్వతి అంతే పుష్కరాలలో ఆధ్యాత్మికతతో పాటు సాంస్కృతిక వాతావరణాన్ని కల్పించే కార్యక్రమాలను నిర్వహించాలని భాషా సంస్కృతిక శాఖ సంచాలకులు ఏనుగు నరసింహారెడ్డి అన్నారు. సోమవారం జయశంకర్ భూపాలపల్లి జిల్లా కాళేశ్వరం లో ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భక్తులకు ఆధ్యాత్మికతతో పాటు సాంస్కృతిక వాతావరణంలోని కల్పించేలా ప్రముఖ కళాకారులతో పాటు తెలంగాణ సాంస్కృతిక సారథి కళాకారులు భక్తులను ఆకట్టుకునే విధంగా సంగీత, నృత్య, జానపదాలు వంటి కళా ప్రదర్శనలు నిర్వహించినున్నట్లు ఆయన తెలిపారు. సాంస్కృతిక కార్యక్రమాలు సమయపాలనతో క్రమబద్ధంగా నిర్వహించేందుకు తగిన చర్యలు తీసుకోవాలని, వేదికలు, సౌండ్, లైటింగ్ సిస్టం తదితర ఏర్పాట్లు సమగ్రంగా ఉండేలా చూడాలని సూచించారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా అవసరమైన సదుపాయాలు కల్పించాలని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ సాంస్కృతిక సారథి కార్యాలయ పరిపాలన అధికారి విజయ్, భూపాల పల్లి టి ఎస్ ఎస్ కళాకారుడు మైసా శంకరయ్యతో పాటు పలువురు పాల్గొన్నారు.

# ఎన్ఎస్‌పి పాత కాలువ దుస్థితిపై బీజేపీ ఫైర్..

### నేలకోండపల్లి ప్రజావాణిలో కలెక్టర్‌కు బీజేపీ వినతి..

### 15 మంది లస్కర్లు ఉండి కాలువ శుభ్రం చేయరా.?



**పాలేరు మే 18( నినాదం):** నేలకొండపల్లి మండల పరిధిలోని ఎన్ ఎస్ పి పాత కాలువ దుస్థితిపై భారతీయ జనతా పార్టీ నేలకొండపల్లి మండల కమిటీ ఆధ్వర్యంలో సోమవారం నేలకోండపల్లి మండలంలో జరిగిన ప్రజావాణి కార్యక్రమంలో జిల్లా కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా బీజేపీ మండల అధ్యక్షులు పాగర్తి సుధాకర్ మాట్లాడుతూ,మండల పరిధిలో ఉన్న ఎన్ ఎస్ పి పాత కాలువలో పేరకపోయి నాసు, తుంగ, కాలువకు ఇరువైపులా విపరీతంగా చెట్లు పెరిగిపోయాయి. మరో 15 రోజుల్లో వ్యవసాయ సీజన్ మొదలుకానున్నా అధికారుల నిర్లక్ష్యంతో చెత్తాచెదారం పేరుకుపోయి చివరి ఆయకట్టు రైతులకు నీరు అందక తీవ్రంగా ఇబ్బంది పడుతున్నారు అని ఆవేదన వ్యక్తం చేశారు.మండలంలో 15 మంది లస్కర్లు ఉన్నప్పటికీ చెత్త నాసు క్లియరింగ్ చేయకుండా కాలం వెళ్లదీస్తున్నారు. రైతుల సమస్యలను పట్టించుకోని ఇరిగేషన్ అధికారులపై కఠిన చర్యలు తీసుకోవాలి అని బీజేపీ శ్రేణులు డిమాండ్ చేశారు. చివరి భూముల వరకు సాగునీరు అందేలా వెంటనే కాలువలు బాగు చేయాలని వినతిపత్రంలో కోరారు.ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా కార్యవర్గ సభ్యులు మన్నే కృష్ణారావు, మండల ప్రధాన కార్యదర్శి మల్లెబోయిన గోవిందరావు, మండల ఉపాధ్యక్షులు కొండా హర్షవర్ధన్, మండల కిసాన్ మోర్చా అధ్యక్షులు పుట్టా సత్యనారాయణ, మండల అధికార ప్రతినిధి సూరెపల్లి జ్ఞానరత్నం, మండల నాయకులు మూడు రమేష్, ఎలిగేటి గిరి, బీజేపీ ఓబీసీ మోర్చా మండల అధ్యక్షులు పిట్టల సూరిబాబు తదితరులు పాల్గొన్నారు.

# 20న దేశ వ్యాప్త మెడికల్ షాపులు బంద్



**పాలేరు మే 18( నినాదం):** ఈ నెల 20 దేశ వ్యాప్తంగా మెడికల్ షాపులు బంద్ చేస్తున్నట్లు మెడికల్ షాపు అసోసియేషన్ ప్రతినిధులు పసుపులేటి ఉపేందర్ పేర్కొన్నారు. నేలకొండపల్లి మండల కేంద్రంలో మెడికల్ షాపు బంద్ విషయం పై స్థానిక తహశీల్దార్, ఎస్సై లకు వినతి పత్రం ను అందించారు. అనంతరం కరపత్రంను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు.కార్పోరేట్ సంస్థల దోపిడి ధరల విధానం ను స్థిరపడిన ఔషద పంపిణీ వ్యవస్థ పై తీవ్ర ప్రభావం చూపుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఫార్మసీ రక్షణ కోసం, ప్రజాఆరోగ్య పరిరక్షణ కోసం ఆందోళన చేపడుతున్నట్లు తెలిపారు. ఈ ఫార్మసీ అక్రమ కార్యకలపాలను నిలిపివేయాలని డిమాండ్ చేశారు. పెద్ద కంపెనీల అన్యాయ ధరల విధానం నిలిపివేయాలని కోరారు. చిన్న తరహా, మరియు పెద్ద తరహా కెమిస్ట మనగడుకు కాకుండా ప్రజారోగ్యంపై కూడ తీవ్ర ప్రమాదాల ను కలిగిస్తున్నాయని అన్నారు. పలు డిమాండ్ల 'సాధన కోసం మెడికల్ షాపు యాజమానులు దుకాణాల బంద్ ను చేయనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మెడికల్ షాపులు ప్రతినిధులు పి.వెంకటేశ్వరరావు. సురేష్, జగదీష్, ఫరీద్బాబా, ఉదయ్, సాయిబాబా, వి.నారాయణరావు, రాంప్రసాద్, కైలాసపు గోపి తదితరులు పాల్గొన్నారు.

# ప్రజాప్రతినిధులు, అధికారుల యోగ



**మహాదేవపూర్ మే 18, (నినాదం):** ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా సోమవారం జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహాదేవపూర్ మండల కేంద్రంలో ఎంపీడీవో కార్యాలయం వద్ద ఉన్న పార్కులో అధికారులు ప్రజాప్రతినిధులు యోగ నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా గ్రంధాలయ చైర్మన్ కోట రాజబాపు మాట్లాడుతూ యోగ వల్ల శరీర దారుఢ్యం, మానసిక ఉల్లాసం, మనిషి ఆరోగ్యంగా ఉండడానికి ఉపయోగపడుతుందని ఆయన అన్నారు.ఈ కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ హసీనాబాను అక్బర్ ఖాన్, ఎంపీడీవో రవీంద్రనాథ్, ఐకెపి ఎపిఎం రాజన్న తో పాటు పలువురు ప్రజాప్రతినిధులు, పలు శాఖల అధికారులు పాల్గొన్నారు.

# రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు

- మేడిపల్లిలో వ్యవసాయ అవగాహన సదస్సు
- సేంద్రియ సాగుతోనే భూమి ఆరోగ్యం పరిరక్షణ
- ఆధునిక పద్ధతులతో తక్కువ ఖర్చు.. అధిక దిగుబడుల సాధన



**నల్లబెల్లి, మే 18 (నినాదం):** వరంగల్ జిల్లా నల్లబెల్లి మండలం రైతులు సంప్రదాయ సాగుతో పాటు శాస్త్రీయ వ్యవసాయ పద్ధతులను అనుసరించడం ద్వారా తక్కువ ఖర్చుతో అధిక దిగుబడులు సాధించవచ్చని వ్యవసాయ శాస్త్రవేత్తలు సూచించారు. మేడిపల్లి గ్రామంలో రైతులకు ప్రత్యక్ష అవగాహన కల్పించే ఉద్దేశంతో "రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు" కార్యక్రమాన్ని నిర్వహించారు. గ్రామ రైతులు పెద్ద సంఖ్యలో పాల్గొన్న ఈ కార్యక్రమంలో వ్యవసాయ శాస్త్రవేత్తలు డి. వీరన్న, బి. రజిత రైతులతో నేరుగా మాట్లాడి పంటల నిర్వహణ, నేల ఆరోగ్యం, ఎరువుల వినియోగం, నీటి పొదుపు వంటి అంశాలపై పలు సూచనలు చేశారు.ఈ సందర్భంగా శాస్త్రవేత్తలు మాట్లాడుతూ, అధికంగా రసాయన యూరియా వినియోగించడం వల్ల నేల సారవంతత క్రమంగా తగ్గిపోతుందనిహెచ్చరించారు. రసాయన ఎరువుల వినియోగాన్ని తగ్గిస్తూ సేంద్రియ ఎరువులు, పశువుల ఎరువు, జీవామృతం వంటి ప్రకృతి ఆధారిత పద్ధతులను ఎక్కువగా ఉపయోగించాలని సూచించారు. నేల ఆరోగ్యాన్ని కాపాడుకోవడం ద్వారా దీర్ఘకాలంలో పంటల ఉత్పాదకతమెరుగుపడుతుందని వివరించారు.పంటల మార్పిడి విధానాన్ని రైతులు తప్పనిసరిగా పాటించాలని సూచించారు. ఒకే పంటను వరుసగా సాగు చేయడం వల్ల నేలలో పోషకాల సమతుల్యత,దెబ్బతింటుందని, తెగుళ్ళు, పురుగుల సమస్యలు పెరిగే అవకాశం ఉంటుందని తెలిపారు. వరి తర్వాత పప్పుధాన్యాలు, నూనెగింజల పంటలు సాగు చేయడం వల్ల నేల సారవంతత పెరుగుతుందని చెప్పారు.ప్రస్తుత పరిస్థితుల్లో నీటి సంరక్షణ అత్యంత అవసరమని శాస్త్రవేత్తలు పేర్కొన్నారు. డ్రిప్, స్ప్రింక్లర్ వంటి సూక్ష్మ సాగునీటి పద్ధతులను వినియోగించడం ద్వారా నీటిని ఆదా చేయడంతో పాటు పంటలకు అవసరమైన మోతాదులోనే నీరు అందించవచ్చని తెలిపారు. వర్షాభావ పరిస్థితులనుఎదుర్కొనేందుకు నీటి నిల్వ పద్ధతులు, మల్చింగ్ విధానాలను అమలు చేయాలని సూచించారు.రైతులు ఆధునిక సాంకేతికతను వినియోగించుకోవాలని శాస్త్రవేత్తలు సూచించారు. మొబైల్ యాప్‌ల ద్వారా వాతావరణ సమాచారం, మార్కెట్ ధరలు, తెగుళ్ల నివారణ సూచనలు తెలుసుకుని వ్యవసాయాన్ని లాభదాయకంగా మార్చుకోవచ్చున్నారు. శాస్త్రీయ పద్ధతులను అనుసరించడం వల్ల ఉత్పత్తి ఖర్చులు తగ్గడంతో పాటు అధిక దిగుబడులు సాధించే అవకాశం ఉంటుందని రైతులకు వివరించారు. కార్యక్రమంలో రైతులు తమకు ఎదురవుతున్న సమస్యలను శాస్త్రవేత్తల దృష్టికి తీసుకెళ్లారు. పంటల్లో వస్తున్న తెగుళ్లు, ఎరువుల వినియోగం, సాగునీటి కొరత వంటి అంశాలపై సందేహాలు నివృత్తి చేసుకున్నారు. గ్రామ స్థాయిలో ఇలాంటి అవగాహన కార్యక్రమాలు నిర్వహించడం వల్ల రైతులకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని రైతులు అభిప్రాయపడ్డారు.

# మెడికల్ షాపుల బంద్‌ను విజయవంతం చేయండి



**సూర్యాపేట ప్రతినిధి మే 18 (నినాదం) :** ఆల్ ఇండియా ఆర్గనైజేషన్ ఆఫ్ కెమిస్ట్ అండ్ డ్రగ్గిస్ట్ అసోసియేషన్, తెలంగాణ కెమిస్ట్ అండ్ డ్రగ్గిస్ట్ అసోసియేషన్ కేంద్ర ప్రభుత్వ వైఖరికి నిరసనగా ఈనెల 20న దేశవ్యాప్త మెడికల్ షాప్ లు బంద్ కు పిలుపునివ్వగా సూర్యాపేట జిల్లా వ్యాప్తంగా ఒకరోజు మెడికల్ దుకాణాల బందుకు సంబంధించి జిల్లా కలెక్టర్ తేజస్ నందు లాల్ పవర్ కు ముందస్తుగా సమాచారం తెలియజేసే పత్రాన్ని అందజేశారు. అనంతరం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ అక్రమ ఈ ఫార్మసీ వల్ల ప్రజా ఆరోగ్యానికి ముప్పు వాటిల్లే ప్రమాదం ఉందని అన్నారు. కోవిడ్ కాలంలో జారీ చేసిన తాత్కాలిక నోటిఫికేషన్ జి ఎస్ ఆర్ 220 ను వెంటనే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. ప్రజలకు ఎటువంటి ఇబ్బంది కలగకుండా పట్టణంలోని వినాయక మెడికల్ వేదశ్రీ మెడికల్ కార్తికేయ మెడికల్ , దుకాణాలను అందుబాటులో ఉంచుతామని అన్నారు ఒకరోజు నిర్వహించే మద్దతు సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో కెమిస్ట్ అండ్ డ్రగ్గిస్ట్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు యామ ప్రభాకర్ ఫార్మసిటికల్ డిస్ట్రిబ్యూటర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు హరిప్రసాద్, గిరి గౌడ్ ,శ్రీనివాస్ లింగయ్య తదితరులు పాల్గొన్నారు.

# రంగాపురం చెరువులో ఉపాధి పనులు వేగం

- ఎండల మధ్య కూలీలకు భరోసా, ఓఆర్ఎస్ పంపిణీ..
- నీడ, తాగునీటి సదుపాయాలు,కూలీల సంక్షేమానికి ప్రాధాన్యమిస్తున్న గ్రామ పంచాయతీ



**నల్లబెల్లి, మే 18 (నినాదం):** వరంగల్ జిల్లా నల్లబెల్లి మండలం రంగాపురం గ్రామంలోని ఊర చెరువులో మహాత్మా గాంధీ జాతీయ ఉపాధి హామీ పథకం కింద చేపట్టుతున్న అభివృద్ధి పనులు జోరుగా కొనసాగుతున్నాయి. గ్రామానికి చెందిన మహిళలు, రైతు కుటుంబాలు, ఉపాధి కూలీలు పెద్ద సంఖ్యలో పనుల్లో పాల్గొంటూ ప్రభుత్వం కల్పిస్తున్న 100 రోజుల ఉపాధి అవకాశాన్ని వినియోగించుకుంటున్నారు. చెరువు పూడికతీత, మట్టి తరలింపు, కట్ట బలోపేతం వంటి పనులు వేగంగా సాగుతున్నాయి.వేసవి తీవ్రత రోజురోజుకూ పెరుగుతున్న నేపథ్యంలో కూలీల ఆరోగ్య రక్షణకు గ్రామ పంచాయతీ ప్రత్యేక చర్యలు చేపట్టింది. పనిస్థలంలో చల్లని తాగునీరు, విశ్రాంతి కోసం తాత్కాలిక నీడ ఏర్పాట్లు, మెడికల్ కిట్ సదుపాయం కల్పించారు. అదనంగా కూలీలకు ఓఆర్ఎస్ ప్యాకెట్లు పంపిణీ చేసి వడదెబ్బ బారిన పడకుండా అవగాహన కల్పించారు.గ్రామ సర్పంచ్ ఓరుగంటి మాధురి రాజు పనిస్థలాన్ని సందర్శించి కూలీలతో మాట్లాడారు. వారి ఆరోగ్య పరిస్థితులను తెలుసుకుని అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఉపాధి పనులు కేవలం ఆదాయం కోసం మాత్రమే కాకుండా గ్రామాభివృద్ధికి కూడా దోహదపడాలి. కూలీల భద్రత మా మొదటి ప్రాధాన్యం అని ఆమె పేర్కొన్నారు.చెరువు పనులు పూర్తయితే భూగర్భ జలాల నిల్వ పెరగడంతో పాటు రైతులకు సాగునీటి సమస్య కొంతవరకు తగ్గే అవకాశం ఉందని గ్రామ పెద్దలు తెలిపారు. ఉపాధి పనులను పారదర్శకంగా నిర్వహిస్తూ కూలీలకు సమయానికి వేతనాలు అందేలా చర్యలు తీసుకుంటున్నామని అధికారులు వెల్లడించారు. గ్రామస్థులు మాట్లాడుతూ, ఉపాధి హామీ పనులను కూలీల ఆరోగ్యాన్ని దృష్టిలో పెట్టుకుని నిర్వహించడం అభినందనీయమన్నారు. రంగాపురంలో అమలు చేస్తున్న విధానం ఇతర గ్రామాలకు ఆదర్శంగా నిలుస్తోందనిఅభిప్రాయపడ్డారు.ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి రామారావు, ఆశా వర్కర్ శనిగరం లత, ఫీల్డ్ అసిస్టెంట్ సుమన్, ఉపాధి కూలీలు తదితరులు పాల్గొన్నారు.


# బారసాల మహోత్సవ కార్యక్రమానికి హాజరైన బచ్చలకూరి నాగరాజు..



**పాలేరు మే 18( నినాదం):** పాలేరు నియోజకవర్గం నేలకొండపల్లి మండలం కోరట్లగూడెం గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ నాయకులు గుండా చంద్రశేఖర్ మనవరాలు బారసాల మహోత్సవ కార్యక్రమానికి ఖమ్మంజిల్లా కాంగ్రెస్ పార్టీ అధికార ప్రతినిధి బచ్చలకూరి నాగరాజు హాజరై చిన్నారిని ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో పసుపులేటి నరేష్,గుండ వంశీ,గుండ నరేష్,షేక్ మహబూబ్ పాషా షేక్ నజీర్,కొత్తపల్లి సాయికుమార్,షేక్ షాజహాన్ తదితరులు పాల్గొన్నారు.

# సీఎం రిలీఫ్ ఫండ్‌తో బాధిత కుటుంబానికి ఊరట

- నల్లబెల్లిలో చెక్ అందజేసిన కాంగ్రెస్ నాయకులు
- ఎమ్మెల్యే దొంతి మాధవ రెడ్డి సేవలను కొనియాడిన నేతలు



**నల్లబెల్లి, మే 18 (నినాదం):** వరంగల్ జిల్లా నల్లబెల్లి మండలం ఆర్థికఇబ్బందులతో బాధపడుతున్న కుటుంబాలకు ప్రభుత్వం అందిస్తున్న సీఎం రిలీఫ్ ఫండ్ అండగా నిలుస్తోంది. మండల కేంద్రానికి చెందిన ప్రసాద్‌కు మంజూరైన సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కును స్థానిక కాంగ్రెస్ నాయకులు అందజేశారు. ఎమ్మెల్యే దొంతి మాధవ రెడ్డి ఆదేశాల మేరకు నల్లబెల్లి కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మాలోత్ చరణ్ సింగ్ బాధిత కుటుంబాన్ని పరామర్శించి చెక్కును అందించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ, అత్యవసర పరిస్థితుల్లో సీఎం రిలీఫ్ ఫండ్ పేద, మధ్యతరగతి కుటుంబాలకు పెద్ద ఆధారంగా,మారుతోందన్నారు. వైద్య చికిత్సలు, ప్రమాదాలు, అనారోగ్య సమస్యలతో ఇబ్బందులు ఎదుర్కొంటున్న కుటుంబాలకు ఈ నిధులు ఆర్థిక భరోసా కల్పిస్తున్నాయని పేర్కొన్నారు. ప్రభుత్వం ప్రజా సంక్షేమానికి పెద్దపీట వేస్తోందని తెలిపారు. మాలోత్ చరణ్ సింగ్ మాట్లాడుతూ, ప్రజల సమస్యలను వెంటనే పరిష్కరించేందుకు ఎమ్మెల్యే దొంతి మాధవ రెడ్డి నిరంతరం కృషి చేస్తున్నారని కొనియాడారు. నియోజకవర్గ ప్రజలకు అవసరమైన ప్రతి ప్రభుత్వ పథకం చేరేలా చర్యలు తీసుకుంటున్నారని తెలిపారు. ప్రజల కష్టసుఖాల్లో అండగా ఉండటం కాంగ్రెస్ పార్టీ లక్ష్యం అని పేర్కొన్నారు. చెక్కు అందుకున్న ప్రసాద్ కుటుంబ సభ్యులు ప్రభుత్వానికి, ఎమ్మెల్యేకు, కాంగ్రెస్ నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు. ఇలాంటి సహాయం తమకు ఆర్థికంగా ఎంతో ఊరటనిచ్చిందని అన్నారు. నాయకులు కుటుంబ సభ్యులను పరామర్శించి ధైర్యం చెప్పారు.ఈ కార్యక్రమంలో బత్తిని మల్లయ్య, వైనాల వీరస్వామి, భూస కుమారస్వామి, సామల దేవేందర్, బొర్రా యెసబ్ భాస్కర్, సారంగం తదితరులు పాల్గొన్నారు. కార్యక్రమం సాదాసీదాగా జరిగినప్పటికీ నాయకులు, కార్యకర్తల పాల్గొనడంతో ఆత్మీయ వాతావరణం నెలకొంది.